PRAJASAKTI Regd.No. 15795/68 సిటీ

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 31 | విజయవాడ, గురువారం 31 ఆగస్టు 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50


Vol No | Vijayawada, Thursday 31 August 2023 | Rs

## రాష్ట్ర రైతాంగంపై 'నానో' రుద్దుడు

- ప్రైవేటు డీలర్లకు బలవంతంగా స్టాక్స్
- కర్షకులకు అంటగడుతున్న వ్యాపారులు
- ఆర్‌బికెల్లోనూ అమ్మకాలు
- కేంద్రం ఒత్తిడికి తలొగ్గిన ఏపి సర్కార్

లోపలి పేజీలో..

## జయహో.. ప్రజ్ఞానంద...



- ప్రపంచకప్ చెస్ రన్నరప్‌కు చెన్నై విమానాశ్రయంలో ఘన స్వాగతం

లోపలి పేజీలో..




విజయవాడలో నిర్వహించిన సమరభేరి ర్యాలీలో వి శ్రీనివాసరావు తదితరులు

# ముఖం చాటేసిన మేఘం

## ఖరీఫ్‌ను దెబ్బతీయనున్న వర్షాభావం

- రబీ సాగుపైనా ప్రభావం
- వాతావరణ శాస్త్రవేత్తల అంచనా



న్యూఢిల్లీ: దేశంలోని చాలా ప్రాంతాల్లో రుతుపవన వర్షాల సుదీర్ఘ విరామం ఖరీఫ్ పంట దిగుబడిని దెబ్బతీసే ప్రమాదముంది. ఆలాగే రాబోయే రబీ నాట్లు ఆలస్యం కావచ్చు. మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్, పంజాబ్, గుజరాత్ వంటి ప్రధాన వ్యవసాయక రాష్ట్రాల్లో ఆగస్టులో దీర్ఘకాల సగటుతో పోల్చితే నైరుతి రుతుపవనాల వర్షపాతం 30 నుంచి 80 శాతం లోటు కనిపిస్తుంది. సెప్టెంబరు5-6 తేదీల్లో బంగాళాఖాతంలో కొన్ని కదలికలు వచ్చే అవకాశముందని వాతావరణ శాస్త్రవేత్తలు భావిస్తున్నప్పటికీ ఈ లోటును పూడ్చే స్థాయిలో నైరుతి వర్షాలు ఉండే సూచనలు కానరావడం లేదు. 'ఎల్‌నినో సంవత్సరాల్లో 70 శాతం దాకా సెప్టెంబరులో వర్షపాతం లోటు కనీసం 10 శాతం ఉందని గుర్తుంచుకోవాలి', అని భూ శాస్త్రాల మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి , ప్రసిద్ధ రుతుపవన నిపుణుడు మిగతా 7లో

| రాష్ట్రాలు | వర్షపాతం లోటు (%) |
|---|---|
| హర్యానా | -58 |
| పంజాబ్ | -63 |
| ఆంధ్రప్రదేశ్ | -47 |
| ఒడిషా | -34 |
| మధ్యప్రదేశ్ | -34 |
| గుజరాత్ | -89 |
| మహారాష్ట్ర | -56 |
| తెలంగాణ | -62 |
| కర్ణాటక | -74 |
| కేరళ | -90 |

* ఆగస్టు 1 నుంచి ఆగస్టు 28 మధ్య రుతుపవనాల వర్షపాత లోటు
ఆధారం : ది గ్రెయిన్ ఇండియా అండ్ ట్రేడర్స్

## గ్యాస్ ధర తగ్గింపు
# ఎన్నికల జిమ్మిక్కే

- గ్యాస్ రూ.400కు, యూనిట్ విద్యుత్ రూపాయికే ఇవ్వాలి
- వి. శ్రీనివాసరావు డిమాండ్
- సిపిఎం సమరభేరీ ప్రారంభం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

గ్యాస్ ధరను తగ్గించడం ఎన్నికల జిమ్మిక్కేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ అధికధరలు, నిరుద్యోగం, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా సిపిఎం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమరభేరీ కార్యక్రమాన్ని ఆయన విజయవాడలోని బీసెంట్ రోడ్‌లో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నిరకాల నిత్యావసర వస్తువుల ధరలతోపాటు గ్యాస్ ధరను కూడా మోడీ ప్రభుత్వం విపరీతంగా పెంచిందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే గ్యాస్ సిలిండర్‌పై 200 రూపాయలు తగ్గిస్తున్నట్లు ఇప్పుడు ప్రకటించిందన్నారు. మోడీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా గ్యాస్ సిలిండర్‌ను రూ. 400కే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కరెంటును పేద ప్రజలకు యూనిట్ ఒక్క రూపాయికే ఇవ్వాలన్నారు. పేద మధ్య తరగతి ప్రజలను పట్టి పీడిస్తున్న అధికధరలు, నిరుద్యోగాన్ని నియంత్రించలేని ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం తక్షణం గద్దెదిగాలని డిమాండ్ చేశారు. కాకినాడలో లభ్యమయ్యే గ్యాస్‌ను ఇక్కడి ప్రజలకు ఇవ్వకుండా ఎక్కడో వున్న గుజరాత్‌కు తరలిస్తున్నారని అన్నారు నరేంద్రమోడి ఆదేశాలమేరకే రాష్ట్రాన్ని జగన్‌మోహన్‌రెడ్డి అదానీకి తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. విద్యుత్ చార్జీలను ఇష్టారాజ్యంగా పెంచుతున్నారని అన్నారు. పేదలకు యూనిట్ రూపాయి, చిన్న పరిశ్రమలకు రూ2.50లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం అదానీ కోసం రాష్ట్రంలో విద్యుత్ కనెక్షన్‌లకు స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. ఈ విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయకపోతే సెప్టెంబర్ 4న పెద్దఎత్తున ఆందోళనను చేపడతామని అన్నారు. అలాగే దేశంలో విజన్ వున్న నాయకుడు నరేంద్రమోడి అంటున్న చంద్రబాబు మైనార్టీలపై జరుగుతున్న దాడులపై స్పందించాలన్నారు. మతోన్మాద బిజెపితో స్నేహం కోసం చంద్రబాబునాయుడు తహతహలాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబునాయుడులు మిగతా 2లో

రాష్ట్ర వ్యాప్తంగా సమరభేరి 2

## హైకోర్టు సిజెతో సిఎం మర్యాదపూర్వక భేటీ


**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్ర హైకోర్టు ప్రధానన్యాయమూర్తిగా ఇటీవల నియమితులైన జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సాయంత్రం 8 గంటల ప్రాంతంలో భార్య భారతితో కలిసి జగన్ వెళ్లారు. విజయవాడలోని బందరు రోడ్డులో ఉన్న చీఫ్ జస్టిస్ బంగ్లాలో జస్టిస్ ధీరజ్ దంపతులను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.

## "స్మైల్ ప్లీజ్ !"....

- విక్రమ్ ల్యాండర్‌ని ఫొటో తీసిన ప్రజ్ఞాన్ రోవర్
- విడుదల చేసిన ఇస్రో

లోపలి పేజీలో..



ప్రజ్ఞాన్ రోవర్ తాజాగా తీసిన విక్రమ్ ల్యాండర్ ఫొటో

## అక్టోబరు 14, 15 తేదీల్లో ఎస్‌ఐ తుది పరీక్షలు

- పోలీస్ రిక్రూట్‌మెంటు బోర్డు ఛైర్మన్ అతుల్ సింగ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో ఎస్‌ఐ పోస్టుల అభ్యర్థులకు అక్టోబరు 14, 15 తేదీల్లో తుది పరీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంటు బోర్డు ఛైర్మన్ అతుల్ సింగ్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షలు విశాఖపట్నం, ఏలూరు, గుంటూరు, కర్నూలులో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌ఐ తుది రాత పరీక్షలో మొత్తం నాలుగు పేపర్లు ఉంటాయని అన్నారు. రెండు పేపర్లు సబ్జెక్టు తరహా విధానంలో, మరో రెండు పేపర్లు బిట్స్ రూపంలో ఉంటాయని పేర్కొన్నారు. అక్టోబరు 14న ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పేపర్-1, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 411 ఎస్‌ఐ పోస్టులకు ఫిబ్రవరి 19న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించగా, 57,923 మంది అర్హత సాధించారని, ఇందులో 56,130 మంది అభ్యర్థులకు ప్రస్తుతం ఆగస్టు 25 నుంచి విశాఖపట్నం, ఏలూరు, గుంటూరు, కర్నూలులో దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ దేహదారుఢ్య పరీక్షలు పూర్తికాగానే తుది పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో హాల్ టికెట్ తీసుకోవాలని కోరారు.

## సామాజిక సంక్షోభంపై దృష్టిపెట్టండి

- ప్రభుత్వానికి పాలగుమ్మి సాయినాథ్ సూచన

**ప్రజాశక్తి- ఏఎన్‌యు (గుంటూరు జిల్లా)**

దేశంలో సామాజిక సంక్షోభం ఏర్పడిందని, దీనికి పరిష్కారం కనుగొనే దిశగా పాలకులు నూతన విధానాలు రూపొందించాలని ప్రముఖ జర్నలిస్టు, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత డాక్టర్ పి.సాయినాథ్ అన్నారు. భారతదేశంలో ఎన్నో సంక్షోభాలను చూశామని, ప్రస్తుతం నెలకొన్న సామాజిక సంక్షోభం నుంచి విముక్తి పాలసీలు రావాలని ఆయన పేర్కొన్నారు. సాయినాథ్ రచించిన ఆఖరియోధులు (స్వాతంత్ర్య పోరాట పదాతి సైనికులు) అనే పుస్తకాన్ని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఫ్యాకల్టీలతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో సాయినాథ్ మాట్లాడారు. 75 ఏళ్ల స్వతంత్ర భారత్ నేడు ఆజాదీకా అమృత్ మహోత్సవ్ జరుపుకుంటోందన్నారు. ఈ అమృత్ మహోత్సవ్లో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని దేశ సేవ చేసిన వారికి, ప్రస్తుతం జీవించి ఉన్న వారికి గుర్తింపు దక్కకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. వారి గురించి ఒక్క ఫొటోగానీ, వ్యాసంగానీ అమృత్ మహోత్సవ్ వెబ్‌లో లేకపోవడం విచారకరమన్నారు.



ఆఖరియోధులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విసి, సాయినాథ్ తదితరులు

ఆ క్రమంలోనే ఆఖరి యోధులు పేరుతో లివింగ్ ఫ్రీడమ్ ఫైటర్స్ గురించి పుస్తకం రచించినట్లు తెలిపారు. దేశానికి సేవ చేసిన రైతులు, కూలీలు, వంట మనుషులు, కార్పెంటర్లు, మహిళల పాత్రలను ఈ పుస్తకంలో పొందుపర్చినట్లు వివరించారు. సాంకేతిక ప్రగతితోపాటు ప్రజల సమ్మిళిత, సంతులిత అభివృద్ధి మాత్రమే నిజమైన మానవ వికాసానికి ప్రతీక అని అన్నారు. ప్రపంచ దేశాల చారిత్రక సత్యాలను భావితరాలకు తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. సైద్ధాంతిక ఆరోపణలు, నూతన ప్రతిపాదనలు లేకుండా, ఉన్నది ఉన్నట్లుగా భావితరాలకు చూపాలని సూచించారు. మీడియా రంగం గ్రామీణ సమస్యల పరిష్కారం, రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తే అనుకున్న లక్ష్యాలు సాధించి సమాజ సంక్షోభం నుంచి విముక్తి కలిగే అవకాశాలుంటాయని పేర్కొన్నారు. 2010లో వచ్చిన వ్యవసాయ సంక్షోభం నేడు రూపాంతరం చెందిందని తెలిపారు. వ్యవసాయ రంగంలో వినూత్న సంస్కరణలు తీసుకొచ్చిన స్వామినాథన్ కమిటీ నివేదికలను అప్పటి యుపిఎ ప్రభుత్వం, ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వం బుట్టదాఖలు చేశాయన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు 90 శాతం కార్పొరేట్ల కబంధ హస్తాల్లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్‌చైర్మన్ ఎంవైఎస్.నాగిరెడ్డి మాట్లాడుతూ దేశంలో రైతులు సంక్షోభంలో ఉన్నారన్నారు. వైస్‌ఛాన్సలర్ రాజశేఖర్ మాట్లాడుతూ యూనివర్సిటీ విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి, సమాజ వికాసానికి తోడ్పాటునందిస్తున్నామన్నారు. విద్యార్థులు, అధ్యాపకుల సందేహాలను సాయినాథ్ నివృత్తి చేశారు. రెక్టార్ పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, డాక్టర్ జి.అనిత, ఆర్‌టిఐ కమీషనర్ శామ్యూల్ జనాథన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశలు చిదిమేసిన ప్రభుత్వం

- ఒపిఎస్ కోసం ఉద్యమం
- ఉపాధ్యాయ సంఘాల నాయకులు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ ఉద్యోగుల ఆశలను చిదిమేస్తోందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన గ్యారంటీ పెన్షన్ స్కీమ్‌ను (జిపిఎస్)ను వ్యతిరేకిస్తూ యుటిఎఫ్, ఎస్‌టియు, ఎపిటిఎఫ్-1938, ఆప్టా ఉమ్మడిగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశాయి. ఈ సందర్భంగా యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్, ఎస్‌టియు అధ్యక్షులు ఎన్ సాయి శ్రీనివాస్, ఎపిటిఎఫ్-1938 ప్రధాన కార్యదర్శి ఎస్ చిరంజీవి మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాలుగున్నరేళ్ల తరువాత జిపిఎస్ విధానం తీసుకొచ్చారన్నారు. మంగళవారం జరిగిన చర్చలతో సిపిఎస్ ఉద్యోగుల్లో ఉన్న కొద్దిపాటి ఆశలు కూడా ఆవిరయాయ్యయని అన్నారు.

విధివిధానాలు చెప్పకుండా కేవలం 50 శాతం పెన్షన్, దానిపై ఇచ్చే డియర్‌నెస్ రిలీఫ్ రెండింటి చుట్టూనే మొత్తం చర్చ జరిపారని పేర్కొన్నారు. రిటైర్‌మెంటు అనంతరం ఉద్యోగికి ఇవ్వాల్సిన 60 శాతం పెన్షన్ ఫండ్‌ను చెల్లించకుండా దానినే ముదుపుచేసి 50 శాతం పెన్షన్ ఇస్తామని చెప్పడం ద్వారా జిపిఎస్ అసలు ముసుగును ప్రభుత్వం తొలగించిందన్నారు. జిపిఎస్‌కు సంబంధించిన డ్రాఫ్ట్ కూడా ఇవ్వకుండా అమలు చేసేందుకు ప్రభుత్వం ఎందుకు ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 2004 కంటే ముందు నియామకపు ప్రక్రియ పూర్తయిన 11 వేల మందికి పాతపెన్షన్ విధానం అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు.

2019లో సిపిఎస్ కాంట్రిబ్యూషన్ ఉద్యోగులు 10 శాతం, రాష్ట్ర ప్రభుత్వాలు 14 శాతం చెల్లించాలని కేంద్రం మెమో జారీ చేసిందని, దీనిని ఇప్పటికీ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. కొన్ని ఉద్యోగ సంఘాల నాయకులు సిపిఎస్ ఉద్యోగుల ఆవేదన గమనించకుండా ప్రభుత్వానికి వంతపాడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని అన్నారు.

ఒపిఎస్ కోసం చిత్తశుద్ధితో పోరాడుతున్న ఉపాధ్యాయ సంఘాలపై బురద చల్లడం సబబు కాదన్నారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలనేదే తమ లక్ష్యమని, అందుకోసం ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. మిగిలిన ఉపాధ్యాయ సంఘాలను కలుపుకుని ఒపిఎస్ విధానం పునరుద్ధరణకై త్వరలో కార్యాచరణ ప్రకటించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, ఉద్యోగ సంఘాలు కూడా తమతో కలిసి రావాలని కోరారు.

## విద్యార్థి కుటుంబానికి పరామర్శ

- తక్షణ సాయంగా రూ.20 వేలు అందజేత
- ముజఫర్‌నగర్‌లో మతవివక్ష బాధిత కుటుంబాన్ని కలిసిన సిపిఎం నేతలు



బాధితులను ఓదార్చుతున్న సుభాషిణి అలీ, జాన్ బ్రిట్టాస్

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో మతపరమైన విష భావజాలంతో ఉన్న ఉపాధ్యాయురాలి సూచనల మేరకు సహవిద్యార్థుల చేతిలో దెబ్బలుతిన్న ఏడేళ్ల విద్యార్థికి, ఆ కుటుంబానికి సిపిఎం భరోసా ఇచ్చింది. బాధిత కుటుంబంలో ఉన్న ఇద్దరు పిల్లల చదువుకయ్యే ఖర్చును భరిస్తామని తెలిపింది. తక్షణ సాయంగా రూ.20 వేలు అందజేసింది. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు సుభాషిణి అలీ, సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్‌ల నేతృత్వంలోని బృందం బుధవారం ముజ్‌ఫర్‌నగర్‌లో పర్యటించింది. ఈ పర్యటన తన కుమారుడి కష్టాలపై ఆవేదన నుంచి ఇంకా తేరుకోని ఇర్షాద్‌కు ఆత్మవిశ్వాసంతోపాటు ఓదార్పునిచ్చింది. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇర్షాద్‌కు అండగా ఉంటానన్న సందేశాన్ని బ్రిట్టాస్ తెలియజేశారు. కావాలంటే కేరళలో ఉచిత విద్యను అందిస్తానని విద్యా మంత్రి వి శివన్‌కుట్టి వాగ్దానం గురించి కూడా బ్రిట్టాస్ తెలిపారు. వేదనలో ఉన్న తమకు కేరళ మద్దతు ఇచ్చినందుకు ఇర్షాద్ కృతజ్ఞతలు తెలియజేశారు. కేరళ తరహాలో ఉత్తరప్రదేశ్ కూడా మతసామరస్యం నెలకొనాలని ఆకాంక్షించారు.

బాధిత విద్యార్థిని సుభాషిణీ అలీ, జాన్‌బ్రిట్టాస్ దగ్గరకు తీసుకుని, ఆత్మీయంగా ముచ్చటించారు. కేరళ ఓనం కానుకను బ్రిట్టాస్ అందజేసినప్పుడు ఎంతో ఆనందం వ్యక్తం చేశాడు. "ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్లో మా అబ్బాయిని చేర్పించాను. సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం కల్పిస్తామని అధికారులు తెలిపారు. ఇక్కడ ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం పేరుకు మాత్రమే. అందుకే నా చిన్న కొడుకుని కష్టపడి ప్రైవేట్ స్కూల్లో చదివిస్తున్నాను. ముగ్గురి పిల్లల్లో రెండోవాడు ఆర్థిక ఇబ్బందులతో చదువు ఆపేశాడు. ఆ పిల్లవాడికి పదహారేళ్లు, అన్నయ్యతో కలిసి పంజాబ్‌లో కూలి పనికి వెళ్లాడు. తన చదువును తిరిగి కొనసాగించాలనే కోరిక వచ్చి స్కూల్‌లో చేరాడు. చెరకు సాగుతో కొద్దిపాటి ఆదాయం వస్తుందని' బాలుడి తండ్రి ఇర్షాద్ అన్నారు.

### కుతుబ్‌పూర్ మతపరమైన వివక్ష

పదేళ్ల క్రితం ముజఫర్‌నగర్ జిల్లాలో చెలరేగిన మతకల్లోలాలు తాకని కొన్ని ప్రాంతాల్లో కుతుబ్‌పూర్ ఒకటి. గ్రామంలో చాలా వరకు హిందూ-ముస్లిం చిన్న రైతులు చెరకు మిగతా 7లో

## ఏనుగు దాడిలో దంపతుల మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- మృతదేహాలతో ఆందోళనకు దిగిన కుటుంబసభ్యులు, గ్రామస్తులు

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్, గుడిపాల**

ఏనుగు దాడిలో భార్యాభర్తలు మృతి చెందారు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. చిత్తూరు జిల్లా గుడిపాల మండలం 190 రామాపురం సమీపంలో బుధవారం చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... ఉదయం ఆరు గంటల సమయంలో రాసనపల్లి మామిడితోపులో పని చేసేందుకు ఆరుగురు వ్యవసాయ కూలీలు వెళ్లారు. వారికి అక్కడ ఏనుగు కనిపించడంతో భయంతో పరుగులు తీశారు. వారిలో కార్తిక్ అనే యువకుడిపై ఏనుగు దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం వేలూరు సిఎంసి స్థానికులు తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న అటవీ శాఖాధికారులు, రెవెన్యూ శాఖాధికారులు గుట్టల వైపు ఏనుగును తరుముతూ వెళ్లారు. వారికి అక్కడ పంట పొలాల్లో రామాపురం దళితవాడకు చెందిన భార్యభర్తలు సెల్వి (48) వెంకటేష్ (52) తీవ్ర గాయాలతో కనిపించాయి. ఈ ప్రాంతానికి సమీపంలో ఏనుగు ఘీంకారాలు వినిపించాయి. ఏనుగు వారిపై కూడా దాడి చేసి ఉంటుందని అధికారులు నిర్ధారణకు వచ్చారు. స్థానికుల సహాయంలో పొలాల మీదుగా వారిని బయటకు తీసుకొచ్చారు. అప్పటికే భార్యభర్తలు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆగ్రహానికి గురయ్యారు. అటవీ శాఖ నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందంటూ మృతదేహాలతో చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. చిత్తూరు ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు, అటవీ శాఖాధికారులు, ఎంపిపి సర్ధి చెప్పడంతో ఆందోళన విరమించారు.



గుండెలవిసేలా విలపిస్తున్న మృతుల బంధువులు, ఓదార్చుతున్న ఎంఎల్‌ఎ శ్రీనివాసులు

**మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో**

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో అందించనున్నట్లు అటవీ శాఖాధికారి చైతన్య కుమార్‌రెడ్డి ప్రకటించారు. మృతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించనున్నట్లు ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎపిఎస్ ఆర్‌టిసి వైస్‌చైర్మన్ విజయానందరెడ్డి తన సొంత నిధుల నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

## 2న ఆదిత్య ప్రయోగం

**ప్రజాశక్తి-సూళ్లూరుపేట (తిరుపతి)**



ఆదిత్య ఎల్-1 ప్రయోగంపై దేశ ప్రజల్లో ఆసక్తి పెరిగింది. సెప్టెంబర్ రెండున 11.50 గంటలకు శ్రీహరి కోట నుంచి పిఎస్‌ఎల్‌వి సి-57 రాకెట్ ద్వారా ఆదిత్యఎల్-1 ప్రయోగించనున్నారు. 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని లాగ్రా సియు1(ఎల్1) అనే చోట హాలో కక్షలో ఉపగ్రహం చేరి సూర్యుడుపై పరిశోధనలు చేయనుంది. ఇందుకుగాను నాలుగు నెలలకు పైగా సమయం పడుతుంది. ఏపిఎస్-ఎల్‌వి-సి57 ఆదిత్య ఎల్1 మిషన్ ప్రయోగానికి సన్నాహాలు జరుగుతున్నాయని... లాంచ్ రిహార్సల్ - వెహికల్ అంతర్గత తనిఖీలు పూర్తయ్యాయి' అని ట్విట్టర్‌లో ఇస్రో పోస్ట్ చేసింది. సూర్యుడిని అధ్యయనం చేసే లక్ష్యంతో ప్రారంభించబడిన భారతదేశపు మొట్టమొదటి సోలార్ మిషన్ ఆదిత్య-ఎల్1. ఈ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు వెల్లువెత్తాయి.

## ఉద్యోగులకు అలవెన్సులు చెల్లించండి

- ఆర్‌టిసి ఎన్‌ఎంయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగులకు సంబంధించి గతంలో ఇచ్చిన అన్ని రకాల అలవెన్సులను మళ్లీ చెల్లించేందు చర్యలు తీసుకోవాలని ఎపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ కోరింది. ఈ మేరకు బుధవారం ఎపిఎస్‌ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు కెఎస్ బ్రహ్మానందరెడ్డికి ఎన్‌ఎంయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పివి రమణారెడ్డి, వై శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు. ఆర్‌టిసిలో కండక్టర్లు, డ్రైవర్లు, స్కాడ్, ఆడిట్ తదితర విభాగాల సిబ్బందికి అలవెన్సుల్లో కోతలు విధించడంతో సొంత ఖర్చులతో విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. గతేడాది సెప్టెంబరు నుండి ఆర్‌టిసి ఉద్యోగులకు దాదాపు రూ.2.5 కోట్ల అలవెన్స్‌లను చెల్లించాల్సి వుందన్నారు. తక్షణమే ఆర్‌టిసి ఉద్యోగులందరికీ డేఅవుట్, నైట్ అవుట్ అలవెన్సులు చెల్లించాలని కోరారు. అలాగే డిఎ ఎరియర్స్ చెల్లించాలన్నారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు దైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501**కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## లీగల్ సర్వీసెస్ కమిటీలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీలో ఖాళీగా ఉన్న ఐదు పోస్టుల భర్తీకి బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. అభ్యర్థులు సెప్టెంబరు 14వ తేదీ సాయంత్రం ఐదుగంటల్లోపు అందేలా రిజిస్టర్ పోస్టు ద్వారా దరఖాస్తులు పంపాలని కార్యదర్శి తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీలో ఒక సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రెండు స్టెనోకం టైపిస్టు, ఆఫీసు సబార్డినేట్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎపిఎస్‌ఎల్‌ఎస్‌ఎ.ఎపి.ఎన్‌ఐసి.ఇన్ వెబ్‌సైట్లో దరఖాస్తులు పొందొచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులు రిజిస్టర్ పోస్టు ద్వారా మినహా మరే ఇతర పద్ధతుల్లోనూ స్వీకరించబోమని ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక భవన సముదాయం, నేలపాడు, అమరావతి 522202 పేరుతో పంపాలని కోరారు.

## మహిళల రిజర్వేషన్ల కోసం పోరాడుతాం

- రక్షాబంధన్ వేడుకల్లో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల కోసం టిడిపి పోరాడుతుందని, నిలబడుతుందని ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. రాజకీయాల్లో మహిళల పాత్ర ఇంకా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో రక్షాబంధన్ వేడుకలు, బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. తెలుగు ఆడబిడ్డలను శక్తిమంతమైన మహిళలుగా మార్చడమే తన లక్ష్యమన్నారు. మగవారితో సమానంగా మహిళలు పోటీపడే పరిస్థితి రావాలని అన్నారు. విద్య, ఉద్యోగ, అవకాశాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు టిడిపి తీసుకురావడంతో వారు లబ్ధి పొందారని తెలిపారు. ఎన్‌టిఆర్ మహిళలకు ఆస్తి హక్కు కల్పిస్తూ చట్టం చేశారని, వారికోసం ప్రత్యేకంగా పద్మావతి యూనివర్సిటీ తీసుకొచ్చారని అన్నారు.

## గ్యాస్ ధర తగ్గింపు ఎన్నికల జిమ్మిక్కే

( మొదటి పేజీ తరువాయి )

ప్రధాని మోడీకి ఒత్తాసు పలకడం దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాలాంటి అంశాల్లో బిజెపి చేసిన ద్రోహంపై వారు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు మాట్లాడుతూ . జగన్‌మోహన్‌రెడ్డి, నరేంద్రమోడి ప్రభుత్వాలు పోటీలు పడి ప్రజలపై బారాలు మోపుతున్నారని అన్నారు. తొమ్మిదేళ్లకాలంలో గ్యాస్ ధరను రూ 800 పెంచి ఇపుడు ఎన్నికలు వస్తున్నాయని మభ్యపెట్టే రీతిలో రూ 200లు తగ్గిస్తున్నారని అన్నారు. మోడీకి తొమ్మిదేళ్లుగా గుర్తుకురాని రాకీపండుగ ఇపుడే ఎందుకు గుర్తుకు వచ్చిందో బిజెపి ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలని డిమాండ్ చేశారు . ధరలను నియంత్రించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు కె ప్రభాకర్‌రెడ్డి, నగరకార్యదర్శి దోనెపూడి కాశీనాథ్, నాయకులు వై కేశవరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర రైతాంగంపై 'నానో' రుద్దుడు

- ప్రైవేటు డీలర్లకు బలవంతంగా స్టాక్స్
- కర్షకులకు అంటగడుతున్న వ్యాపారులు
- చాలా చోట్ల పేరుకుపోయిన నిల్వలు
- ఆర్‌బికెల్లోనూ అమ్మకాలు
- కేంద్రం ఒత్తిడికి తలొగ్గిన ఎపి సర్కార్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

శాస్త్రీయంగా నిరూపణ కాని నానో యూరియాను కేంద్ర ప్రభుత్వం గతేడాది నుంచి మన రాష్ట్ర రైతాంగంపై బలవంతంగా రుద్దుతోంది. ప్రైవేటు డీలర్లకు, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో నడుస్తున్న రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె)కు అంటకడుతోంది. కేంద్రం ఒత్తిడి మేరకు ఎపి సర్కారు కింది స్థాయి అధికారులకు ఆర్‌బికెల నుంచి నానో యూరియా కోసం ఇండెంట్లు పెట్టాలని, రైతులకు వాటిని అమ్మాలని సూచిస్తోంది. రైతుల్లో అంతగా ఆసక్తి లేకపోవడం, సాధారణ యూరియాకు మల్లే పని చేసే విషయంలో సరైన నిర్ధారణలు లేనందువలన కింది స్థాయి సిబ్బంది ఇండెంట్లు పంపట్లేదు. ప్రైవేటు డీలర్ల వద్ద నానో యూరియా స్టాక్ అమ్ముడు పోక అలాగే పడి ఉంటోంది.

**లారీకి పది కేసులు**

సాధారణ యూరియాకు ప్రత్యామ్నాయం పేరిట మోడీ ప్రభుత్వం ఇఫ్కో నుంచి నానో యూరియాను విడుదల చేసింది. ఇఫ్కో ఉత్పత్తి చేసిన నానో యూరియాను రాష్ట్రాలకు కేటాయిస్తోంది. మన రాష్ట్రానికి కేటాయించే సాధారణ యూరియాలో 50 శాతం ఆర్‌బికెలకు, 50 శాతం ప్రైవేటు డీలర్లకు కేటాయిస్తున్నారు. ప్రైవేటు డీలర్లకు పంపించే సాధారణ యూరియాకు, నానో యూరియాను ముడిపెట్టి బలవంతంగా అంటగడుతున్నారు. ఒక లారీ సాధారణ యూరియాకు పది కేసులు అంతకంటే ఎక్కువ నానో యూరియా సీసాలు వేసి పంపుతున్నారు. ఒక లారీలో పది టన్నుల సాధారణ యూరియా రవాణా అవుతుంది. వాటిపై పది కేసుల నానో యూరియా కలిపి పంపుతున్నారు. నానో యూరియా ద్రవ రూపంలో ఉంటుంది. ఒక్కో బాటిల్‌లో 500 మిల్లీలీటర్లు ఉంటుంది. అటువంటి బాటిల్స్ ఒక్కో కేసులో 40 ఉంటాయి. నలభై ఎకరాలకు ఒక కేసు సరిపోతుంది. పది కేసులు డీలర్లకు అంటగట్టడంతో చేసేది లేక కుదిరిన చోట రైతులకు డీలర్లు వేరే ఎరువుతో లింక్ పెట్టి అంటగడుతున్నారు. ఒక్కో చోట రైతులు తీసుకోకపోవడంతో సగానికి సగం ధర తగ్గిస్తున్నారు. ఒక్కో బాటిల్‌కు ఎంఆర్‌పి రూ.245గా నిర్ణయించగా అందులో సగానికి ఇస్తున్నారు. అయినప్పటికీ రైతులు నిరాకరించడంతో పక్కన పడేస్తున్నారు. తమ వద్ద నానో యూరియా స్టాక్ పక్కన పడేశామని ఒక డీలర్ తెలిపారు. సాధారణ యూరియా 45 కిలోల బస్తా ధర రూ.266.50 కాగా అంతకంటే తక్కువకు నానో యూరియా వస్తున్నా శాస్త్రీయత నిర్ధారణ కాకపోవడంతో రైతులు ఆసక్తి చూపట్లేదని చెప్పారు. త్వరలో నానో డిఎపి సైతం మార్కెట్‌లోకి వస్తుందంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

**ఇండెంట్ల కోసం ఫోర్స్**

గతేడాది నుంచీ ఆర్‌బికెలపై వ్యవసాయశాఖ పై అధికారుల నుంచి నానో యూరియా తీసుకోవాలన్న ఒత్తిడి క్రమంగా పెరుగుతోంది. కేంద్రం బలవంతంతో వ్యవసాయశాఖ హెడ్‌క్వార్టర్స్ నుంచి కింది స్థాయి అధికారులకు నానో అమ్మాలని తరచు ఆదేశాలు వెళుతున్నాయి. ప్రైవేటు డీలర్లకు మల్లే లింక్ లేకపోయినా నానో యూరియా కోసం ఆర్‌బికెల నుంచి ఇండెంట్లు కోరుతున్నారు. ఆర్‌బికెలకు నోడల్ ఏజెన్సీగా ఉన్న మార్క్‌ఫెడ్ వద్ద నానో యూరియా నిల్వలున్నాయని, వాటిని వదిలించుకునేందుకు ఆర్‌బికెలపై ఒత్తిడి చేస్తున్నారని సమాచారం. వర్షాభావంతో ఈ ఏడాది అసలు పంటలే సాగుకాని పరిస్థితుల్లో ఎరువులకు డిమాండ్ తగ్గగా, నానో యూరియా అమ్మాలనడంపై క్షేత్రస్థాయి సిబ్బంది వాపోతున్నారు. నత్రజని అధికంగా కావాల్సిన వరి, మిరప, పత్తి తదితర పంటలకు నానో యూరియా సూట్ కాదని, నత్రజని తక్కువ అవసరమయ్యే కూరగాయల వంటి కొన్ని పంటలకు నానో కొద్ది మేర సరిపోవచ్చని వ్యవసాయాధికారులు అభిప్రాయపడుతున్నారు. కృషి విజ్ఞాన కేంద్రాలు, ఇతర ప్రభుత్వ రిసెర్చ్ సెంటర్లలో నానో యూరియా వినియోగించట్లేదు. కేవలం ప్రైవేటు ఎరువుల వ్యాపారుల ద్వారా రైతులకు అంటగడుతున్నారు. అక్కడక్కడ ఆర్‌బికెలకు పంపుతున్నారు.

## ప్రజల్లో ఆదరణ లేనందునే పొత్తుల కోసం చంద్రబాబు తపన : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజల్లో ఆదరణ కోల్పోయినందునే టిడిపి కార్యకర్తలను కాపాడుకునేందుకు చంద్రబాబు నాయుడు పొత్తులపై తహతహలాడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. చంద్రబాబు రాజకీయ జీవితంలో పొత్తులు లేని చరిత్ర ఎప్పుడూ లేదన్నారు. తాడేపల్లిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బిజెపిని తిట్టిన నోటితోనే ఇప్పుడు పొగుడుతున్నారని, ఇది దివాళా కోరుతనం కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అన్ని స్థానాలకూ అభ్యర్థులను పెట్టలేని పార్టీలు తమను విమర్శిస్తున్నాయని, పొత్తులు లేకుండా ఎన్నికలకు పోయే ధైర్యం చంద్రబాబుకు ఎన్నడూ లేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 70 శాతం ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి వెన్నంటి వున్నారని అన్నారు. లోకేష్ పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన రావడం లేదని టిడిపి కార్యకర్తలే ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఎన్‌టిఆర్ భార్య లక్ష్మీపార్వతిని పిలవకుండా ఆయన పేరిట జరిగే కార్యక్రమం జరపడం అంటే ఎన్‌టిఆర్‌కు మరోసారి వెన్నుపోటు పొడవడమేనని అన్నారు. రాష్ట్రంలో పురందేశ్వరి బిజెపి కోసం కాకుండా టిడిపి కోసం ఏజెంటుగా పనిచేస్తున్నారని ఆరోపించారు.

## చేనేతపై పడని 'ముద్ర'



- లక్ష్యానికి బహుదూరంగా సాయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

చేనేత కార్మికులను ఆదుకునేందుకు కేంద్రం అమలు చేస్తున్న ముద్ర పథకం నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఈ పథకం కింద భారీ లక్ష్యాలను ప్రకటించినప్పటికీ ఆచరణ దానికి ఆమడ దూరంటో ఉంది.

లబ్దిదారుల సంఖ్యలో కూడా భారీ కోతలు పెడుతున్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలో 9,705 మందికి లబ్ది చేకూర్చేందుకు బ్యాంకులకు లక్ష్యంగా నిర్ణయించారు. దీనికోసం 4,852 కోట్లు వెచ్చించాలని నిర్దేశించుకున్నారు. అయితే అమలులోకి వచ్చేసరికి మాత్రం భారీ తేడా కనిపిస్తోంది. వాస్తవ లక్ష్యానికి, బ్యాంకులకు అందించిన దరఖాస్తులకు, అందులో మంజూరు చేసినవాటికి, మంజూరు చేసిన వాటిలో పంపిణీ చేసిన వాటికి మధ్య అంతరాలు భారీగా పెరుగుతున్నాయి. ఇప్పటివరకు రాష్ట్రంలో కేవలం 403 మందికే సాయం అందింది. దానికోసం వెచ్చించిన నిధులు కూడా నామమాత్రంగా రూ. 283 కోట్లు మాత్రమే కావడం గమనార్హం. ఖరారు చేసిన దరఖాస్తుల మేరకు ఇంకా 867 మందికి మాత్రమే ఇవ్వాల్సి ఉందని, అది కూడారూ. 716 కోట్లు మాత్రమేనని చెబుతున్నారు. పెండింగ్ సాయంపై బ్యాంకర్లతో చర్చలు జరుగుతున్నప్పటికీ ఫలితం మాత్రం ఆశాజనకంగా లేదని అధికారులు అంటున్నారు. బ్యాంక్లతో రాష్ట్ర ప్రభుత్వం గురువారం నిర్వహించనున్న సమావేశంలోనూ దీనిపై చర్చ జరగనుందని సమాచారం.

| అంకెలో | ముద్ర | లక్ష్యం |
|---|---|---|
| ఖరారైన దరఖాస్తులు | 9705మందికి | రూ. 4,852 కోట్లు |
| మంజూరైనవి | 1482 మందికి | రూ. 1104 కోట్లు |
| పంపిణీ జరిగినవి | 615 మందికి | రూ.389 కోట్లు |
| పెండింగ్‌లో | 403 మందికి | రూ. 283 కోట్లు |

# రాష్ట్ర వ్యాప్తంగా సమరభేరి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ
- ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి- యంత్రాంగం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై సిపిఎం బుధవారం సమరభేరి మోగించింది. ఆ విధానాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటి ప్రచారం నిర్వహించింది. కరపత్రాలు పంపిణీ చేసింది. నిత్యావసర ధరల పెరుగుదల, విద్యుత్ ఛార్జీల భారాలు, నిరుద్యోగ సమస్యపై ప్రజల నుంచి సిపిఎం శ్రేణులు సంతకాలు సేకరించాయి. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రజలపై భారాలు మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని కోరారు. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి మత విద్వేషాలు రేపుతోందని, దానికి తాజాగా మణిపూర్, హర్యానాలో జరిగిన అల్లర్లే ఉదాహరణ అని అన్నారు. మన రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపికి వైసిపి, టిడిపి ఎంపిలు పార్లమెంట్‌లో మద్దతు పలుకడం సిగ్గుచేటని పేర్కొన్నారు.





వైఎస్‌ఆర్ జిల్లా బద్వేలులో సంతకాల సేకరణలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్

వైఎస్‌ఆర్ జిల్లా కడప, బద్వేలుల్లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ గతంలో రూ.400 ఉన్న సిలిండర్ ధర మోడీ పాలనలో రూ.1200కు పెరిగిందన్నారు. త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల్లో లబ్ధి కోసం గ్యాస్ సిలిండర్ ధర రూ.200 తగ్గించారని తెలిపారు. నిత్యాసరాల ధరలు వంద రోజుల్లో తగ్గిస్తానని 2014లో హామీ ఇచ్చి నమ్మకద్రోహం చేశారని విమర్శించారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ధరలు పెంచి దేశ ప్రజలపై మోయలేని భారాలు మోపారని తెలిపారు. కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ సంస్కరణల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం లొంగిపోయి ఆంధ్రప్రదేశ్‌ను బలిచేస్తోందని, విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తానని నమ్మబలికి నేడు సర్దుబాటు ఛార్జీల పేరుతో భారాలు వేసి మోసగించిందని అన్నారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం సూరంపల్లిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచిందన్నారు. అనంతపురం జిల్లా గార్లదిన్నెలో సమరభేరి జీపు జాతాను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ ప్రారంభించారు. ఈ జాతా పుట్లూరు, నార్పల తదితర మండలాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాలో మరోసారి కరువు పరిస్థితులు వచ్చాయన్నారు. ఈ సంవత్సరం సకాలంలో వర్షాలు రాకపోవడంతో సుమారు నాలుగు లక్షల ఎకరాల్లో విత్తనాలు వేయలేదని తెలిపారు. వేసిన 5.62 లక్షల ఎకరాల్లో అత్యధిక భాగం పంటలు ఎండిపోతున్నాయన్నారు.



కాకినాడలో నిర్వహించిన సమరభేరిలో చంటిపిల్లలను ఎత్తుకుని సంతకం చేస్తున్న మహిళ

ఈ పరిస్థితుల్లో వ్యవసాయానికి తొమ్మిది గంటల కరెంటు అమలు చేయాలని, ఎండిపోతున్న పంటలకు నష్టపరిహారాన్ని ప్రభుత్వం ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై విశాఖ నగరంలోని పలు ప్రాంతాల్లో సిపిఎం శ్రేణులు ప్రచారం నిర్వహించాయి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక, తంతడి గ్రామాల్లో సిపిఎం నాయకులు ఇంటింటికీ వెళ్లి మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండల కేంద్రంలో వారపు సంతలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఎటపాక, కూనవరంల్లో పోస్టర్లను ఆవిష్కరించారు. పాడేరులోని ఎంఆర్‌సి కాలనీలో ర్యాలీ నిర్వహించారు. చింతపల్లి, అరకులోయల్లో సంతకాల సేకరణ చేపట్టారు. ఏలూరు జిల్లా నిడమర్రు మండలం అడవికొలనులో సచివాలయం వద్ద ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం అందించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు, ఎన్‌టిఆర్, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో సిపిఎం సమరభేరి ప్రారంభమైంది.

# బిసిలకు ప్రత్యేక రక్షణ చట్టం

- ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీల పథకాలను పునరుద్ధరిస్తాం : లోకేష్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జంగారెడ్డిగూడెం

వైసిపి ప్రభుత్వం వచ్చాక 26 వేల మంది బిసిలపై అక్రమంగా కేసులు పెట్టిందని, టిడిపి అధికారంలోకొచ్చాక ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం తరహాలో బిసిలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర 199వ రోజుకు చేరింది. బుధవారం ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలం బొర్రంపాలెంలో ప్రారంభమై జంగారెడ్డిగూడెం పట్టణం వరకూ సాగింది. పాదయాత్రలో భాగంగా మత్స్యకారులు, గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులు, న్యాయవాదులతో లోకేష్ మాట్లాడారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులకు పరిహారం ఇస్తామని రైతులకు హామీ ఇచ్చారు. జంగారెడ్డిగూడెంలో జరిగిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు జగన్‌ను నమ్మడం లేదన్నారు. 45 ఏళ్లుదాటిన వారికి పెన్షన్ అని చెప్పి మోసం చేశారని, అమ్మఒడి ఇంటిలో ఒకరికే ఇచ్చి వంచించారని, వారం రోజుల్లోగా సిపిఎస్ రద్దు అని చెప్పి జిపిఎస్ అని మోసం చేశారని, పోలీసుల అలెన్సులు రద్దు చేశారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలు కొట్టాలంటూ పిలుపునిచ్చారు. వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీల సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. చింతలపూడి ఎమ్మెల్యే ఎలిజా అవినీతికి పాల్పడుతున్నారని, మట్టి ఇసుక అక్రమంగా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గోదావరిలో ఇసుకంతా దోచేస్తున్నారని, పోలవరం మట్టితో కోట్లు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ప్రశ్నిస్తే చంపేస్తానని బెదిరిస్తున్నారని, మీడియాపైన కేసులు పెడుతున్నారన్నారు. టి.నరసాపురం సొసైటీలో ఎమ్మెల్యే బినామీలు రూ.120 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. మంత్రిగా పని చేసిన ఆళ్లనాని ఇలాకాలో సురక్షిత తాగునీరు లేదని, మంత్రి తానేటి వనితకు తన శాఖలో బదిలీలు కూడా తెలియడం లేదని అన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న లోకేష్

## ఇంటర్ ఫెయిల్ విద్యార్థుల ఫీజు షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థుల కోసం పరీక్ష ఫీజు షెడ్యూల్ ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. ఈ మేరకు బోర్డు కార్యదర్శి సౌరబ్ గౌర్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చిలో జరగనున్న పరీక్షలకు సెప్టెంబరు 30వ తేదీలోపు ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఫెయిలైన, డ్రాపౌట్ అయిన జనరల్, వొకేషన్ కోర్సుల విద్యార్థులు చెల్లించాలని తెలిపారు. ప్రథమ, లేదా ద్వితీయ సంవత్సరం జనరల్, వొకేషషన్ కోర్సుల విద్యార్థులు థియరీ పేపర్లకు రూ.550, ప్రాక్టికల్ పరీక్షలకు రూ.250, పరీక్ష ఫీజు కింద రూ.150 చెల్లించాలి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెండు సబ్జెక్టులకు హాజరయ్యే విద్యార్థులు రూ.1100, ప్రాక్టికల్ పరీక్షలకు రూ.500, పరీక్ష ఫీజు కింద రూ.300 చెల్లించాల్సి ఉంటుంది. సెప్టెంబరు ఒకటి నుంచి విద్యార్థులు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా చెల్లించాలి.





ఉక్కు కార్మికులతో కలిసి దీక్షలో కూర్చున్న కెఎ పాల్

## ఉక్కు ప్రయివేటీకరణ ఆపకుంటే.. ప్రధాని ఇంటి ముందు ఆమరణ దీక్ష : కెఎ పాల్

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపకుంటే ప్రధాని మోడీ ఇంటి ఎదుట ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ పాల్ హెచ్చరించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 930వ రోజుకు చేరుకున్నాయి. శిబిరం వద్దకు వచ్చిన పాల్ ఉక్కు కార్మికులతో కలిసి పోరాటంలో భాగస్వాములయ్యారు. తొలుత మౌన దీక్ష చేపట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలన్న తపన ఆంధ్రా ఎంపిల్లో కనబడడంలేదన్నారు. రాష్ట్రంలోని ఎంపిలు, ఎమ్మెల్యేలు దద్దమ్మలని, అందుకే స్టీల్‌ప్లాంట్ విషయంలో ఏమీ చేయలేకపోతున్నారని విమర్శించారు. కేంద్రం దిగివచ్చి ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపేవరకూ తన పోరాటం కొనసాగుతుందన్నారు. మంగళవారం తన ఉక్కు దీక్షను భగ్నం చేసిన పోలీసులపై న్యాయపోరాటం చేస్తానని తెలిపారు. దీక్షల్లో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్ అయోధ్యరాం, నాయకులు రామచంద్రరావు, కెఎస్‌ఎన్ రావు, పెంటారావు, వెంకటరావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

**చంపేందుకు కుట్ర**

తన ఉక్కు ఆమరణ దీక్షను మంగళవారం పోలీసులు భగ్నం చేసి అనంతరం హాస్పిటల్‌కు తీసుకెళ్లి తనకు ప్రమాదకర ఇంజక్షన్లు ఇచ్చి చంపడానికి ప్రయత్నించారని పాల్ ఆరోపించారు. బుధవారం సాయంత్రం ఆశీల్‌మెట్ట జంక్షన్ వద్ద ఉన్న తన ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సిఎం జగన్ మోహన్ రెడ్డి అదానీతో కుమ్మక్కై పోలీసులను ఉసిగొల్పి తన దీక్షను బలవంతంగా విరమింపజేశారని, పోలీసులు తన కాలును తీవ్రంగా గాయపరిచారని తెలిపారు. సెప్టెంబర్ ఐదులోపు స్టీల్‌ప్లాంట్ అంశంపై జగన్ స్పందించకుంటే ఆయన ఇంటి ముందు దీక్ష చేపడతానని హెచ్చరించారు.

## చిరుత దాడి కేసులో మృతురాలి కుటుంబానికి చేసిన సాయం తక్కువే

- రూ.30 లక్షలు ఇచ్చేలా ఆలోచన చేయాలి
- టిటిడికి హైకోర్టు సూచన

ప్రజాశక్తి-అమరావతి

తిరుమల నడకదారిలో భక్తులను వన్యప్రాణుల నుంచి రక్షించేందుకు తీసుకున్న చర్యలను వివరించాలని టిటిడిని హైకోర్టు ఆదేశించింది. ఇటీవల చిరుత దాడిలో మరణించిన బాలిక కుటుంబానికి ఇచ్చిన రూ.10 లక్షల ఆర్థికసాయం తక్కువని అభిప్రాయపడింది. ఈ మొత్తాన్ని రూ.30 లక్షలకు పెంపుదల అంశాన్ని పరిశీలించాలని సూచన చేసింది. బాలిక మృతితో కుటుంబం తీవ్ర మనోవేదనకు గురవుతోందని, టిటిడి ఆర్థికంగా అత్యున్నత స్థాయిలో ఉందని వ్యాఖ్యానించింది. అలిపిరి నడకదారిలో ఇనుప పెన్సింగ్ వేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ టిటిడి మాజీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి దాఖలు చేసిన పిల్‌ను బుధవారం చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎవి శేషసాయితో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించిన హైకోర్టు విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

## అసైన్డ్ పట్టాలిస్తే.. తీర్పుకు లోబడే ఉండాలి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

సిమెంటు తయారీకి వినియోగించే లైమ్‌స్టోన్ ఖనిజ సంపద ఉన్న 10 వేల ఎకరాలను బనగానపలి వైసిపి ఎమ్మెల్యే కె రామిరెడ్డి అనుచరులకు అసైన్డ్ పట్టాలు పంపిణీ కేటాయింపు సిఫార్సులను సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైంది. నంద్యాల జిల్లా కొలిమిగుంట్ల మండలంలోని అంకిరెడ్డిపల్లి గనుల బ్లాక్ (పది గ్రామాల పరిధి)లో భూముల ఎసైన్డ్ చేస్తే అవి తాము వెలువరించే తుది తీర్పుకు లోబడి ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. గనులశాఖ నుంచి అనుమతులు తీసుకున్నాకే లీజులు ఇచ్చారో లేదో చెప్పాలని నంద్యాల కలెక్టరును చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎవి శేషసాయితో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. కేంద్ర గనులశాఖను సుమోటోగా ప్రతివాదిగా చేర్చింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. వైసిపి ఎమ్మెల్యే కె రామిరెడ్డి అనుచరులకు అసైన్డ్ కేటాయింపు సిఫార్సులను రద్దు చేయాలంటూ టిడిపి మాజీ ఎమ్మెల్యే జనార్ధన్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు.

## 2.0 కార్డ్ ప్రైమ్ వెర్షన్ ద్వారా రిజిస్ట్రేషన్లు

- ఒకటి నుంచి అమలుకు కసరత్తు
- టైమ్‌స్లాట్ బుక్ చేసుకున్న 20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- ఆందోళనలో డాక్యుమెంట్ రైటర్లు
- 3న విజయవాడలో రాష్ట్ర సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా స్టాంప్స్, అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ప్రస్తుతం వాడకంలో ఉన్న కార్డ్ 1.0 వెర్షన్ స్థానంలో ఇకపై 2.0 వెర్షన్ అమలులోకి రానుంది. కొత్త వెర్షన్‌ను ప్రభుత్వం సెప్టెంబరు 1 నుంచి అందుబాటులోకి తెస్తున్నప్పటికీ, రిజిస్ట్రేషన్ ప్రక్రియ దశలవారీ సెప్టెంబరు 15 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా నూటికి నూరు శాతం అమలయ్యేలా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం ఆ శాఖ కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్ (కార్డ్-ప్రైమ్ 2.0) అనే సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ఈ విధానం అమలు ద్వారా భౌతికంగా డాక్యుమెంట్లు లేకుండా ఇ-డాక్యుమెంట్ ద్వారా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సులభతరంగా చేసుకునే అవకాశం కలగనుంది. ఈ వెర్షన్ అమలు ద్వారా తమకు పని లేకుండా పోతుందని, తమ కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా ఇదే వృత్తిలో కొనసాగుతున్నాయని డాక్యుమెంట్ రైటర్లు పేర్కొంటున్నారు. అంతేకాకుండా స్టాంప్ వెండర్ల పొట్ట కొట్టేలా ఈ నిర్ణయం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రిజిస్ట్రేషన్ వ్యవహారాలు డిజిటల్ సంతకాలతో సాగనుందని, డిజిటల్ సంతకం ఎక్కడైనా పొరబాటున చోరీకి గురైతే వారికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని డాక్యుమెంట్ రైటర్లు పేర్కొంటున్నారు. ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త విధానాన్ని వ్యతిరేకిస్తూ సెప్టెంబరు 3న విజయవాడ జింఖానాగ్రౌండ్ సమీపంలోని కందుకూరి కళ్యాణ మండపంలో రాష్ట్ర డాక్యుమెంట్ రైటర్ల సంఘం కీలక సమావేశం నిర్వహించనుంది. సమావేశంలో కొత్త వెర్షన్‌పై చర్చించి ఏ రకమైన భవిష్యత్తు కార్యాచరణ చేపట్టాలనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నట్లు డాక్యుమెంట్ రైటర్ల సంఘం పేర్కొంటోంది. డాక్యుమెంట్ రైటర్ల వాదన ఒకలా ఉంటే ప్రభుత్వ వాదన మరోలా ఉంది. ప్రభుత్వమేమో ఆధునిక సాఫ్ట్‌వేర్‌తో భూముల కొనుగోలు, అమ్మకాల ప్రక్రియకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సులభతరమవుతుందని పేర్కొంటోంది. అంతేకాకుండా 2.0 వెర్షన్ ద్వారా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని తాము తయారు చేసుకున్న దస్తావేజు సాఫ్ట్‌కాపీ అప్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసుకోవచ్చని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ పేర్కొంది. నూతన విధానం ద్వారా దస్తావేజుల్లో వివరాలను ఎవరికి వారే నమోదు చేసుకోవడం వల్ల తప్పులు లేకుండా ఉంటాయని, ఆధార్‌తో లింక్ చేయడం వల్ల తప్పుడు వ్యక్తులు రిజిస్ట్రేషన్లకు పాల్పడే ప్రమాదం లేకుండా చేయొచ్చని పేర్కొంటోంది. డాక్యుమెంట్లు స్కానింగ్ ప్రక్రియ ఉండదు కాబట్టి రిజిస్ట్రేషన్ ప్రక్రియ 20 నిమిషాల్లో పూర్తవుతుందని ఆశాఖ తెలిపింది. నూతన విధానం ద్వారా తాము చెల్లించాల్సిన రిజిస్ట్రేషన్ ఛార్జీలు వివరాలను తామే క్యాలిక్యులేట్ చేసుకోవచ్చని, అలాగే రిజిస్ట్రేషన్ ఛార్జీలు సులభతరంగా ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా చెల్లించవచ్చని ప్రభుత్వం పేర్కొంటోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం తమకు కన్వీనియంట్ టైమ్‌లో స్లాట్ బుక్‌చేసుకుని 20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని, ఈ విధానంలో వినియోగదారులు ఎలాంటి ఫిజికల్ డాక్యుమెంట్లు సబ్ రిజిస్ట్రార్ వద్దకు తీసుకువెళ్లనవసరం లేదని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ పేర్కొంది.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి నార్పల (అనంతపురం జిల్లా)

అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్యకు చేసుకున్నారు. ఈ సంఘటన అనంతపురం జిల్లా నార్పల మండల పరిధిలోని దుగుమర్రి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. దుగుమర్రి గ్రామానికి చెందిన సాంబశివారెడ్డి (40) తనకున్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో వేరుశనగ, తదితర పంటలు సాగు చేసేవారు. గత మూడేళ్లుగా పంట చేతికిరాకపోవడంతో పెట్టిన పెట్టుబడి సైతం తిరిగి రాక నష్టాల పాలయ్యారు. పంటల సాగు, కుటుంబ పోషణకు రూ.8 లక్షల వరకు అప్పులు చేశారు. ఇటీవల కాలంలో సాంబశివారెడ్డి సోదరుడు మృతి చెందడంతో సోదరుని కుటుంబ పోషణభారం కూడా ఆయనపై పడింది. దీంతో తీవ్ర ఒత్తిడితో కొద్ది రోజుల క్రితం పక్షపాతానికి గురయ్యారు. వరుస కష్టాలతో మనోవేదనకు గురైన సాంబశివారెడ్డి తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. మృతుని భార్య, తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్లారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## 18 నుంచి టిటిడి బ్రహ్మోత్సవాలు

- పోస్టర్‌ను ఆవిష్కరించిన చైర్మన్

ప్రజాశక్తి - తిరుమల

ఈ ఏడాది అధికమాసం కారణంగా శ్రీవారికి రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సెప్టెంబర్ 18 నుంచి 26 వరకు, అక్టోబర్ 14 నుంచి 22 వరకు వీటిని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఇఒ ఎవి ధర్మారెడ్డి బుధవారం ఆవిష్కరించారు. తొలిరోజు సెప్టెంబర్ 18న ప్రభుత్వం తరుపున సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో సిఫార్సు లేఖలపై దర్శనాలు రద్దు చేస్తున్నట్లు చైర్మన్ వెల్లడించారు. యాత్రికుల వసతులు, భద్రతపై అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

## 1 నుంచి ఎపిటిఎ సమావేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమెరికన్ ప్రొగ్రెసివ్ తెలుగు ఫోరం (ఎపిటిఎ) 2023 జాతీయ సమావేశాలు సెప్టెంబరు ఒకటి నుంచి మూడో తేదీ వరకూ అట్లాంటాలో నిర్వహించనున్నట్లు అధ్యక్షులు కొట్టే ఉదయభాస్కర్ తెలిపారు. ఎపిటిఎ ఏర్పడి 15 ఏళ్లయిన సందర్భంగా 15 వసంతాల పండగనూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. అట్లాంటాలోని గ్యాస్ సౌత్ కన్వెన్షన్ సెంటర్లో మూడు రోజులపాటు జరిగే ఈ సమావేశాలకు ఆంధ్రా, తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఆప్తులను కన్వెన్షన్ కన్వీనర్ విజయ్ ద్వారా ఆహ్వానించినట్లు తెలిపారు. 2008లో కొద్దిమందితో ఏర్పడిన సంఘం ఇప్పుడు ఏడువేల మంది సభ్యులతో కొనసాగుతోందని పేర్కొన్నారు.

# నంది నాటక దరఖాస్తుల్లో 39 ఎంపిక

### రాష్ట్ర ఫిల్మ్, టివి, థియేటర్ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పోసాని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నంది నాటక అవార్డులకు ప్రభుత్వం నిర్ణయించిన ఐదు విభాగాల్లో తుది ప్రదర్శనకు 39 ఎంపిక చేశామని, ఎటువంటి విమర్శలకూ తావు లేకుండా ఈ ప్రక్రియ జరిగిందని, రాష్ట్ర ఫిల్మ్, టివి, థియేటర్ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణమురళి, ఎమ్‌డి టి విజయకుమార్‌రెడ్డి తెలిపారు. దీనిపై బుధవారం జ్యూరీ సభ్యులతో వారు సమావేశం అయ్యారు. పరిశీలనకు అనుమతించాల్సిన విధివిధానాలను, పారదర్శకంగా వ్యవహరించాల్సిన తీరును వివరించారు. అనంతరం దీనిపై కృష్ణమురళి మీడియాతో మాట్లాడారు. ఉత్తమ కళాకారులను ఎంపిక చేశామని తెలిపారు. ఎంతో అనుభవం ఉన్నవారిని న్యాయ నిర్ణేతలుగా ఎంపిక చేశామని పేర్కొన్నారు. పద్య నాటక న్యాయ నిర్ణేతలు సెప్టెంబరు ఎనిమిదో తేదీన కర్నూలు నుండి పర్యటన ప్రారంభించి 18వ తేదీన విశాఖపట్నంలో ముగిస్తారని వివరించారు. సాంఘిక, యుజన నాటిక విభాగం నిర్ణేతలు సెప్టెంబరు 10న పిఠాపురంలో బయలుదేరి, 18వ తేదీన



కర్నూలులో పర్యటన ముగిస్తారని అన్నారు. సాంఘిక, బాలల నాటకాల నిర్ణేతలు సెప్టెంబరు 7న అనంతపురంలో బయలుదేరి, 18న విశాఖపట్నంలో ముగిస్తారని పేర్కొన్నారు. నాటక రంగ తెలుగు రచనలకు న్యాయ నిర్ణేతల్లో అప్పాజోస్యుల సత్యనారాయణ, గుమ్మా సాంబశివరావు, ఎన్‌వి కృష్ణారావు ఉన్నారని తెలిపారు. పద్య నాటక విభాగంలో కురుటి సత్యంనాయుడు, ఎం కుమార్‌బాబు, మొతుకపల్లి సూర్యనారాయణయాదవ్ ఉన్నారు. అలాగే సాంఘిక, యువజన నాటక విభాగంలో నిర్ణేతలుగా ఆకుల మల్లేశ్వరరావు, పి శివప్రసాద్, ఎస్‌ఆర్‌ఎస్ ప్రసాద్‌ను ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. అలాగే సాంఘిక, బాలల నాటిక విభాగానికి కెజి వేణు, దాసిరి నల్లన్న, పి సుమను న్యాయ నిర్ణేతలుగా నియమించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో కళాకారులందరికీ గుర్తింపుకార్డులు జారీచేస్తామని ఆయన తెలిపారు. కళాకారుల వివరాలను ఎపిఎస్‌ఎఫ్‌టివిటిడిసి వెబ్‌సైట్లో ఉంచుతామని అన్నారు. ఏజెంట్లకు ఎటువంటి కమీషన్లు చెల్లించాల్సిన అవసరం లేదని పోసాని తెలిపారు.

## 'ఉక్కు 'భూమిని అదానీకి ఇవ్వం

- కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి నాగేంద్రనాథ్ సిన్హా వెల్లడి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఉక్కు కర్మాగారం భూమిని అదానీకి ఇవ్వబోమని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి నాగేంద్రనాథ్ సిన్హా తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో వెయ్యి ఎకరాలను అదానీ గంగవరం పోర్టు స్వాధీనం చేసుకోడానికి స్టీల్ యాజమాన్యంతో చర్చలు సాగిస్తుందన్న ప్రచారం ఊపందుకుంటున్న నేపథ్యంలో కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి స్పందిస్తూ తాజాగా బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'అలాంటి ప్రతిపాదన ఏదీ ఆర్ఐఎన్ఎల్, ఉక్కు మంత్రిత్వ శాఖ వద్ద లేదు' అని స్పష్టం చేశారు. ఈ నెల 29న ప్రజాశక్తి పత్రిక మెయిన్ పేజీలో 'ఉక్కులో అదానీకి వెయ్యి ఎకరాలు' అన్న శీర్షికన వార్తా కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై అంతకు ముందే విశాఖకు చెందిన మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖకు లేఖ రాస్తూ అందులో అనుమానం వ్యక్తం చేశారు. దీనిపైనా కేంద్ర ఉక్కు కార్యదర్శి స్పందించారు. స్టీల్‌ప్లాంట్ భూముల్లో అదానీ పోర్టు స్టాక్ యార్డును పెంచడానికి వెయ్యి ఎకరాలు సేకరించేందుకు చర్చలు జరుగుతున్నట్లు తమ వద్ద ఎలాంటి ఆధారమూ లేదన్నారు. ఈ విషయం మంత్రిత్వ శాఖకు తెలియదని, ఈ ప్రతిపాదన కూడా రాలేదని తెలిపారు. ఇప్పటికే గంగవరం పోర్టు ప్రాజెక్టు జెట్టీ స్థలం అంతా ఉక్కు కర్మాగారం స్థలంలోనే ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 1200 ఎకరాలను డివిఎస్.రాజు నేతృత్వంలో ఆనాడు ప్రయివేట్ కన్సార్టియంకు పిపిపిలో ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలా ఇచ్చిన భూమికి బదులు 10.4 శాతం ఈక్విటీని కలిగి ఉండేదని తెలిపారు. వంద శాతం పోర్టును ఆదానీ స్వాధీన పరచుకోవడానికిగానూ దీన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం విక్రయించేసిందని పేర్కొన్నారు. ఇనుప ఖనిజం కొనుగోలు చేసే విషయంలో కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఆర్ఐఎన్ఎల్‌కి మద్దతు ఇస్తుందని, గనులు రాష్ట్రానికి సంబంధించినవి కావడంతో ఈ ప్రయత్నాలు ఫలించడంలేదని కార్యదర్శి సిన్హా వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఉక్కు కార్యదర్శికి ఇఎఎస్.శర్మ మరో లేఖ రాస్తూ తన ఆందోళనలను ఆర్ఐఎన్ఎల్ పట్టించుకుని ఇంకెప్పుడూ భూములను ఏ ప్రయివేట్ కంపెనీకీ ఇవ్వకుండా ఉండాలని, అలాంటి ప్రయత్నాలను తక్షణం విరమించుకోవాలని కోరారు.


## ఎపిలో గ్రామ పంచాయతీలను రక్షించండి

- కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అదనపు కార్యదర్శికి ఎపి సర్పంచుల వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎపిలో గ్రామ పంచాయతీలను రక్షించాలని కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అదనపు కార్యదర్శి చంద్రశేఖర్ కుమార్‌కు ఎపి సర్పంచులు బుధవారం వినతిపత్రం అందజేశారు. కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయంలో చంద్రశేఖర్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులు సంయుక్త కార్యదర్శి మమత, విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు 2022-23వ ఆర్థిక సంవత్సరానికి రెండో విడత రూ.988 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం ప్రమేయం లేకుండా నేరుగా గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థల ఖాతాల్లోనే జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగే పనుల్లో 40 శాతం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలోనే జరగాలని, నిధులను కూడా నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లోనే వేసి సర్పంచ్ ఆధీనంలో వారికి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

చంద్రశేఖర్ కుమార్ మాట్లాడుతూ.. వినతిపత్రం పరిశీలించి త్వరగా చర్యలు తీసుకుంటామని, ఉన్నతాధికారులతో కూడా చర్చించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి దర్యాప్తు నిమిత్తం ఆదేశాలు పంపిస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీల అనుమతి లేకుండా విద్యుత్ బకాయిల కింద చెల్లించాలని తాము ఎక్కడా చెప్పలేదని పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు కేవలం గ్రామ పంచాయతీ సర్పంచి ఆధ్వర్యంలోనే ఖర్చు చేయాలని, గ్రామసభ, సర్పంచి తీర్మానంతోనే ప్రతి పైసా ఖర్చు పెట్టాలని చెప్పి స్పష్టంగా ఉన్నతాధికారులకు తెలిపారు. అదేవిధంగా సర్క్యులర్ కూడా రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో ఇస్తామని అన్నారు. విద్యుత్తు బకాయిల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నిధులను నేరుగా విద్యుత్ సంస్థలకు చెల్లించడం చట్ట వ్యతిరేకం అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు, ఉపాధ్యక్షులు ముల్లంగి రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొత్తపు మునిరెడ్డి, సంయుక్త కార్యదర్శి గొల్ల మాల్యాద్రి నాయుడు, రాష్ట్ర కార్యదర్శి దాడి ఎరుకనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి జగన్

## 'జ్యోతుల' కుమార్తె వివాహానికి హాజరైన సిఎం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్ (కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కుమార్తె వివాహ వేడుకకు బుధవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. జగ్గంపేట మండలంలోని ఇర్రిపాక గ్రామంలో నూతన వధూవరులు అన్నపూర్ణ, ఆదర్శలను ముఖ్యమంత్రి ఆశీర్వదించారు. అనంతరం కొత్త జంటకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు జగన్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సిఎం వెంట మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కాకినాడ ఎంపి వంగా గీత, వైసిపి నాయకులు ఉన్నారు.

## టిటిడి ధర్మకర్తల మండలి సభ్యులుగా ఆరుగురు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- తిరుమల

టిటిడి ధర్మకర్తల మండలి సభ్యులుగా బుధవారం ఆరుగురు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాలవలవన్ ఎక్స్‌అఫీషియో సభ్యులుగా, వై.సీతారామిరెడ్డి, బాలసుబ్రమణియన్ పళనిస్వామి, ఆర్.వెంకటసుబ్బారెడ్డి, సిద్దవటం యానాదయ్య, సిద్దా వీరవెంకట సుధీర్‌కుమార్ ధర్మకర్తల మండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. టిటిడి జెఇఒ వీరబ్రహ్మం వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒలు లోకనాథం, గోవిందరాజన్, హరీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.




బహిరంగ సభలో మాట్లాడుతున్న రామకృష్ణ

## దేశాన్ని కాపాడుకునేందుకు ప్రతి పౌరుడు నడుం బిగించాలి : సిపిఐ

ప్రజాశక్తి - కడప

దేశాన్ని,రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ప్రతి పౌరుడు నడుం బిగించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యులు అజీస్‌పాష, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కోరారు. సిపిఐ చేపట్టిన బస్సు యాత్ర బుధవారం కడప జిల్లాకు చేరుకుంది. కడప ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ... దేశాన్ని కాపాడుకోవాలంటే లౌకిక, ప్రజాతంత్ర పార్టీలు కలవాలన్నారు. కుల, మతాల మధ్య బిజెపి చిచ్చు పెడుతూ విధ్వంసం సృష్టిస్తోందన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలన అధ్వానంగా ఉందన్నారు. నాలుగు సంవత్సరాల మూడు నెలల కాలంలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని మండిపడ్డారు. విద్యుత్ ఛార్జీలు పెంచి రాష్ట్ర ప్రజలపై రూ.50 వేల కోట్లు భారం వేశారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించాలి

- పాఠశాల విద్యాశాఖ కమిషనరు సురేష్ కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్ కుమార్ అన్నారు. నేటి సమాజంలో ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులను పరిష్కరించేలా నూతన ఆవిష్కరణలు చేయించాలని ఉపాధ్యాయులను ఉద్దేశించి చెప్పారు. 'స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ గ్రాండ్ ఫినాలే' కార్యక్రమం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బుధవారం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమిషనర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. నిత్యం విజ్ఞాన అన్వేషణలతో మెరుగైన జీవన విధానం కోసం తమకు తాము కృషి చేయాలని చెప్పారు. ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ బి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతానికి చెందిన ప్రభుత్వ పాఠశాలల బాలిబాలికలు ఎంతో మెరుగ్గా రాణిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు, విద్యార్థులకు అధిక మొత్తంలో వెచ్చించి శాస్త్రీయ దృక్పథం కలిగిన పౌరులుగా తీర్చిదిద్దుతుందని యూనిసెఫ్ దక్షిణ భారత ప్రతినిధి శేషగిరి మధుసూదన్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇన్నోవేషన్ ప్రోగ్రాం డైరెక్టరు వంశీకృష్ణ, నోడల్ ఆఫీసర్ జి భాగ్యశ్రీ, ఎస్‌సిఇఆర్‌టి సిబ్బంది పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు.

# లాభాల స్వీకరణకు దిగిన మదుపరులు..

### ఫ్లాట్‌గా ముగిసిన బెంచ్‌మార్క్ సూచీలు

ముంబయి: ట్రేడింగ్ చివరి సమయంలో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో దేశీయ బెంచ్ మార్క్‌లు సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ 11.43 పాయింట్ల లాభంతో 65,087.25 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 4.80 పాయింట్లు పెరిగింది. మార్కెట్లు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. చివరి గంటన్నరలో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో సూచీలు పడిపోయాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 65,458.70 పాయింట్ల గరిష్ఠానికి చేరగా.. నిఫ్టీ 19,452.80-19,334.75 మధ్య కదలాడింది. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంతకాలతో బెంచ్ మార్క్ సూచీలు లాభాల్లో కొనసాగాయి. చివరి గంటలో విక్రయాలకు దిగడంతో ఇంట్రాడే



లాభాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ట్రేడింగ్‌లో జియోఫిన్, టాటా స్టీల్, మారుతీ, ఎంఅండ్ఎం, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, అల్ట్రాటెక్ సిమెంట్స్, ఐటీసీ, సన్‌ఫార్మా, హెచ్‌యూఎల్ షేర్లు టాప్ గెయినర్స్‌గా నిలువగా.. పవర్ గ్రిడ్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎన్‌టీపీసీ, ఎల్అండ్‌టీ, బజాజ్ ఫిన్‌సర్వ్, విప్రో, టెక్ మహీంద్రా లూజర్స్‌గా నిలిచాయి. ఇదిలా ఉండగా.. ఆటో, ఎఫ్ఎంసీజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మెటల్‌రంగాల షేర్లు 0.5శాతం చొప్పున పెరిగాయి. అదే సమయంలో పవర్, ఆయిల్ అండ్ గ్యాస్, బ్యాంకింగ్ షేర్లు పడిపోయాయి. బీఎస్‌ఈలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.5 నుంచి 0.8 శాతం లాభాలను నమోదు చేశాయి.

## అమెజాన్ మేనేజర్ దారుణ హత్య

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో దారుణం వెలుగుచూసింది. ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ ఉద్యోగిని గుర్తు తెలియని దుండుగులు హత్య చేశారు. ఈ ఘటన మంగళవారం ఢిల్లీలోని భజన్‌పురలో చోటుచేసుకుంది. మృతుడిని హర్‌ప్రీత్ గిల్‌గా గుర్తించారు. వివరాలు.. ఢిల్లీకి చెందిన హర్‌ప్రీత్ గిల్ అనే 36 ఏళ్ల వ్యక్తి అమెజాన్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి 11.30 గంటలకు తన మేనమామతో కలిసి భజన్‌పురలోని సుభాష్ విహార్ ప్రాంతంలో బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాలపై వచ్చిన కొంతమంది దుండగులు ఇద్దరిపై అడ్డగించి కాల్పులు జరిపారు. అనంతరం స్థానికులు గమనించి వీరిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. గిల్ అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. మేనమామకు చికిత్స అందిస్తున్నారు. మృతుడి మామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అయిదుగురు వ్యక్తులు తనపై, తన అల్లుడిపై కాల్పులు జరిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.



కాగా హర్‌ప్రీత్ ఇంటి నుంచి బయటకు వెళ్తూ 10 నిమిషాల్లో తిరిగి వస్తానని తమ తల్లిదండ్రులకు తెలిజయేశారు. దుండగుల కాల్పుల్లో గిల్ తలపై కుడి వైపు, బుల్లెట్ గాయాలు తగిలినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా తదుపరి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతుడి మేనమామ భజన్‌పురా నివాసి. అతడికి కూడా తలపై కాల్పులు జరగడంతో లోక్‌నాయక్ జై ప్రకాష్ ఆస్పత్రిలో చేర్పించినట్లు డీసీపీ తెలిపారు. ఇదే ప్రాంతానికి చెందిన ఓ ముఠా ఈ దాడికి పాల్పడినట్లు అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ గ్యాంగ్ నార్త్ ఈస్ట్ ఢిల్లీలో యాక్టివ్‌గా ఉందని, నగరంలో పెద్ద డాన్ కావాలనే కోరికతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఆయుధాలతో తమ ఫోటోలు, వీడియోలను పోస్ట్ చేస్తూనే ఉన్నారని తెలిపారు.

## యాక్సిస్ బ్యాంక్ కొత్త 'ఇన్ఫినిటీ సేవింగ్స్ అకౌంట్..!

న్యూఢిల్లీ: యాక్సిస్ బ్యాంక్ మినిమం బ్యాలెన్స్ అవసరం లేకుండా ప్రత్యేకంగా సేవింగ్స్ ఖాతాను అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే, ఈ ఖాతా కోసం ఖాతాదారులు నెలకు రూ.150 చెల్లిస్తే సరిపోతుందని బ్యాంకు పేర్కొంది. లేదంటే ఏడాదికి రూ.1,650 చెల్లించవచ్చని పేర్కొన్నారు. దీనికి 'ఇన్ఫినిటీ సేవింగ్స్ ఖాతా' నామకరణం చేసింది. అకౌంట్ హోల్డర్లకు ఎస్ఎంఎస్ ఛార్జీలతో పాటు మరే ఛార్జీలు ఉండవని యాక్సిస్ బ్యాంక్ పేర్కొంది. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం యాక్సిస్ బ్యాంకుతో సహా అన్ని బ్యాంకుల్లో సేవింగ్ అకౌంట్ కోసం మినిమం బ్యాలెన్స్ ఉండాలనే నిబంధన ఉన్నది. ఆయా అకౌంట్లలో డబ్బులు లేకపోతే జరిమానా సైతం విధిస్తుంటాయి. దాంతో పాటు ఎస్ఎంఎస్, పాస్‌బుక్ ప్రింటింగ్ తదితర సేవలకు ఛార్జీలు సైతం వసూలు చేస్తుంటాయి. ఈ క్రమంలో ప్రత్యేకంగా అకౌంట్‌ను తీసుకువచ్చినట్లు చెప్పింది.




పిహెచ్‌డి పట్టా అందుకుంటున్న ఉమాశంకర్

## ఉమాశంకర్‌కు పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి-నగరం (బాపట్ల జిల్లా)

బాపట్ల జిల్లా నగరం మండలం ఈదుపల్లి గ్రామానికి చెందిన చింతల వెంకట ధనుంజయ ఉమాశంకర్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పిహెచ్‌డి పట్టా ప్రదానం చేసింది. 'శబ్దకాలుష్యంలోనూ స్పష్టంగా మాట్లాడగలిగేందుకు వినియోగించుకోదగిన ఎలక్ట్రానిక్ పరికరాల పనితీరుపై విశ్లేషణ' అనే అంశంపై పరిశోధన వ్యాసాన్ని సమర్పించినందుకు గాను ఆయన ఈ పట్టా అందుకున్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని డైక్ మెన్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన 39, 40వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఉమాశంకర్‌కు రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్, జస్టిస్ ఎస్ అబ్దుల్‌నజీర్, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి, వైస్ ఛాన్సలర్ ఆచార్య పి రాజశేఖర్ పిహెచ్‌డి పట్టాను అందజేశారు. ఉమాశంకర్ జాతీయ అవార్డు గ్రహీత చింతల వెంకట శేషసాయిప్రసాద్ కుమారుడు. అవార్డు అందుకున్న సందర్భంగా డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ నానాటికీ పురోగమిస్తున్న శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం సమాజానికి మరింత చేరువయ్యే విధంగా కృషి చేస్తానన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో యువతను తీర్చిదిద్దేందుకు పరిశ్రమిస్తానని తెలిపారు. భారతదేశ యువత చంద్రయాన్-3 లాంటి మరెన్నో విజయాలను చేకూర్చాలని ఆయన ఆకాంక్షించారు.

## యుటిఎఫ్ నేతలకు నోటీసులు

ప్రజాశక్తి-పొదిలి (ప్రకాశం జిల్లా)

సిపిఎస్ రద్దు చేయాలని సెప్టెంబర్ ఒకటిన విజయవాడలో జరిగే ఉపాధ్యాయుల నిరసన కార్యక్రమానికి హాజరు కావొద్దని యుటిఎఫ్ ప్రకాశం జిల్లా సహాధ్యక్షుడు షేక్ అబ్దుల్‌హైకు పోలీసులు నోటీసు ఇచ్చారు. పొదిలిలోని ఆయన స్వగృహం వద్ద పోలీసులు నోటీసులిచ్చారు. కొనకమిట్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉన్న షేక్ అబ్దుల్ హైకు రెండోసారి కొనకమిట్ల పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఆయనతో పాటు యుటిఎఫ్ నాయకులు పి.శ్రీనివాసులురెడ్డి, బి.కృపారావుకు నోటీసులు అందజేశారు.

## ఎపిఎస్‌ఎఫ్ఎల్ ఉద్యోగుల రక్తదానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ప్రాణ రక్షణలో భాగంగానే ఎపిఎస్‌ఎఫ్ఎల్ ఉద్యోగులతో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు ఎపి స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి పేర్కొన్నారు. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ ఎపిఎస్‌ఎఫ్ఎల్ ప్రధాన కార్యాలయంలో బుధవారం మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 14వ వర్ధంతిని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి నిరంతరం శ్రమించిన వైఎస్ఆర్ విద్య, వైద్యానికి పెద్దపీట వేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా మరిన్ని సంక్షేమ పథకాలను, ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత విస్తరించి పేదవారికి అండగా నిలిచారన్నారు. విజయవాడలోని బిఆర్‌టిఎస్ రోడ్డులో సెప్టెంబరు 3న ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన వైఎస్ఆర్ విగ్రహావిష్కరణను రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారని గౌతమ్‌రెడ్డి వెల్లడించారు. ఉద్యోగులు పెద్దయెత్తున రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌ఎఫ్ఎల్ సంస్థ జిఎం సురేష్, శరత్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు కొల్లి వెంకట రమణ, ఎం విజయ, ఎపిఎస్‌ఎఫ్ఎల్ అధికారులు పాల్గొన్నారు.

## దొంగ నోట్ల పట్టివేత

- రూ.55 లక్షల విలువైన రెండు వేల నోట్లుగా గుర్తింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల, రణస్థలం మండలం పైడిభీమవరంలో దొంగనోట్లు పట్టుబడ్డాయి. ఇందుకు సంబంధించిన వివరాలను ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో రణస్థలం సిఐ ఆదాం బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 24న చిలకపాలెం, 29న పైడిభీమవరం ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేస్తుండగా దొంగ నోట్లు పట్టుబడ్డాయి. చిలకపాలెంలో తనిఖీ చేస్తున్న సందర్భంలో తుని మండలానికి చెందిన వీరమనికంట అనే వ్యక్తి నుంచి రూ.37లక్షల విలువైన ఫేక్ రూ.2 వేల నోట్లను స్వాధీనం చేసుకున్నారు. పైడిభీమవరంలో విజయనగరానికి చెందిన గనగళ్ల విజయకుమార్, కర్ణాటకకు చెందిన కంపన నుంచి రూ.17.98 లక్షల విలువైన ఫేక్ 2 వేల నోట్లను పట్టుకున్నారు. రెండు కేసుల్లో కలిపి మొత్తం రూ.55 లక్షల విలువైన ఫేక్ 2 వేల నోట్లను పట్టుకున్నట్లు సిఐ తెలిపారు. ప్రభుత్వం రూ.2 వేల నోట్లను రద్దు చేసిందని, తేలికగా మార్చుకోవచ్చని నమ్మిస్తూ మోసం చేస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. నిందితులను అరెస్టు చేశామని, కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. సమావేశంలో ఎచ్చెర్ల ఎస్ఐ వి సత్యనారాయణ పాల్గొన్నారు.

## టివిఎస్ అపాచీ ఆర్టీఆర్ 180తో సై అంటే సై..

ముంబయి: ప్రముఖ టూ వీలర్స్ తయారీ సంస్థ హోండా మోటార్ సైకిల్స్ ఇండియా జోరు మీదుంది. న్యూ హార్నెట్ 2.0 బైక్‌ను దేశీయ మార్కెట్లో ఆవిష్కరించింది. రెండోదశ బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న హార్నెట్ 2.0 బైక్‌లో న్యూ ఫీచర్లు జత చేసింది. ఈ బైక్ ధర రూ.1.39 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభం అవుతుంది. మోటారు సైకిల్ బుకింగ్స్ ప్రారంభం అయ్యాయి. ఫెస్టివ్ సీజన్ నేపథ్యంలో సెప్టెంబర్‌లో డెలివరీ ప్రారంభిస్తామని హోండా మోటార్ సైకిల్స్ తెలిపింది. టీవీఎస్ అపాచీ ఆర్టీఆర్ 180 మోటారు సైకిల్‌తో హోండా హార్నెట్ 2.0 బైక్ పోటీ పడుతుంది. ఈ మోటారు సైకిల్‌పై 10 ఏండ్ల వారంటీ ఆఫర్ చేస్తోంది. మూడేండ్ల స్టాండర్డ్, ఏడేండ్ల ఆప్షనల్ వారంటీ అందిస్తోంది. ఎల్ఈడీ హెడ్ లైట్స్, ఫ్యుయల్ ట్యాంకుతోపాటు షార్ప్ బాడీ ప్యానెల్స్, న్యూ గ్రాఫిక్స్‌తో అగ్రెసివ్ లుక్‌తో హోండా హార్నెట్ 2.0 వస్తోంది. నాలుగు కలర్ ఆప్షన్లలో ఈ బైక్ లభిస్తుంది.

## కెనడా బాట పట్టిన భారత టెక్కీలు..

ఒట్టావా(కెనడా): భారతదేశం నుంచి టెక్ వర్కర్లు వెళ్లిపోతున్నారు. వెస్ట్రన్ దేశాల బాట పడుతున్నారు. మంచి వర్క్ ప్లేస్, మంచి జీతాలు ఆఫర్ చేస్తుండటంతో వీరంతా ఇండియాను వదులివెళ్తున్నారు. ముఖ్యంగా ఎక్కువ మంది టెక్కీలు కెనడా బాటపడుతున్నారు. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు 12 నెలల వ్యవధిలో 15,000 మంది భారతీయ టెక్ వర్కర్లు కెనడాకు వెళ్లారు. కెనడాలో విస్తరిస్తున్న టెక్ వర్క్ ఫోర్సులో భారత్ నుంచి వెళ్తున్న వారే అధికంగా ఉన్నారు. ది టెక్నాలజీ కౌన్సిల్స్ ఆఫ్ నార్త్ అమెరికా, కెనడా యొక్క టెక్ నెట్‌వర్క్ ఇటీవల ఈ గణాంకాలను వెల్లడించింది. విదేశాలకు వెళ్లిన మొత్తం 32,000 ఎక్కువ మంది సాంకేతిక నిపుణుల్లో, 15,000 మంది కెనడానే తమ కొత్త నివాసంగా ఎంచుకున్నారు. భారతీయ టెక్ వర్కర్లను కెనడా చాలా ఆకర్షిస్తున్న దానికి ఈ డేటానే నిదర్శనం.

భారత్ తర్వాతి స్థానంలో 1808 మంది టెక్ కార్మికుల వలసతో నైజీరియా రెండో స్థానంలో ఉంది. కెనడా ఇమ్మిగ్రేషన్ విధానాలు ఫ్రెండ్లీగా, సులభతరంగా ఉండటంతో చాలా మంది టెక్కీలు అక్కడి వెళ్తున్నట్లు ఖాల్సా వోక్స్ వెల్లడించింది. ఖల్సా వోక్స్ అనేది ఆన్‌లైన్ డైజెస్ట్, ఇది పంజాబ్ రాజకీయాలు, చరిత్ర, సంస్కృతి, వారసత్వం వంటి విషయాలను అందిస్తుంటు ంది. ముఖ్యంగా కెనడాలోని మాంట్రియాల్, మిస్సిసౌగా నగరాలు ప్రపంచ సాంకేతిక నైపుణ్యాల ప్రవాహాలకు కేంద్రంగా ఉన్నాయి. ఒక్క మిస్సిసౌగాలోనే దాదాపుగా 1000 ఐటీ సంస్థలు, 3,00,000 కంటే ఎక్కువ టెక్ నిపుణులను కలిగి ఉంది. 201 నుంచి 2020 మధ్య టెక్ ఎకోసిస్టమ్ లో 31 శాతం వద్ధిని నమోదు చేసింది. కెనడాకు ఎక్కువగా భారత్, నైజీరియా, బ్రెజిల్ నుంచే వెళ్తున్నారు. దీంతో పాటు కెనడా అమెరికన్ నగరాలైన ఫిలడెల్ఫియా, వాషింగ్టన్ డీసీ, బోస్టన్, చికాగో నుంచి సాంకేతిక నిపుణులను ఆకర్షిస్తోంది.

సంపాదకీయం

# కాలుష్యం కాటు

రాజధాని నగరం ఢిల్లీతో పాటు, దేశ వ్యాప్తంగా పెరుగుతున్న వాయు కాలుష్యంపై తాజాగా విడుదలైన నివేదిక కలవరపాటుకు గురిచేస్తోంది. చికాగో విశ్వవిద్యాలయానికి చెందిన ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ రూపొందించిన ఈ నివేదిక ప్రకారం ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ నిలిచింది. కాలుష్య స్థాయి ఇదే మాదిరి కొనసాగితే ఢిల్లీ ప్రజానీకం తమ జీవితకాలంలో 11.9 సంవత్సరాలు కోల్పోతారంటూ చేసిన హెచ్చరిక దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. ఆ నివేదిక ప్రకారం ప్రపంచ ఆరోగ్య సంస్థ జారీ చేసిన మార్గదర్శకాలను మించిన కాలుష్యంలో దేశంలోని మొత్తం జనాభా మగ్గుతోంది. ప్రతి క్యూబిక్ మీటర్‌కు 40 మైక్రోగాముల కాలుష్యానికి అనుమతి ఇస్తూ మన దేశం రూపొందించుకున్న సొంత నాణ్యతా ప్రమాణాలు సైతం ఆచరణలో వెలవెలబోతున్నాయి. జాతీయ పరిమితి కన్నా అధికంగా కాలుష్యం ఉన్న ప్రాంతాల్లో దేశంలోని 67.4 శాతం జనాభా జీవనం సాగిస్తోంది. మన మహానగరాలన్నీ వాయు కాలుష్యంతో అతలాకుతలమౌతున్నాయి. తామెంత ప్రమాదకర పరిస్థితుల్లో మనుగడ సాగిస్తున్నామో ఆ ప్రాంతాలలో నివసించే ప్రజానీకంలో అత్యధిక మందికి కనీస అవగాహన కూడా లేకపోవడం దురదృష్టకరం.

ప్రజానీకానికి పెను ప్రమాదంగా మారుతున్న వాయుకాలుష్యంపై ఈ తరహా హెచ్చరికలు రావడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది ఆగస్టులో ప్రపంచవ్యాప్తంగా 1650 నగరాల్లో చేసిన అధ్యయనంలోనూ, అదే నెలలో అమెరికాకు చెందిన హెల్త్ ఎఫెక్ట్స్ ఇన్‌స్టిట్యూట్ ప్రపంచంలోని ఏడు వేల నగరాల్లో చేసిన పరిశీలనలోనూ వాయుకాలుష్యంలో ఢిల్లీ నగరమే అగ్రస్థానంలో ఉన్నట్లు తేలింది. దేశంలోని మిగిలిన నగరాల్లోనూ కొంచెం అటుఇటూగా తాజా నివేదికలోని పరిస్థితులే ఉన్నట్లు ఆ ఏడాది, అంతకుముందు రెండు మూడు సంవత్సరాల్లో చేసిన అధ్యయనాల్లో తేలింది. ఒక అధ్యయనం ప్రకారం ప్రతి ఏటా 20 లక్షల మంది ప్రజానీకం వాయు కాలుష్యం కారణంగా వచ్చే వివిధ రకాల వ్యాధుల బారిన పడి మరణిస్తున్నారు. దేశ వ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణమవుతున్న వాటిలో వాయు కాలుష్యం ఐదవ స్థానంలో నిలుస్తోంది. డబ్ల్యుహెచ్‌ఓ గణాంకాల ప్రకారం దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా వంటి వాటి కారణంగా చోటుచేసుకుంటున్న మరణాల సంఖ్య మన దేశంలోనే అత్యధికం. వాయు కాలుష్యం కారణంగా ఢిల్లీలో 50 శాతం మంది చిన్నారుల ఊపిరితిత్తులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నాయి. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంది కాబట్టే 2019 నవంబర్‌లో అత్యున్నత న్యాయస్థానం 'నరకానికన్నా అధ్వానంగా ఢిల్లీ నగరం తయారైంది' అని వ్యాఖ్యానించింది. ఆ సమయంలోనే సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరుణ్‌మిశ్రా 'పేలుడు పదార్థాలు అమర్చి ప్రతి ఒక్కరినీ చంపేయడం మంచిది.' అని అన్నారంటే అప్పటికే పరిస్థితి ఏ స్థాయికి దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. అయినా, పాలకులలో పెద్దగా స్పందన రాలేదనడానికి ఆ తరువాత కూడా ఢిల్లీతో పాటు దేశమంతా వాయుకాలుష్యం పెరుగుతుండటమే నిదర్శనం.

వ్యక్తిగత వాహనాల వినియోగం దేశ వ్యాప్తంగా ఏడాదికేడాదికి పెరుగుతోంది. ఫలితంగా వాయు కాలుష్యం పెద్దఎత్తున పెరుగుతోంది. దీనిని అరికట్టడానికి సరి,బేసి నంబర్ల వాహనాలను రోజువిడిచి రోజు రోడ్లమీదకు అనుమతించాలన్న ఢిల్లీ ప్రభుత్వ ప్రయత్నం ఫలించలేదు. ఢిల్లీ నగరానికి చుట్టుపక్కల చెట్లు కొట్టి వేయడం, పెద్ద ఎత్తున ఏర్పాటవుతున్న పరిశ్రమలు కాలుష్యానికి కారణమౌతున్నాయి. పరిశ్రమల్లో కాలుష్యానికి తీసుకోవాల్సిన చర్యలు అమలు కాకపోవడంతో వాయు కాలుష్యంతో పాటు యమునా నది కూడా పెద్ద ఎత్తున కాలుష్యం బారిన పడుతోంది. దేశ వ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి రైతాంగాన్ని, వారు తగలబెడుతున్న గడ్డిని ఈ దుస్థితికి కారణంగా చిత్రీకరించడానికి ప్రభుత్వం ప్రయత్నించడం దారుణం. కోవిడ్ కారణంగా లాక్‌డౌన్ విధించిన సంవత్సరాలలో వ్యవసాయం మినహా మిగిలిన అన్ని రంగాలు మూతపడిన సంగతి తెలిసిందే, ఆ సమయంలో ఢిల్లీతో పాటు దేశ వ్యాప్తంగా కాలుష్యం తగ్గినట్టు నిర్ధారణ కావడం గమనార్హం. ప్రభుత్వాలకు పజారోగ్యం పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్రజా రవాణా వ్యవస్థను గణనీయంగా మెరుగుపరచాలి. పరిశ్రమల్లోనూ, నిర్మాణ పనుల వద్ద కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాలి. అడవులను పరిరక్షించడంతో పాటు, వీలైన అన్ని ప్రాంతాల్లోనూ చెట్లను పెంచాలి. ఈ తరహా చర్యలే వాయు, జల కాలుష్యాల నుండి ప్రజానీకాన్ని కాపాడుతాయి.

మహనీయుల మాట



**జీవించి వున్నామంటే ఏదో ఒక పక్షం వహించాలి. నిజంగా జీవించి వున్నవారు పోరులుగాను, పక్షపాతులుగాను వుంటారు. తటస్థత, ఉదాసీనత అంటే పరాన్న జీవనం, గతి తప్పడం... జీవితం కాదు. అందుకే తటస్థం అంటే నాకు అసహ్యం.**

**- ఆంటోనియో గ్రాంసీ**

# ప్రజా సమస్యలపై సమరభేరి

విశ్లేషణ

ప్రజలు ఎదుర్కొంటున్న అధిక ధరలు, నిరుద్యోగ సమస్యలపై దేశవ్యాప్తంగా సిపిఎం ప్రచార ఆందోళనలు చేపట్టింది. మన రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ చార్జీల పెరుగుదలతో పాటు స్థానిక సమస్యలను జోడించి ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4 వరకు సమరభేరి చేస్తున్నది. ప్రజలను విస్తృతంగా కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ సంతకాల సేకరణ, సచివాలయాల వద్ద నిరసనలు, నిరుద్యోగ సమస్యపై చర్చా వేదికలు, సదస్సులు, 4వ తేదీన తహశీల్దార్ కార్యాలయాల దగ్గర పెద్దఎత్తున ప్రజలను సమీకరించి ధర్నాలు నిర్వహించాలని రాష్ట్ర పార్టీ పిలుపునిచ్చింది. అధికార, ప్రతిపక్ష పార్టీలు అధికారం కోసం వ్యక్తిగత దూషణల రాజకీయం చేస్తుంటే, ప్రజల పక్షాన సిపిఎం శ్రేణులు ఉద్యమబాట పట్టాయి.




**నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చిన ఈ తొమ్మిది సంవత్సరాల్లో అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలు వంద నుండి ఏడు వందల శాతం పెరిగాయి. ధరల పెరుగుదలను నివారించలేని ప్రభుత్వం మన దేశాన్ని ప్రపంచ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ముందుకు తీసుకుపోతామని ప్రగల్భాలు పలుకుతున్నది. ఇందుకు జి-20 దేశాల సమావేశాన్ని వేదికగా వాడుకుంటున్నది. రిటైల్ ధరల పెరుగుదల ఈ సంవత్సరం జూన్‌లో 4.87 శాతం వుండగా జులైలో 7.44 శాతానికి పెరిగింది. సరుకుల ధరల పెరుగుదల 11.5 శాతం, కూరగాయల ధరలు 37.3, తృణధాన్యాలు, పప్పుధాన్యాలు 13, సుగంధ ద్రవ్యాలు 21.6, పాలు 8.34 శాతానికి పైగా పెరిగాయి. జూన్‌తో పోలిస్తే జులైలో కూరగాయల ధరలు 81.1 శాతం పెరిగాయి. గత పది సంవత్సరాల్లో ఇదే అత్యధిక పెరుగుదల. ఈ ధరల పెరుగుదల ప్రభావం పేద, మధ్యతరగతి ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావాన్ని చూయిస్తుంది.**

**ఆకాశాన్నంటుతున్న ధరలు**

నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చిన ఈ తొమ్మిది సంవత్సరాల్లో అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలు వంద నుండి ఏడు వందల శాతం పెరిగాయి. ధరల పెరుగుదలను నివారించలేని ప్రభుత్వం మన దేశాన్ని ప్రపంచ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ముందుకు తీసుకుపోతామని ప్రగల్భాలు పలుకుతున్నది. ఇందుకు జి-20 దేశాల సమావేశాన్ని వేదికగా వాడుకుంటున్నది. రిటైల్ ధరల పెరుగుదల ఈ సంవత్సరం జూన్‌లో 4.87 శాతం వుండగా జులైలో 7.44 శాతానికి పెరిగింది. సరుకుల ధరల పెరుగుదల 11.5 శాతం, కూరగాయల ధరలు 37.3, తృణధాన్యాలు, పప్పుధాన్యాలు 13, సుగంధ ద్రవ్యాలు 21.6, పాలు 8.34 శాతానికి పైగా పెరిగాయి. జూన్‌తో పోలిస్తే జులైలో కూరగాయల ధరలు 81.1 శాతం పెరిగాయి. గత పది సంవత్సరాల్లో ఇదే అత్యధిక పెరుగుదల. ఈ ధరల పెరుగుదల ప్రభావం పేద, మధ్యతరగతి ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావాన్ని చూయిస్తుంది. ఆదాయంలో పెరుగుదల లేకుండా ధరలు పెరగడం వల్ల గతంలో పొందుతున్న ఆహారాన్ని కూడా ప్రజలు అందుకోలేకపోతారు. దీనివల్ల ఆహార సమస్య, తద్వారా ఆరోగ్య సమస్యలు ఈ వర్గాలపై ముప్పేట దాడి చేస్తాయి. హిందూస్థాన్ యూనిలీవర్ తమ ఉత్పత్తులైన వీల్, రిన్, సర్ఫ్ ఎక్సెల్, లైఫ్‌బాయ్ తదితర సబ్బులు, డిటర్జెంట్ల ధరలను 3 నుండి 20 శాతం వరకు పెంచింది. మోడీ గద్దెనెక్కిన నాటికి 450 రూపాయలున్న గ్యాస్ సిలిండర్ ధర నేడు 1150 రూపాయలకు ఎగబాకింది. పెట్రోల్, డీజిల్ చార్జీలు అంతు లేకుండా పెరుగుతూనే ఉన్నాయి. కందిపప్పు ధర 80 నుండి 160 రూపాయలకు పెరిగింది. మినపప్పు, వేరుశనగ, వంటనూనె ధరలు ఈ ఒక్క నెలలోనే 22 శాతం పెరిగాయి. ప్రజలకు బియ్యం అందివ్వడం కంటే ఇథనాల్ తయారదీదారుల ప్రయోజనాల కోసం తెల్ల బియ్యం, నూకల బియ్యం ఎగుమతి నిషేధించింది. ధరల పెరుగుదలకు తోడుగా పన్నుల మోత పెరుగుతున్నది. మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఎస్‌టి పన్నుల విధానం వల్ల కేంద్రానికి పన్నుల ద్వారా వస్తున్న ఆదాయం ప్రతి మూడు నెలలకోమారు పెరుగుతూనే వుంది. ఈ పెరుగుదలను చూపించి మోడీ అనుకూల మీడియా దేశంలో మధ్యతరగతి పెరిగిందని వికృత వాఖ్యానాలు చేస్తున్నది. వాస్తవాన్ని తలకిందులు చేసి మన దేశానికి అతి పెద్ద మార్కెట్ పెరుగుతున్న మధ్యతరగతే అని ప్రధాని మాట్లాడుతున్నారు.

ఈ ధరల పెరుగుదలను అరికట్టడంలో ఉద్దేశపూర్వకమైన నిర్లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నది. సరుకులను అక్రమంగా దాచి ధరల పెరుగుదలకు కారణమవుతున్న వారి పట్ల తనిఖీలు చేయడం బిజెపి ప్రభుత్వం ఆపేసింది. దీంతో సరుకుల కృత్రిమ కొరత సృష్టించి బడా వ్యాపారులు లాభపడుతుండగా, వీటిని పండించిన రైతులు దివాళా తీస్తున్నారు. ధరల పెరుగుదల నుండి ప్రజలను ఆదుకోవడానికి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేసి కనీస సరుకులను సరఫరా చేయాల్సిన కేంద్రం తన ఆధీనంలోని ఎఫ్‌సిఐ గోడౌన్లలో పోగుబడిన ధాన్యాన్ని రాష్ట్రాలకు పంపిణీ చేయకుండా అత్యంత క్రూరంగా వ్యవహరిస్తున్నది. ధరల పెరుగుదలపై కేంద్రాన్ని ప్రశ్నించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మోడీ విధానాలను అమలు చేయడానికి పోటీ పడుతున్నది. ధరల పెరుగుదల వల్ల పేదరికం, దారిద్ర్యం, అకలి పెరుగుతాయి. 2019 నాటికి దేశంలో 3 కోట్ల 46 లక్షల మంది దారిద్ర్య రేఖకు దిగువన వున్నట్లు సంతోష్ మెహరోత్రా విశ్లేషించారు. పేదరికాన్ని గుర్తించే లెక్కలను 2019 తర్వాత నుండి కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం నిలిపివేసింది. గణాంక శాఖను నిర్వీర్యం చేసింది.

**ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలెక్కడ?**

మొత్తం దేశ జనాభాలో 28 సంవత్సరాల లోపు వున్నవారు 65 శాతం వుండగా, అందులో 25 సంవత్సరాల లోపు వున్నవారు 45 శాతం మంది వున్నారు. 2050 నాటికి కూడా మన దేశ మధ్యస్త సగటు వయసు 38 సంవత్సరాలు మాత్రమే. అప్పటికి అమెరికా సగటు మధ్య వయసు 40 నుండి 42 సంవత్సరాలు, చైనా 39 నుండి 44 సంవత్సరాలుగా వుంటుంది. రాబోయే 15-20 సంవత్సరాల మధ్య ప్రపంచ పారిశ్రామిక కార్మికశక్తి నాలుగు శాతం తగ్గుతుండగా, మన దేశంలో 32 శాతం పెరుగుతుంది. ప్రతి సంవత్సరం కొత్తగా ఒకటిన్నర కోటి మంది లేబర్ మార్కెట్‌లో పని చేయడానికి సిద్ధమవుతున్నారు. వీరి ఓట్లను కొల్లగొట్టడానికి 2014 ఎన్నికల సమయంలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని యువతకు హామీ ఇచ్చి మోడీ అధికారంలోకి వచ్చారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా వున్న ఉద్యోగాలను రద్దు చేశారు. 2017-18లో నిరుద్యోగ రేటు 4.7 శాతం వుండగా, 2018-19 నాటికి 6.3 శాతానికి పెరిగింది. కరోనా వల్ల 2020 సంవత్సరంలో ఒకేసారి 9.1 శాతానికి చేరింది. కరోనా తర్వాత ఆర్థిక వ్యవస్థ కోలుకుందని తిరిగి వేగంగా అభివృద్ధి చెందుతుందని కేంద్ర పాలకులు బడాయి కబుర్లు చెప్పారు. నిజం దాచేస్తే దాగదు కదా! 2022 నాటికి 8.3 శాతం, 2023 మార్చి నాటికి 7.8 శాతానికి నిరుద్యోగం భారీగా పెరిగింది. ఈ జులై నాటికి గత 40 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంత స్థాయికి నిరుద్యోగ రేటు పెరిగింది. మానవ వనరులు అత్యధికంగా వున్న దేశాల్లో మనం మొదటి రెండు, మూడు స్థానాల్లో వున్నాము. ఈ యువత సంఖ్యను చూపించి మన పాలకులు మాది యువ దేశమంటూ భుజకీర్తులు తగిలించుకొని ఊరేగుతున్నారు.

కానీ ఈ యువతకు ఉద్యోగం, ఉపాధి కల్పించకపోతే వారు జీవించడం ఎట్లా? డిగ్రీ, పిజీలు చదివి ఉపాధి హామీ పనులకు వెళుతున్నవారు, వాలంటీర్లుగా, మాల్స్‌లో సేల్స్ వర్కర్లుగా, కాంట్రాక్టు కార్మికులుగా అనేకమంది పనిచేస్తున్నారు. గత నాలుగు సంవత్సరాల కాలంలో ఒక కోటి యాభై లక్షల మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా వున్నాయి. వీటిని భర్తీ చేయడంలేదు. దళిత, గిరిజన బ్యాక్ లాగ్ పోస్టులు లక్షల సంఖ్యలో ఖాళీగా ఉంటున్నాయి. యువతకు కొత్త ఉద్యోగాలు పొందడానికి అవసరమైన నైపుణ్యాన్ని అందించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయి. మన దేశంలో 2030 నాటికి సుమారు 2 కోట్ల 90 లక్షల మంది యువత సరైన నైపుణ్యం లేక ఉపాధికి దూరమవుతారని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) ఇటీవల ప్రకటించింది. కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ 2021 నివేదిక ప్రకారం కూడా విద్యావంతుల్లో ఉద్యోగార్హత కేవలం 50 శాతం లోపు మాత్రమే వుంది. బి.టెక్ చదువుకున్న వారిలో 45 శాతం, ఐటిఐ చదువుకున్న వారిలో 75 శాతం మందికి ఉపాధి నైపుణ్యాలు లేవని ఇండియా స్కిల్ రిపోర్టు పేర్కొంది. వీరిలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడానికి బదులు తలల్లోకి మతోన్మాదాన్ని ఎక్కించి రాజకీయ లబ్ధి పొందడానికి బిజెపి ప్రభుత్వం శతధా ప్రయత్నిస్తుంది. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీలకు, పేదలకు కొద్దిపాటి ఉపాధి కల్పిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బిజెపి ప్రభుత్వం నిధుల కోత కోస్తున్నది. ఈ సంవత్సరం బడ్జెట్లో రూ.30 వేల కోట్లు తగ్గించారు.

**మోడీ భజనలో తరిస్తున్న జగన్ ప్రభుత్వం**

కేంద్ర ప్రభుత్వ వినాశకర విధానాలను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్నది. విద్యుత్ సంస్కరణలను అమలు చేస్తూ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు చేస్తున్నది. గత నాలుగు సంవత్సరాల్లో 7 సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి వేల కోట్ల భారాల్ని ప్రజలపై వేసింది. ట్రూఅప్ చార్జీలు, సర్ చార్జీలు, ఫిక్స్‌డ్ చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ మొదలగు పేర్లతో రెట్టింపు భారాన్ని ప్రజలపై రుద్దారు. వ్యవసాయ ఉచిత విద్యుత్‌ను, దళితులకు, గిరిజనులకు 200 యూనిట్ల వరకు ఇస్తున్న ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసేందుకు ప్రయత్నిస్తున్నది. పట్టణ ప్రజలపై ఆస్తిపన్ను, చెత్తపన్నుల భారాన్ని వేసింది. ప్రజలకు ప్రభుత్వం అందించే అన్ని సేవలకు చార్జీలను నిర్ణయించి అమలు చేస్తున్నది. పజా పంపిణీ ద్వారా కేవలం బియ్యాన్ని మాత్రమే అందిస్తున్నారు. గతంలో పేదలకు అందుతున్న కందిపప్పు, నూనె, ఇతర సరఫరాలను పునరుద్ధరించాలి. ఖాళీగా ఉన్న గ్రూప్ 1, గ్రూప్ 2 పోస్టులను వెంటనే భర్తీ చేయడంతో పాటు, డిఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ హామీని అమలు చేయాలి. గిరిజన యువతకు స్పెషల్ డిఎస్సీ పెట్టాలి. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పట్టణ పేదలకు జాతీయ ఉపాధి హామీ పథకం అమలు చేయించాలి.

కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు వేలకోట్ల రాయితీలిస్తూ, లక్షల కోట్ల విలువ చేసే ప్రభుత్వ రంగ సంస్థలను అప్పగిస్తుంది. మణిపూర్ ఘోరాల గురించి దేశం మొత్తం ఆందోళన చెందుతుంటే కార్పొరేట్ సంస్థలు అటవీ సంపదను, భూగర్భ ఖనిజాలను లూటీ చేసుకునేందుకు వీలుగా మొన్న జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో చట్టాలను సవరించింది. రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు సిలిండర్ ధరను తగ్గించింది. గతంలో బీహార్ ఎన్నికల సమయంలో లక్ష కోట్ల ప్యాకేజి, వివిధ రాష్ట్రాల ఎన్నికల సమయంలో పెట్రోలు, డీజల్ ధరలు పెంచకపోవడం లేదా కొంత తగ్గించడం, కర్ణాటక ఎన్నికల్లో ఉచిత వాగ్దానాలతో ప్రజలను మోసపుచ్చి వారి ఓట్లను కొల్లగొట్టడం వంటివి బిజెపి కపట రాజకీయాలకు నిదర్శనం. ఈ విధానాలను గుడ్డిగా బలపరిచే ఏ పార్టీ అయినా అంతిమంగా ప్రజా విశ్వాసాన్ని కోల్పోక తప్పదు.



వి. రాంభూపాల్

**(వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు)**

★

# సిలబస్ పూర్తి కాకుండా పరీక్షలు రాసేదెలా?

సమస్య

ఆంధ్రా యూనివర్శిటీకి అనుబంధంగా 356 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 12 డిగ్రీ కళాశాలలకు ఈ విద్యా సంవత్సరం యూనివర్శిటీ అనుమతులు రద్దు చేసింది. మిగిలిన కళాశాలల్లో మొదటి, మూడవ సెమిస్టర్ పరీక్షలు పూర్తయిన తరువాత మళ్లీ జూన్ 1 నుండి తరగతులు ప్రారంభం అయ్యాయి. సాధారణంగా ఒక సెమిస్టర్ సిలబస్ పూర్తి కావడానికి ఐదు నెలలు పడుతుంది. కానీ కాలేజీలు ప్రారంభమై మూడు నెలలు మాత్రమే కావడంతో ఏ కాలేజీలో కూడా 60 శాతానికి మించి సిలబస్ పూర్తి కాలేదు. కొన్ని కాలేజీల్లో 40 శాతం మాత్రమే సిలబస్ అయింది. కొత్తగా మంజూరైన డిగ్రీ కళాశాల విద్యార్థులకు కనీసం పాఠాల పేర్లు కూడా తెలియదు. గతంలో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం అయ్యేసరికి సిలబస్, ప్రాక్టికల్స్ పూర్తి అయిపోయి ప్రిపరేషన్‌కు కొంత సమయం ఉండేది. ఇప్పుడు సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం అయ్యే ముందు రోజు వరకు కూడా ప్రాక్టికల్స్ జరుగుతున్నాయి.

గత రెండు సంవత్సరాలుగా కరోనా కారణంగా ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణతా శాతం దారుణంగా పడిపోయింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కాలేజీల్లో 100 కోర్సుల్లో ఒక్క విద్యార్థి కూడా జాయిన్ కాలేదు. మరో 153 కోర్సుల్లో 15 శాతం లోపు జాయిన్ అయ్యారు. దీనిని ఆసరాగా తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ కోర్సులన్నీ మూసివేసేసే పనిలో ఉంది. ఈ కోర్సులన్నీ మూసేస్తే మొత్తం 9,748 సీట్లు రద్దు చెయ్యబడతాయి. ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణతా శాతం తగ్గడం వలనే డిగ్రీలో అడ్మిషన్లు తగ్గాయని చెప్తున్నవాళ్లు ఇప్పుడు ఏం చేస్తున్నారు? డిగ్రీలో కూడా ఉత్తీర్ణతా శాతం తగ్గిపోయే విధంగా నిర్ణయాలు చేస్తున్నారు. సిలబస్ పూర్తి కాకుండా పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులు ఏం రాసి పాసవుతారు. ఈ రోజు డిగ్రీ విద్యార్థులకు సిలబస్ పూర్తి కాకపోవడానికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ అడ్మిషన్ల వలన విద్యా సంవత్సరాన్ని ఆలస్యంగా ప్రారంభించడం. ఇంటర్న్‌షిప్, నాలుగు సంవత్సరాల డిగ్రీ వంటి విధానాలు తీసుకురావడం.

**ఆన్‌లైన్ అడ్మిషన్లు-సమయం వృథా**

**ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణతా శాతం తగ్గడం వలనే డిగ్రీలో అడ్మిషన్లు తగ్గాయని చెప్తున్నవాళ్లు ఇప్పుడు ఏం చేస్తున్నారు? డిగ్రీలో కూడా ఉత్తీర్ణతా శాతం తగ్గిపోయే విధంగా నిర్ణయాలు చేస్తున్నారు. సిలబస్ పూర్తి కాకుండా పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులు ఏం రాసి పాసవుతారు. ఈ రోజు డిగ్రీ విద్యార్థులకు సిలబస్ పూర్తి కాకపోవడానికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ అడ్మిషన్ల వలన విద్యా సంవత్సరాన్ని ఆలస్యంగా ప్రారంభించడం. ఇంటర్న్‌షిప్, నాలుగు సంవత్సరాల డిగ్రీ వంటి విధానాలు తీసుకురావడం.**



రాష్ట్రంలో వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే 2020 విద్యా సంవత్సరం నుండి డిగ్రీలో ఆన్‌లైన్ అడ్మిషన్ విధానాన్ని తీసుకు వచ్చింది. దీనివలన అడ్మిషన్లు పూర్తి కావడానికి నెలల తరబడి సమయం పడుతున్నది. మొదటి విడతలో అడ్మిషన్ దొరకనప్పుడు రెండు, మూడు కౌన్సిలింగ్స్ పూర్తి అయ్యేంత వరకు వేచి ఉండాల్సి వస్తుంది. మూడు విడతలు పూర్తి అయ్యేసరికి కొంత సిలబస్ అయిపోతుంది. దీంతో మూడో విడతలో జాయిన్ అయిన వారు, స్పాట్ అడ్మిషన్ ద్వారా జాయిన్ అయిన వారు నష్టపోతున్నారు. ఈ ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు అవడం వలన సమయం సరిపోక సిలబస్ పూర్తి కావడం లేదు. డిగ్రీ అడ్మిషన్లు కూడా బాగా ఆలస్యంగా ప్రారంభం అవుతున్నాయి. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకుని నెలల తరబడి కాలేజీల్లో చేరకుండా ఉండటంతో విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఇంజనీరింగ్ కాలేజీల్లో చేర్చుతున్నారు. దీనితో డిగ్రీలో అడ్మిషన్లు ప్రతి ఏడాది తగ్గుతూ వస్తున్నాయి.

**కొత్త కొత్త విధానాలు-విద్యార్థులలో గందరగోళం**

విద్యా సంవత్సరం ఆలస్యంగా ప్రారంభం అవడంతో పాటు కొత్తగా వస్తున్న ఇంటర్న్‌షిప్, నాలుగు సంవత్సరాల డిగ్రీ వంటి విధానాలు విద్యార్థులను గందరగోళానికి గురిచేస్తున్నాయి. అధ్యాపకులు వీటి కోసం ఎక్కువ సమయం కేటాయించవలసి వచ్చినప్పటికీ సిలబస్ పూర్తి చెయ్యలేక పోతున్నారు. గతేడాది డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆరవ సెమిస్టర్‌కు బదులుగా ఇంటర్న్‌షిప్ నిర్వహించారు. తరువాత డిగ్రీలో ప్రతి సంవత్సరంలో 2 నెలల పాటు ఈ ఇంటర్న్‌షిప్ వుంటుంది. చివరి సంవత్సరంలో 6 నెలలు ఉంటుందన్నారు. ఇప్పుడు అన్ని సబ్జెక్టుల మాదిరిగానే ఇంటర్న్‌షిప్ కూడా ఒక సబ్జెక్టుగా ప్రతిరోజూ బోధించబడుతుంది అంటున్నారు. అసలు ఈ ఇంటర్న్‌షిప్ ఎలా నిర్వహించాలి అన్న దానిపై ఎవరికీ స్పష్టమైన అవగాహన లేదు. గత సంవత్సరం ప్రారంభించిన ఈ ఇంటర్న్‌షిప్ విధానంపై పూర్తి అవగాహన లేకుండానే ఈ విద్యా సంవత్సరం నుండి నాలుగు సంవత్సరాల డిగ్రీ విధానాన్ని అమలు చేస్తున్నారు. దీనికోసం రెండు సబ్జెక్టులను (ఒకటి మేజర్ ఇంకొకటి మైనర్ సబ్జెక్టుగా) ఎంచుకోవాలన్నారు. కానీ ఆన్‌లైన్‌లో ఒక సబ్జెక్ట్ మాత్రమే చూపించి దాన్నే ఎంచుకోమంటున్నారు. మైనర్ సబ్జెక్టును ఎలా ఎంచుకోవాలనే ఆప్షన్ ఇవ్వలేదు. ఇప్పుడు మేజర్, మైనర్ సబ్జెక్టులతో పాటు మిగిలిన సబ్జెక్టులు కూడా ప్రాథమికంగా నేర్చుకోవాలి అంటున్నారు. ఇది ఎలా నిర్వహిస్తాము అనేదాన్ని కాసేపు పక్కన పెడితే దీని మూలంగా డ్రాపౌట్లు విపరీతంగా పెరిగిపోతాయి. ప్రపంచంలో చాలా దేశాలు సాధారణ డిగ్రీలతో పాటు ఆనర్స్ డిగ్రీలను అందిస్తున్నాయి. మన దేశంలో కూడా 1980 నుండి ఢిల్లీ యూనివర్సిటీలో ఆనర్స్ డిగ్రీని మూడు సంవత్సరాలు సాధారణ డిగ్రీ పూర్తి చేసిన తర్వాత ఇస్తున్నది. కాని ఇప్పుడు నూతన విద్యా విధానంలో నాలుగు సంవత్సరాల కోర్స్ పూర్తి చేసి, 160 క్రెడిట్లను సంపాదించిన వారికి మాత్రమే ఆనర్స్ డిగ్రీ పొందే అర్హత ఉంటుందని చెబుతున్నది. దీనివలన విద్యార్థులు మరో సంవత్సరం పాటు ఉండడానికి అదనంగా డబ్బు ఎక్కువ చెల్లించవలసి వస్తుంది. విద్యార్థులు అధిక ఫీజులు చెల్లించలేక డ్రాపౌట్లు పెరుగుతాయి. డ్రాపౌట్లు తగ్గించాల్సిన ప్రభుత్వం ఎక్కువ ఎగ్జిట్ పాయింట్లు వుండేలా చేసి దాన్నే చట్టం చేస్తున్నది.

దీంతో పేద, అణగారిన విద్యార్థులు 15 సంవత్సరాల సుదీర్ఘ పాఠశాల విద్య తర్వాత నాలుగు సంవత్సరాల డిగ్రీని చదవాల్సి రావడం అనివార్యమైంది. ఒక సంపన్న విద్యార్థి 14 లేదా 15 సంవత్సరాల వయసులో వృత్తిపరమైన డిప్లమాతో డ్రాప్ అయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. అంటే పేద విద్యార్థులకు మాత్రమే ఎగ్జిట్ పాయింట్లు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే జీవో నెం-77 తీసుకువచ్చి ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న పి.జి విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన ఇవ్వకుండా చాలా మంది పేద విద్యార్థులకు పి.జి విద్యను దూరం చేశారు. జీవో నెం-107, జీవో-108 తీసుకు వచ్చి వైద్య విద్యలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు తీసుకు వచ్చి వైద్య విద్యను దూరం చేస్తున్నారు. ఇప్పుడు డిగ్రీలో కొత్త కొత్త విధానాలు తీసుకు వచ్చి డిగ్రీ విద్యను దూరం చేస్తున్నారు. భవిష్యత్తులో ప్రాథమిక విద్యను కూడా దూరం చేస్తారు. ప్రతి వేదికపైనా గిరిజనులను ఉద్ధరించడం కోసం నేను పుట్టాను, సామాజికంగా వెనుకబడిన తరగతుల వారికి నేను అండగా ఉంటాను...అని చెప్పుకొస్తున్న సి.ఎం జగన్మోహన్ రెడ్డి అదే తరగతుల నుండి వస్తున్న పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తును కాపాడుకోవాలంటే ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిందే.



డి.రాము

**(వ్యాసకర్త : ఎస్.ఎఫ్.ఐ విజయనగరం జిల్లా సహాయ కార్యదర్శి, సెల్: 9705545164)**

కవిత్వం

## మేఘాలు ముఖం చాటేశాయి..

ఆకాశ మైదానంలో
కారు మబ్బుల క్రీడాకారుల
ఉరుకులు పరుగులు లేవు...!
భారత్ బంద్‌కు పిలుపు ఇచ్చిన
నగరంలా నిర్మానుష్యంగా వుంది గగనం..!!

వాతావరణంలో మార్పులు వస్తున్నాయని
ఎదురు చూసిన అన్నదాతలకు
నిట్టూర్పుల మబ్బులే కనిపించాయి..!

ఈ ఖరీఫ్‌లో పంట కాలువలకొచ్చిన
అరకొర నీటితో వరి నాట్లను
రైతులు ఉత్సాహంగా ప్రారంభించారు..!

పగలూ రాత్రీ అన్నదాతలు
నింగి వంక చూస్తున్నారు గాని..
నల్ల మబ్బుల జాడ వారికి దొరకటం లేదు..!

పొరుగు రాష్ట్రాలలో సైతం
భారీ వర్షాలు కురవక పోవటంతో
పలు ప్రాజెక్టులలో జలకన్యలు
ఆనంద నృత్యాలు చేయడం లేదు..!?
అన్ని కాలువలలో జలాలు తగ్గ ముఖం పట్టాయి..!

వరి పొలాల్లోకి నీరు పారుదల లేక
పుడమి తల్లి మట్టి గుండె పగులు బారుతోంది..!
పచ్చ పచ్చని పైరు రంగు మారుతోంది...!!!

నేల తల్లిని నమ్ముకున్న రైతులు కుమిలిపోయె..!
శూన్యంలో మబ్బులు కానరావు
ఎందుకో.. ఈ సారి మేఘాలు అన్నదాతలకు
ముఖం చాటేశాయి .. అవకాశ రాజకీయ నేతల్లా..!?

**- జి.సూర్యనారాయణ, దివిసీమ.**

**మీ రచనలను పంపాల్సిన మెయిల్ :**
editpageps@gmail.com

# ప్రజలపై నిఘా

- ఇజ్రాయిల్ సంస్థల నుంచి పరికరాలు కొంటున్న మోడీ ప్రభుత్వం
- టెలికం కంపెనీల ద్వారా సమాచార సేకరణ
- సహకరిస్తున్న భద్రతా సంస్థలు



**స్నూపింగ్ :** దేశంలోని ఇడి, సిబిఐ, ఆదాయపు పన్ను వంటి సంస్థలు ఇప్పటికే మోడీ ప్రభుత్వ తాబేదారులుగా మారిపోయాయి. ఇప్పుడు ఆ జాబితాలో విదేశీ నిఘా సంస్థలు కూడా చేరాయి. దేశంలోని 140 కోట్ల మంది ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని దొడ్డిదారిన సేకరించి, రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే దిశగా నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్ టెక్నాలజీ సంస్థల నుంచి శక్తివంతమైన నిఘా పరికరాలను కొనుగోలు చేస్తోంది. పెగాసస్ స్పైవేర్ వివాదం సద్దుమణగక ముందే మోడీ ప్రభుత్వం మరోసారి బరితెగించింది. లండన్ నుండి పనిచేస్తున్న 'ది ఫైనాన్షియల్ టైమ్స్' పత్రిక ప్రచురించిన సంచలన కథనం ప్రకారం... నిఘా వ్యవస్థకు సంబంధించిన హార్డ్‌వేర్‌ను విదేశీ సంస్థలు సముద్ర గర్భంలోని కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లకు అనుసంధానం చేస్తాయి. దీనిని దేశీయ టెలికం సంస్థలు ఉపయోగించుకొని భద్రతా సంస్థలకు ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని, ఇతర వివరాలను అందజేస్తాయి. ఇదంతా పైకి చూడడానికి చట్టబద్ధంగానే జరుగుతోంది. ఈ హార్డ్‌వేర్ కోసం కృత్రిమ మేధ, డాటా ఎనలిటిక్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలను నిఘా సంస్థలు ఉపయోగించుకుంటున్నాయి.

భారత్‌కు, ప్రపంచంలోని ఇతర దేశాలకు మధ్య సమాచార మార్పిడి కోసమే సముద్ర గర్భంలోని కేబుల్స్‌ను ఉపయోగించుకుంటున్నామని చెబుతున్నప్పటికీ శక్తివంతమైన నిఘా పరికరాలను విక్రయించే ప్రైవేటు కంపెనీలకు మార్గం సుగమం చేయడమే దీని ప్రధాన ఉద్దేశంగా కన్పిస్తోంది. మన దేశంలోని వేహియర్, ఇజ్రాయిల్‌కు చెందిన కాగ్నైట్, సెప్టియర్ వంటి కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి. సెప్టియర్ అనే కంపెనీని 2021లో అట్లాంటిక్ కౌన్సిల్ 'బాధ్యతారాహిత్య సంస్థ'గా అభివర్ణించింది.

**కఠిన నిబంధనలేవి?**

ఇతర ప్రజాస్వామిక దేశాలలో ప్రభుత్వ నిబంధనలు కఠినంగా ఉంటాయి. సముద్ర గర్భంలోని కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు, డాటా సెంటర్లలో నిఘా పరికరాలను అమర్చే టెలికం కంపెనీలు కొన్ని షరతులకు లోబడి ప్రభుత్వ అనుమతులు పొందాల్సి ఉంటుంది. అయితే మన దేశంలో ఇలాంటివేమీ లేవు. అమెరికా, బ్రిటన్ దేశాలలోని సంస్థలు ఇలాంటి దొడ్డిదారి ఏర్పాట్ల ద్వారా పెద్ద ఎత్తున నిఘాకు పాల్పడుతున్నాయని, ప్రభుత్వ ఒత్తిడితో టెలికం కంపెనీలు అధికారికంగానే వినియోగదారుల సమాచారాన్ని సేకరిస్తున్నాయని స్నోడెన్ లీకేజీలు బయటపెట్టడంతో దుమారం చెలరేగింది. చివరికి 'నిఘా' కోసం ప్రభుత్వాల నుండి అభ్యర్థనలు వచ్చిన సందర్భంలో అందుకు కోర్టు అనుమతి తీసుకోవాలని ఆ కంపెనీలు నిర్ణయించాయి.

**ఈ కంపెనీలన్నీ అలాంటివే**

ఇజ్రాయిల్‌కు చెందిన సెప్టియర్ కంపెనీని 2000 సంవత్సరంలో ఏర్పాటు చేశారు. చట్టబద్ధమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ కంపెనీ ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ జియోకు, వొడాఫోన్ ఐడియాకు, సింగపూర్‌కు చెందిన సింగ్‌టెల్‌కు విక్రయించింది. ఇజ్రాయిల్ కంపెనీ కాగ్నైట్ కూడా మన దేశంలో నిఘా సమాచారాన్ని అందజేస్తోంది. భారత్, అమెరికా దేశాలలో ప్రధాన కార్యాలయాలు ఉన్న వేహియర్ కంపెనీ కూడా ఇలాంటిదే. ఇటు మోడీ ప్రభుత్వం కానీ, అటు ఆయా కంపెనీలు కానీ దీనిపై పెదవి విప్పడం లేదు.

**వెల్లువెత్తుతున్న ఆరోపణలు**

జలాంతర్గామి కేబుల్ ప్రాజెక్టులలో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులను ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ వివరణ ఏం చెప్పిందంటే... కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు, డాటా సెంటర్లలో నిఘా పరికరాలను అమర్చాలని భారత ప్రభుత్వం బాహాటంగానే టెలికం కంపెనీలను కోరింది. ఇజ్రాయిల్ గ్రూప్ ఎన్ఎస్ఓకు చెందిన పెగాసస్ స్పైవేర్‌ను మోడీ ప్రభుత్వం ఉపయోగిస్తోందని ప్రతిపక్ష నేతలు, పాత్రికేయులు, హక్కుల కార్యకర్తలు 2019, 2021 సంవత్సరాలలో ఆరోపించారు. పెగాసస్ స్పైవేర్ ఓ లింకు ద్వారా మొబైల్ ఫోన్లను హ్యాక్ చేస్తుందని, ఇ-మెయిల్స్, కాల్స్, టెక్స్ట్ మెసేజీలను రహస్యంగా రికార్డు చేస్తోందని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక ఓ కథనాన్ని ప్రచురించింది. పెగాసస్ స్పైవేర్ బండారాన్ని బయటపెట్టేందుకు 2021 జూలై 16న వైర్, ఫ్రాన్స్ మీడియా సంస్థ ఫర్‌బిడెన్ స్టోరీస్, అమ్నెస్టీ ఇంటర్నేషనల్ చేతులు కలిపాయి. దీనిపై ఎన్ఎస్ఓ సంస్థ స్పందిస్తూ భారత్ సహా పలు దేశాల ప్రభుత్వాలకు మాత్రమే దీనిని విక్రయించామని తెలిపింది.

# చంద్రబాబు కేసులో తీర్పు వాయిదా

**ప్రజాశక్తి-అమరావతి**

రాజధాని అసైన్డ్ భూములను కొనుగోలు చేశారని తమపై సిఐడి నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మాజీ మంత్రి పొంగూరు నారాయణ దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు వాదనలు ముగించింది. తీర్పును రిజర్వులో పెడుతున్నట్టు జస్టిస్ వి రాధాకృష్ణ కృపాసాగర్ ప్రకటించారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చేసిన ఫిర్యాదు ఆధారంగా చంద్రబాబు, నారాయణపై సిఐడి అధికారులు 2021లో కేసు పెట్టారు. దీనిని కొట్టివేయాలని వీరు హైకోర్టును ఆశ్రయించిన కేసులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి.

**కౌంటర్ వేస్తాం**

చిత్తూరు జిల్లా పుంగనూరు, అన్నమయ్య జిల్లా అంగళ్లులో టిడిపి నేతల విధ్వంసంపై పోలీసులు పెట్టిన కేసుల్లో టిడిపి సీనియర్ నేతలు, అమర్‌నాథ్‌రెడ్డి, శేషాచలపతి నాయుడు, ఇతరులు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ల కేసుల్లో కౌంటర్ వేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. ఇంతకుముందు ఇతర నేతలకు ముందస్తు బెయిల్ ఉత్తర్వుల్లో తమ వాదనలను నమోదు చేయలేదని అదనపు ఎజి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఇందుకు అనుమతిస్తూ.. విచారణను వాయిదా వేస్తూ జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

**ఎన్‌సిటిఇ అధికారికి ఊరట**

జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సిటిఇ) డిప్యూటీ కార్యదర్శికి హైకోర్టు ఊరటనిచ్చింది. కోర్టు విచారణకు హాజరుకాని ఆ అధికారికి సింగిల్ జడ్జి ఇచ్చిన నాన్ బెయిలబుల్ వారెంట్‌ను రద్దు చేసింది. పిటిషనర్ కాలేజీ ఇచ్చే అప్పీల్ పత్రాలను పరిగణనలోకి తీసుకుని, చట్ట ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయనను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎవి శేషసాయితో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది.

# గొట్టిపాళ్ల దాడిని ఖండించిన చంద్రబాబు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ల గ్రామంలో జరిగిన దాడిని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తీవ్రంగా ఖండించారు. టిడిపి కార్యకర్తలపై విచక్షణారహితంగా, మారణాయుధాలతో దాడి చేశారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి గూండాలు ఇళ్లపై పడి గంటల తరబడి మారణహోమం సృష్టిస్తుంటే నివారించలేకపోవడం పోలీసుల వైఫల్యం కాదా? అని ప్రశ్నించారు. హింసా రాజకీయాలు చేస్తున్న వైసిపి నేతలకు పోలీసుల మద్దతే ఈ తరహా ఘటనలకు కారణం అని ఆగ్రహించారు. సిఎం జగన్ పల్నాడును వల్లకాడు చేస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర మరో ప్రకటనలో విమర్శించారు.

**బయటపడిన జగన్ ఇసుక దందా :అచ్చెన్నాయుడు**

టిడిపి చేపట్టిన ఇసుక సత్యాగ్రహంతో నాలుగేళ్లుగా సిఎం జగన్ చేస్తున్న ఇసుక దందా గుట్ట బయటపడిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు తెలిపారు. అక్రమాలు బయటపడతా యనే భయంతోనే టిడిపి నేతలను హౌస్ అరెస్టులు చేయిస్తున్నారని ఒక ప్రకటనలో విమర్శించారు. ఇసుకలో అక్రమాలు లేకుంటే తమ నేతలను ఎందుకు అరెస్టు చేస్తున్నారని ప్రశ్నించారు.

# పార్టీలు విధ్వంసానికి పాల్పడితే నష్టాన్ని రాబట్టాలి

## పిల్‌ను విచారించిన హైకోర్టు ● ప్రభుత్వానికి నోటీసులు

**ప్రజాశక్తి-అమరావతి**

రాష్ట్రంలో రాజకీయ పార్టీల ర్యాలీలు, సభలు, సమావేశాలు పెట్టినప్పుడు పబ్లిక్ ఆస్తులకు నష్టం కలిగిస్తే ఆ నష్టాన్ని విధ్వంసకారుల నుంచి వసూలు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలనే పిల్‌ను హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. పార్టీలు చేసే ర్యాలీలను నియంత్రించేలా పోలీసులకు ఉత్తర్వులు ఇవ్వాలని కడప జిల్లా, ఎర్రముక్కపల్లికి చెందిన న్యాయవాది బైరెడ్డి సాయి ఈశ్వర్‌రెడ్డి వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎవి శేషసాయితో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ప్రతివాదులైన హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డిజిపి, అనంతపురం రేంజ్ డిఐజి, చిత్తూరు ఎస్‌పిలకు నోటీసులు జారీ చేసింది. విచారణను అక్టోబరు 11కి వాయిదా వేసింది.

**రాజధాని రైతుల అప్పీల్‌పై విచారణకు నిరాకరణ**

రాజధాని అమరావతి కోసం భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం వార్షిక కౌలు చెల్లించడం లేదన్న తమ పిటిషన్‌ను అత్యవసరంగా విచారణ చేయాలని రైతులు అప్పీల్ పిటిషన్‌లో జోక్యానికి డివిజన్ బెంచ్ నిరాకరించింది. సింగిల్ జడ్జి నోటీసులు మాత్రమే ఇచ్చారని, ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. దీనిని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎవి శేషసాయితో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఆ వ్యవహారాన్ని సింగిల్ జడ్జి ముందే తేల్చుకోవాలని చెప్పింది. సింగిల్ జడ్జి తుది ఉత్తర్వులు జారీ చేయనప్పుడు అప్పీల్ దాఖలు చెల్లదని తేల్చింది.

# సెన్సార్ సర్టిఫికెట్ లేకుండా టీజర్ ఎలా రిలీజ్ చేస్తారు?


- టైగర్ నాగేశ్వరరావు టీజర్‌పై హైకోర్టు ప్రశ్న

**ప్రజాశక్తి-అమరావతి**

టైగర్ నాగేశ్వరరావు సినిమా టీజర్‌లో వాడిన భాష, పదాలు స్టువర్టుపురం ప్రాంతాల వారిని కించపరిచేలా ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇవ్వకుండా టీజర్ ఎలా రిలీజ్ చేశారని ప్రశ్నించింది. సమాజ హితంతో సినిమాలు ఉండాలని, సమాజ బాధ్యతను మరిచిపోకూడదని వ్యాఖ్యానించింది. స్టువర్టుపురం ప్రాంత ప్రజల మనోభావాల్ని దెబ్బతీసేలా సినిమా టీజర్ ఉందంటూ చుక్కా పాల్‌రాజ్ వేసిన పిల్‌ను బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. సెంట్రల్ బోర్డు ఫిల్మ్ సర్టిఫికెట్ లేకుండా టీజర్ రిలీజ్ చేయడం చెల్లదని పిటిషనర్లు వాదించారు. ఎరుకల కుల సామాజికవర్గాన్ని అప్రతిష్టపాలు చేసేలా టీజర్ ఉందన్నారు. వాదనల తర్వాత నిర్మాత అభిషేక్ అగర్వాల్‌కు హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎవి శేషసాయితో కూడిన డివిజన్ బెంచ్ నోటీసులు ఇచ్చింది. విచారణను వాయిదా వేసింది.

# కార్పొరేషన్లు నిర్వీర్యం..!

- బిసి, ఎస్‌సి, కాపు, మైనార్టీ తరగతులకు పెనుదెబ్బ
- బ్యాంకు రుణాలతో పొందే ఉపాధికి గండి
- గత ప్రభుత్వాల హయాంలో లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు
- నేడు ఏఒక్క పథకమూ అమలు కాని దుస్థితి
- పథకాల సొమ్ము కార్పొరేషన్ జాబితాలో నమోదు
- వెనుకబడిన తరగతులకు కొరవడిన ఉపాధి భద్రత




**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ఉపాధి భద్రత కల్పించి వెన్నుదన్నుగా నిలిచిన బిసి, ఎస్‌సి, కాపు, మైనార్టీ కార్పొరేషన్లు నిర్వీర్యమయ్యాయి. దీంతో వివిధ తరగతుల ప్రజలకు బ్యాంకు రుణాలతో ఉపాధి మార్గం ఎంచుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో ఆయా తరగతుల ప్రజల్లో తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వాల హయాంలో బిసి, ఎస్‌సి, మైనార్టీ కార్పొరేషన్లకు ప్రత్యేక స్థానం ఉండేది. 2014లో టిడిపి ప్రభుత్వం వచ్చాక కాపు కార్పొరేషన్‌ను సైతం ఏర్పాటు చేసింది. చదువుకుని ఉపాధి లేని నిరుద్యోగులకు కార్పొరేషన్లు అండగా నిలిచేవి. ప్రతియేటా లక్ష్యాలు నిర్దేశించుకుని బిసి, ఎస్‌సి, మైనార్టీలకు బ్యాంకు రుణాలు ఇప్పించి ఉపాధి మార్గం చూపేవి. కిరాణా కొట్లు, ఫొటో స్టూడియోలు వంటి ఎన్నో వ్యాపారాలు పెట్టుకోవడంతోపాటు, కార్లు వంటివాటితో ఉపాధి పొందేందుకు కార్పొరేషన్లు సహాయ పడేవి. ప్రతి యూనిట్‌కూ రూ.లక్ష నుంచి రూ.పది లక్షలు వరకూ ఇచ్చిన పరిస్థితి కొనసాగేది. గత టిడిపి ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ రుణాలు పెద్దఎత్తున ఇచ్చిన పరిస్థితి ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆర్థికంగా వెనుకబడిన బిసి తరగతికి చెందిన కుటుంబాలకు బిసి కార్పొరేషన్ ద్వారా దాదాపు పది వేలకుపైగా యూనియిట్లు మంజూరయ్యాయి. కాపు కార్పొరేషన్ ద్వారా 15 వేల యూనిట్లు వరకూ ఇచ్చినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా తొమ్మిది వేలకుపైగా యూనిట్లు ఇచ్చారు. నిరుద్యోగులు, చదువుకోనివారు సైతం కార్పొరేషన్ ద్వారా బ్యాంకు రుణాలు పొంది లబ్ధి పొందారు. తీసుకున్న రుణంలో సగం సబ్సిడీ కింద ప్రభుత్వం భరించేది. రూ.లక్ష రుణం ఇస్తే రూ.50 వేలు సబ్సిడీ వర్తించేది. తీసుకున్న రుణంలో సగం సొమ్ము సబ్సిడీ కింద పోవడంతో లబ్ధిదారులకు ఎంతగానో మేలు జరిగేది. బ్యాంకు రుణాలు పొందిన కుటుంబాలకు ఏదోక ఉపాధి మార్గం దొరికేది. ఉపాధికి సంబంధించిన యూనిట్ ఏర్పాటు చేస్తేనే కార్పొరేషన్ ద్వారా బ్యాంకు రుణాలు మంజూరయ్యేవి. దీంతో లబ్ధి పొందిన ప్రతి కుటుంబమూ ఏదోక యూనిట్‌ను తప్పకుండా ఏర్పాటు చేసేవి. యూనిట్ ఏర్పాటుతో వచ్చే ఆదాయంతో ప్రతినెలా బ్యాంకు వాయిదాలు చెల్లించుకునేవారు. ఎంతోమంది కార్లు పొంది వాటిద్వారా ఉపాధి పొందారు. కార్పొరేషన్ రుణాల కింద కార్లు పొంది ఇప్పటికీ ఉపాధి పొందుతున్న కుటుంబాలు చాలా ఉన్నాయి.

**ఉత్సవ విగ్రహాలుగా కార్పొరేషన్లు**

వైసిపి ప్రభుత్వం వచ్చాక బిసి, ఎస్‌సి, మైనార్టీ, కాపు కార్పొరేషన్లే కాకుండా, బిసి సామాజిక తరతగతుల్లో అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఛైర్మన్లను, డైరెక్టర్లను నియమించింది. అయితే నిధులు మాత్రం ఇవ్వలేదు. దీంతో ఛైర్మన్లుగా నియమితులైన వారు ఏం చేస్తున్నారో కూడా ఏఒక్కరికీ తెలియని పరిస్థితి ఉంది. కార్పొరేషన్ల పరిధిలో ఎటువంటి కార్యక్రమాలూ జరగడం లేదు. గతంలో రుణాల కోసం వచ్చే జనంతో కళకళలాడే కార్పొరేషన్లు నేడు వెలవెలబోతున్నాయి. పాత రుణాలకు సంబంధించిన వసూళ్లకు ఉద్యోగులు పరిమితమైన పరిస్థితి ఉంది. రాష్ట్రంలో అన్ని తరగతులకు ఇచ్చే సంక్షేమ పథకాల సొమ్మును బిసి, ఎస్‌సి, కాపు, మైనార్టీలకు ఇచ్చిన సొమ్ముగా చూపిస్తున్నారే తప్ప, ఉపాధి కల్పించే బ్యాంకు రుణాల గురించి మాత్రం ప్రభుత్వం మాట్లాడటం లేదు. కార్పొరేషన్ రుణాలు మంజూరు లేకపోవడంతో ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయి. కార్పొరేషన్ రుణాలను పునరుద్ధరించాలని ఆయా తరగతుల ప్రజలంతా ముక్తకంఠంతో కోరుతున్నారు.

## సిఎం రాఖీ శుభాకాంక్షలు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాఖీ పూర్ణిమ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అక్కచెల్లెమ్మలకు సోదరుడిగా ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఆయన పోస్టు చేశారు. 'ప్రతి అక్కకు, ప్రతి చెల్లెమ్మకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు. మీరు నాపై చూపుతున్న ప్రేమాభిమానాలకు సదా కృతజ్ఞుడిని. మీ సంక్షేమమే లక్ష్యంగా.. మీ రక్షణే ధ్యేయంగా పాలన సాగిస్తున్నందుకు సంతోషిస్తూ మీకు ఒక అన్నగా, ఒక తమ్ముడిగా ఎప్పుడూ అండగా ఉంటానని మాట ఇస్తున్నాను' అని ఆయన పేర్కొన్నారు.

## చిలీ కమ్యూనిస్ట్ పార్టీ అధ్యక్షులు గుల్లెరో టెల్లియర్ మృతి

**శాంటియాగో :** చిలీ కమ్యూనిస్ట్ పార్టీ అధ్యక్షులు గుల్లెర్మో టెల్లియర్ (79) కన్నుమూశారు. గత కొన్ని సంవత్సరాలుగా కరోనా సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. చిలీలోని క్లినికల్ హాస్పిటల్ ఆఫ్ ది యూనివర్శిటీలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మరణించినట్లు చిలీ కమ్యూనిస్ట్ పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది. "పాపులర్ యూనిటీకి మద్దతునిచ్చిన సాల్వడార్ అలండే మద్దతుదారుడు. నియంతృత్వానికి, ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన సైనికుడు. వామపక్ష శక్తుల ఏకీకరణ వ్యూహకర్త " అని చిలీ కమ్యూనిస్ట్ పార్టీ పేర్కొంది.

గుల్లెర్మో టెల్లియర్ మృతికి చిలీ అధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్ సంతాపం ప్రకటించారు. వివిధ తరాలను పార్టీకి అనుగుణంగా నడిపించడంలో కీలక పాత్ర పోషించిన కమ్యూనిస్ట్ పార్టీ చారిత్రాత్మక నేత అని వ్యాఖ్యానించారు. " దేశం పట్ల ప్రదర్శించిన అంకిత భావానికి, న్యాయమైన సమాజాన్ని నిర్మించడానికి అతని అవిశ్రాంత ప్రయత్నాలకు నివాళిగా ఆయన గౌరవార్థం జాతీయ సంతాపదినంగా ప్రకటించాలని నిర్ణయించాము' అని అన్నారు.

నిబద్ధత కలిగిన కమ్యూనిస్ట్ అయిన టెల్లియర్ 1988లో పిసి సెంట్రల్ కమిటీలో భాగమయ్యారు. మార్చి 2005 నుండి పార్టీకి నాయకత్వం వహిస్తున్నారు.

## మణిపూర్‌లో మరోసారి ఘర్షణలు.. ఇద్దరు మృతి

**ఇంఫాల్ :** మణిపూర్ మరోసారి రక్తమోడింది. తాజాగా రెండు గ్రూపుల మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు మరణించగా, పలువురికి తీవ్రగాయాలయ్యాయి. చురాచంద్‌పూర్, బిష్ణుపూర్ జిల్లాల సరిహద్దుల్లోని ఖోయిరెంటక్ ప్రాంతంలో మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి అర్ధరాత్రి వరకు కాల్పులు కొనసాగినట్లు అధికారులు తెలిపారు. మృతుల్లో ఒకరు గ్రామ భద్రతా గార్డు జంగ్మిన్లున్ గాంగ్టే (30)గా గుర్తించారు. ఉదయం పది గంటలకు గాంగ్టేపై కాల్పులు జరిగిన సమయంలోనే.. ఖోయిరెంటక్ చుట్టుపక్కల ఉన్న కుకీ గ్రామాలు దాడికి గురయ్యాయని స్థానిక గిరిజన నేతల ఫోరమ్ (ఐటిఎల్ఎఫ్) తెలిపింది. అతని చేతిలోని మెషిన్ గన్ పేలడంతో గాంగ్టే మరణించాడని పోలీసులు పేర్కొనడం గమనార్హం. మరణించిన రెండో వ్యక్తి బిష్ణుపూర్‌కి చెందిన లైబుజం ఇనావోగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

## బిల్కిస్ బానో, మహిళా రెజ్లర్లు, మణిపూర్ మహిళలకు రాఖీ కట్టండి

- బిజెపి నాయకులకు ఉద్ధవ్ థాకరే సవాల్

**ముంబయి :** మీకు మహిళల పట్ల శ్రద్ధ ఉంటే.. బిజెపి పాలనలోని రాష్ట్రం, దేశం మహిళలకు సురక్షితం కాదని నిరసన తెలుపుతున్న బిల్కిస్ బానో, మహిళా రెజర్లు, మణిపూర్ మహిళలకు బిజెపి నాయకులు, కార్యకర్తలు రాఖీ కట్టాలని శివసేన నాయకులు, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే సవాల్ చేశారు. రాఖీ రోజున ముస్లిం మహిళలకు రాఖీ కట్టాలని బిజెపి నాయకులు, కార్యకర్తలకు ప్రధానమంత్రి మోడీ ఇచ్చిన పిలుపును ప్రస్తావిస్తూ ఉద్ధవ్ ఈ సవాల్ చేశారు. ముంబయిలో గురు, శుక్రవారాల్లో ఇండియా ఫోరమ్ సమావేశాల నేపథ్యంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్‌డిఎ స్థాయి అమీబా స్థాయికి దిగజారిపోయిందని విమర్శించారు. ఇండియా ఫోరమ్‌లోని పార్టీల భావజాలాలు వేరైనా, దేశాన్ని రక్షించడానికి ఒక్కటయ్యాయని అన్నారు. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, రాజ్యాంగాన్ని రక్షించేందుకు ఫోరంను ఏర్పాటు చేశాం. ఫాసిస్టు శక్తులను ఓడిస్తాం' అని థాకరే చెప్పారు. ఈ సమావేశంలో ఎన్‌సిపి నాయకులు శరద్ పవార్ కూడా మాట్లాడారు.

## హర్యానా సర్కారు తీరుపై సిఐటియు ఆగ్రహం

**సమ్మె చేస్తున్న ఆశా వర్కర్లు, ట్రేడ్ యూనియన్ నాయకులకు ప్రశంస**

**న్యూఢిల్లీ:** హర్యానాలోని బిజెపి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సిఐటియు తీవ్రంగా ఖండించింది. సమ్మె చేస్తున్న ఆశా వర్కర్లు, ట్రేడ్ యూనియన్ నాయకులు ఎదుర్కొంటున్న అణచివేత, పోలీసుల క్రూరత్వంపై సిఐటియు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిరంకుశ చర్యలను వెంటనే విరమించాలనీ, రాష్ట్ర ప్రభుత్వం కొనసాగుతున్న నిరవధిక సమ్మెను ఉభయ పక్ష చర్చల ద్వారా పరిష్కరించాలని డిమాండ్ చేసింది.

ఈనెల 8 నుంచి రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెలో ఉన్న ఆశా వర్కర్లు హర్యానా ప్రభుత్వం నుంచి తీవ్ర అణచివేతను ఎదుర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వంతో నెలల తరబడి చర్చలు జరిపారు. అనేక ప్రయత్నాల అనంతరం చివరి ప్రయత్నంగా వారు సమ్మెకు దిగారు. దీనికి ప్రభుత్వం అనుమతివ్వలేదు. ఎలాంటి స్పందనా తెలియజేయలేదు.

ఆశా వర్కర్లు, ట్రేడ్ యూనియన్ నాయకులు రాష్ట్ర అసెంబ్లీ ముందు శాంతియుత ప్రదర్శన నిర్వహించడానికి ప్రయత్నించడంతో పరిస్థితి తీవ్రమైంది. దీనిపై రాష్ట్ర అధికారులు తీవ్రంగా స్పందించారు. ఆశా వర్కర్స్ యూనియన్, సిఐటియు హర్యానా రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు సురేఖ, ప్రధాన కార్యదర్శి జైభగవాన్, ఆశా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సునీతతో సహా నాయకులు వేధింపులకు, అరెస్టులకు గురయ్యారు. నిర్బంధంలో ఉన్న నాయకులకు తాగునీరు, విశ్రాంతి గదులు వంటి కనీస సౌకర్యాలు లభించకుండా అడ్డుకున్నారు. భయం, బెదిరింపు వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నంలో వందలాది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రూరమైన చర్యలు కొనసాగుతున్నప్పటికీ, ఆశా వర్కర్లు దృఢ నిశ్చయంతో తమ సమ్మెను కొనసాగించారు.

సిఐటియు హర్యానా బిజెపి ప్రభుత్వాన్ని హెచ్చరించింది. తమ వైఖరిని పునరాలోచించుకోవాలని, కొనసాగుతున్న సమ్మెను పరిష్కరించడానికి వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేసింది. సమ్మె చేస్తున్న కార్మికులు, ట్రేడ్ యూనియన్ నాయకుల ఆందోళనలను పరిష్కరించడానికి ప్రజాస్వామ్య ద్వైపాక్షిక చర్చలు ప్రారంభించాలని తెలిపింది. సిఐటియు హర్యానాలోని ఆశా వర్కర్లకు సంఘీభావంగా నిలబడేందుకు కార్మికవర్గం, దాని అనుబంధ సంస్థల నుంచి మద్దతును కూడగట్టింది. ఈ సవాలు సమయంలో ఆశా కార్యకర్తలు ప్రదర్శించిన ధైర్యాన్ని, ఐక్యతను సిఐటియు ప్రశంసించింది.

## నూహ్ మత ఘర్షణల కేసులో గో గూండా బిట్టూకు బెయిల్

**గురుగ్రామ్ :** ఈ నెల ప్రారంభంలో జరిగిన నూహ్ మత ఘర్షణల కేసులో అరెస్టయిన గోగూండా బిట్టూ బజరంగికి బుధవారం బెయిల్ లభించింది. నూహ్ మత ఘర్షణలతో పాటు, పోలీసులపై దాడికి కూడా పాల్పడిన బజరంగికి అరెస్టయిన 15 రోజుల్లోపే బెయిల్ లభించడం అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. ఎసిపి ఉషా కుందు ఫిర్యాదు మేరకు ఈ నెల 15న బజరంగిపై సదర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 15న ఫరీదాబాద్ వద్ద అరెస్టు చేశారు. ఈ నెల 17న నూహ్ కోర్టులో హాజరుపర్చారు. కోర్టు 14 రోజుల జ్యుడిషియ్ కస్టడీ విధించడంతో ఫరీదాబాద్ జిల్లాలోని నీమ్కా జైలుకు తరలించారు. బజరంగీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను బుధవారం జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సందీప్ కుమార్ విచారించి బెయిల్ మంజారు చేసినట్లు నూహ్ పోలీసులు తెలిపారు.

ఎఫ్ఐఆర్ ప్రకారం.. కత్తులు, త్రిశూలాలతో వెళుతున్న బజరంగీ, గుర్తుతెలియన అతని మద్దతుదారుల్ని ఎసిపి ఉషా కుందు నేతృత్వంలోని పోలీసుల బృందం అడ్డుకోవడానికి ప్రయత్నించింది. బజరంగీ గుంపు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడమే కాకుండా, అనుచితంగా ప్రవర్తించి బెదిరింపులకు పాల్పడింది. పోలీసు వాహనం నుంచి ఆయుధాలను కూడా ఎత్తుకెళ్లారు. అప్పటికే మరొక కేసులో బజరంగి బెయిల్‌పై బయట ఉండటం గమనార్హం. మతఘర్షణలకు కారణమయ్యే విధంగా విద్వేష ప్రసంగాలు, ఆయుధాలు సరఫరా చేశాడని ఈ నెల 1న బజరంగీని పోలీసులు అరెస్టు చేశారు. వెంటనే బెయిల్‌పై బయటకి వచ్చిన బజరంగీ పోలీసులపై దాడికి దిగాడు. నూహ్ మత ఘర్షణలకు సంబంధించి ఇప్పటి వరకూ 60 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు హర్యానా పోలీసులు తెలిపారు.



## మంచం పట్టిన మన్యం

- పెరుగుతున్న జ్వర పీడితులు
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

**ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం**

వర్షాకాలం వచ్చిందంటే చాలు గుమ్మలక్ష్మీపురం మన్యం వ్యాధులతో మంచాన పడుతుంది. ఏ గ్రామం చూసినా జ్వర పీడితులే మంచం పట్టి కనిపిస్తున్నారు. పారిశుధ్య లోపం, ఈగలు, దోమల వ్యాప్తి, కలుషిత నీరు, ఆహారం వల్ల ప్రజలు మలేరియా, వైరల్ జ్వరాల బారినపడుతున్నారు. వైద్యం కోసం వస్తున్న రోగులతో ఆసుపత్రులు కిట కిట లాడుతున్నాయి.రోజు వారి ఒపి 150 పైనే అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం కోసం భద్రగిరి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. వైద్యం కోసం ఎక్కువగా వస్తున్న వారిలో విద్యార్థులు, మహిళలు, వృద్ధులే ఉన్నారు. ఎక్కువ శాతం మంది జ్వరాలు, తలనొప్పి, కీళ్ల నొప్పులు వంటి వ్యాధుల లక్షణాలతో వైద్యం కోసం వస్తున్నారని వైద్య సిబ్బంది చెబుతున్నారు. రోజువారి ఒపి 150పైగా నమోదు అవుతుంది. రోగుల సంఖ్య ఎక్కువగా ఉండి మంచాలు సరిపోకపోవడంతో ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగులకు వైద్యం అందిస్తున్నారు. ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా రోగులకు అన్ని రకాలైన వసతులు కల్పించడంలో మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదు. దీంతో ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగానే మిగిలిపోతుంది. దీంతో వైద్యం కోసం వెళ్తున్న విద్యార్థులకు సాధారణ పరీక్షలతోనే సరిపెడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆశ్రమ పాఠశాలలు, వసతి గహాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు స్థానికంగా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆదివాసీ ఆరోగ్యం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యా సంస్థలు మొదలుకొని కెజిహెచ్ వరకు హెల్త్ వాలంటీర్లను నియమించింది. ఆశ్రమ పాఠశాలలు, ఆసుపత్రుల్లో సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత కల్పించింది. దీంతో పాటు ఐటిడిఎలో ఒక వైద్యాధికారి, మోనాటరింగ్ అధికారి ఉండేవారు. సీరియస్ కేసులను ఇక్కడ నుంచి విశాఖ కెజిహెచ్‌కు తరలించే బాధ్యత వహించేవారు. దీంతో విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలందడంతో మరణాలు అదుపునకు వీలుండేది. ప్రభుత్వం మారాక హెల్త్ వాలంటీర్లను తొలగించడంతో పోయాయి. దీంతో విద్యార్థులకు స్థానికంగా వైద్యం అందక సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్యం పొందుతున్నారు.

## నేడు, రేపు 'ఇండియా' భేటీ

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ప్రతిపక్ష పార్టీల వేదిక ఇండియా మూడో సమావేశం ముంబయిలో గురు, శుక్రవారాల్లో జరగనుంది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలనే లక్ష్యంతో 26 ప్రతిపక్ష పార్టీలు ఇండియన్ నేషనల్ డెవెలప్‌మెంట్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా)గా ఏర్పాటైన సంగతి తెలిసిందే. గురు, శుక్రవారాల్లో ముంబయి వేదికగా జరుగుతున్న సమావేశాల్లో ఈ పార్టీల వేదిక లోగో, సమన్వయ కమిటీ నియామకం వంటి అంశాలపై చర్చ జరుగుతుందని తెలుస్తోంది. కనీస ఉమ్మడి కార్యక్రమం రూపొందించేందుకు, దేశవ్యాప్త ఆందోళనలకు, సీట్ల సర్దుబాటుకు కొన్ని ప్యానెళ్లను ప్రకటించే అవకాశముందని తెలుస్తోంది. ఈ వేదికలోని ప్రతిపక్ష పార్టీల మధ్య సమన్వయం కోసం దేశ రాజధానిలో కేంద్రం ఏర్పాటు చేసే అవకాశం కూడా ఉందని చెబుతున్నారు. ఈ సమావేశానికి హాజరయ్యేందుకు ఇప్పటికే ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన తనయుడు, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వియాదవ్ ఇప్పటికే ముంబైలో ఉన్నారు.



## మహిళా ఉద్యమ నేత సరోజినీ బాలానందన్ ఇకలేరు

**కొచ్చి :** కేరళలో మహిళా ఉద్యమ సీనియర్ నాయకులు సరోజినీ బాలానందన్ (86) తుదిశ్వాస విడిచారు. కొచ్చిలో ఆమె మంగళవారం కన్నుమూశారు. ఐద్వా అఖిల భారత ఉపాధ్యక్షులుగా, సిపిఎం కేరళ రాష్ట్ర కమిటీ సభ్యులుగా, ఎర్నాకులం జిల్లా కలమసేరి పంచాయతీ ప్రెసిడెంట్‌గా, సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్‌పర్సన్‌గా ఆమె విశేష సేవలందించారు. ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులు, సిఐటియు మాజీ అధ్యక్షులు ఇ బాలానందన్‌ను వివాహం చేసుకున్న అనంతరం ఆమె 60వ దశకంలో కేరళలో ఉద్యమంలో భాగస్వాములయ్యారు. భర్త జైలు పాలైనా కుటుంబ బాధ్యతలు చూసుకుంటూనే ఉద్యమాలకు అంకితమయ్యారు. మహిళా ఉద్యమంలో భాగంగా అనేక పోరాటాలకు నాయకత్వం వహించి, పోలీసుల క్రూరమైన లాఠీఛార్జిని, దౌర్జన్యాలను ఎదుర్కొన్నారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలైనా మొక్కవోని దీక్షతో ఉద్యమాలను నడిపారు. పలు ఉద్యమాల సందర్భంగా జైలు జీవితాన్ని గడిపారు. మహిళా సమస్యలపై వెలువడే 'ఈక్వాలిటీ' పత్రికకు ఎడిటర్ ఇన్ చీఫ్‌గా సేవలందించారు. మహిళా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పద్మా రామచంద్రన్ అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్‌లో ఆమె సభ్యురాలు. ఆమె మహిళా సంక్షేమ, శిశు సంక్షేమ బోర్డులలో కూడా సభ్యురాలిగా ఉన్నారు. ఆమె మృతి పట్ల సిఐటియు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. ఆమె కుటుంబ సభ్యులకు, సహచరులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## తమిళనాడుకు నీటి విడుదల

- సిడబ్ల్యుఎంఎ ఆదేశాలను పాటించిన కర్ణాటక

**మైసూర్ :** కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (సిడబ్ల్యుఎంఎ) ఆదేశాలకు అనుగుణంగా కర్ణాటక తన రిజర్వాయర్ల నుంచి తమిళనాడుకు నీటిని విడుదల చేయడం ప్రారంభించింది. మాండ్య జిల్లాలోని కృష్ణరాజ సాగర్ (కెఆర్‌ఎస్) రిజర్వాయర్ నుంచి, మైసూర్ జిల్లాలోని కబిని రిజర్వాయర్ నుంచి అవుట్ ఫ్లోను పెంచింది. మంగళవారం రాత్రి నుంచి అవుట్ ఫ్లోను పెంచినట్లు అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల నాటికి వీటి నుంచి తమిళనాడుకు 6,398 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. సెప్టెంబరు 12 వరకూ అంటే 15 రోజుల పాటు నీటిని విడుదల చేయాలని కర్ణాటకను సిడబ్ల్యుఎంఎ మంగళవారం ఆదేశించింది. తమిళనాడుకు నీటిని విడుదల చేస్తే ఆందోళనలు నిర్వహిస్తామని రైతు సంఘాలు హెచ్చరించినా, కర్ణాటక ప్రభుత్వానికి ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదు. కావేరీ జల వివాదం కేసు విచారణ ఈ వారంలో సుప్రీంకోర్టులో జరగనుంది. ఈ నేపథ్యంలోనూ నీటిని విడుదల చేసింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా కావేరీ రిజర్వాయర్లలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి. కెఆర్‌ఎస్ రిజర్వాయర్ వద్ద బుధవారం నాటికి నీటిమట్టం 101.58 అడుగులుగా ఉంది. గత ఏడాది ఇదే రోజుకు 123.92 అడుగుల నీటి మట్టం ఉంది.

## ఇమ్రాన్ ఖాన్ జ్యుడీషియల్ రిమాండ్ పొడిగింపు

**ఇస్లామాబాద్ :** రహస్యపత్రాల మిస్సింగ్ కేసులో ప్రత్యేక కోర్టు బుధవారం పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ జ్యుడీషియల్ రిమాండును సెప్టెంబర్ 13 వరకు పొడిగించింది. జడ్జి అబ్దుల్ హసంత్ జుల్కారినెయిన్ ఉత్తర్వులను జారీ చేశారు. అంతర్గత మంత్రిత్వ శాఖ వ్యక్తం చేసిన భద్రతా కారణాల రీత్యా న్యాయశాఖ అనుమతి మేరకు ఈ కేసు విచారణ పంజాబ్ ప్రావిన్స్‌లోని అటోక్ జిల్లా జైలులో జరిగింది. తోషఖానా అవినీతి కేసులో దోషిగా నిర్ధారణకావడంతో ఆగస్ట్ ఐదు నుండి ఇమ్రాన్‌ఖాన్ అటాక్ జిల్లా జైలులోనే ఉన్న సంగతి తెలిసిందే. దీంతో జైలులోనే విచారణ చేపట్టాలని అధికారులు మంగళవారం నిర్ణయించారు.

## సర్కారు నిర్ణయాలతో
# ఉపాధి హామీపై ప్రతికూల ప్రభావం!

**కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు సిపిఎం నేత బృందా కరత్ లేఖ**


**న్యూఢిల్లీ :** మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ)పై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పలు విధాన నిర్ణయాలతో తలెత్తుతున్న ప్రతికూల ప్రభావాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్ ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు ఆమె, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు ఒక లేఖ రాశారు. కార్మికుల హక్కులకు సంబంధించిన క్లాజులు, చట్టాన్ని ఖరారు చేయడంలో క్రియాశీలంగా పాల్గొన్న వ్యక్తిగా, డిమాండ్ ఆధారిత పనుల విషయంలో కార్మికుల హక్కులు రాజీ పడుతుండడంపై తాను తీవ్రంగా ఆందోళన చెందుతున్నానని బృందా కరత్ పేర్కొన్నారు. ఈ పథకం కింద జరిగే నిధుల కేటాయింపులు ఏమాత్రమూ సరిపోవడం లేదన్నారు. మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో డేటా ప్రకారం కేటాయించిన వాటిలో 91శాతం నిధులు ఇప్పటికే ఖర్చు చేశారు. ప్రస్తుత సగటు పనిదినాలు కేవలం 35.4 రోజులుగా వున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి కార్మికులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. పని ప్రదేశాల్లో హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం, ఆధార్ కార్డు ప్రాతిపదికగా చెల్లింపులు వంటి తప్పనిసరి నిబంధనలు, చట్టంలో పొందుపరిచిన బేషరతు హక్కులను ఆంక్షలతో కూడినవిగా మారుస్తున్నాయన్నారు. వేతనాల చెల్లింపులకు ఆధార్‌ను ప్రవేశపెట్టడం వల్ల వేతన చెల్లింపుల్లో పెద్దగా మార్పేమీ రాలేదన్నారు. దీనిపై ఒక సంస్థ ఇటీవల జరిపిన సర్వేలో వెల్లడైన అంశాలు చూసినట్లైతే మొత్తంగా 26 కోట్ల మంది ఉపాధిదారుల్లో 41.1శాతం మంది ఈ తరహా చెల్లింపులకు ఇంకా అర్హులు కారని తేలింది. పెద్ద సంఖ్యలో ఉపాధి కార్మికులు వుండే



ఐదు రాష్ట్రాల్లో 1.2కోట్ల మంది కార్మికులకు ఎబిపిఎస్ ఖాతాలు లేకపోవడంతో వారు చెల్లింపులకు అర్హులు కారని ఆ సర్వే నివేదిక పేర్కొంది. హిందూ పత్రిక ఈ నివేదికను బుధవారం ప్రచురించింది. చెల్లింపులకు పట్టే సమయం లేదా తిరస్కరణ శాతాలకు సంబంధించి చూసినట్లైతే ఎబిపిఎస్‌కు, సాధారణ ఖాతా లావాదేవీలకు గణాంకాల పరంగా చాలా కొద్ది తేడా వుందని ప్రభుత్వ డేటాను విశ్లేషిస్తే తెలుస్తోందని సర్వే పేర్కొంది. దీనివల్ల కార్మికులకు పెద్దగా లాభం లేకపోయినా నష్టాలు మాత్రం ఎక్కువగానే వున్నాయని ఆ లేఖ పేర్కొంది.

గత ఆరు మాసాలుగా తాను ఉపాధి హామీ పథకం కింద పని జరిగే ప్రదేశాల్లో పర్యటించానని, రాష్ట్రాల వారీగా కార్మికులతో మాట్లాడానని ఆమె చెప్పారు. పని జరిగే చోట నిర్దిష్ట సమయాల్లో ఆన్‌లైన్‌లో హాజరును నమోదు చేసుకోవడమన్నది ప్రధాన సమస్యగా వుందని ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు. గ్రామీణ భారతంలో చాలా ప్రాంతాల్లో, ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ కనెక్టివిటీలో చాలా ఇబ్బందులు వుంటాయి. తప్పనిసరి ఆన్‌లైన్ నమోదు కావడంతో కార్మికులకు చాలా ఇబ్బందులు వస్తున్నాయని బృందాకరత్ ఆ లేఖలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో హాజరు నమోదు కోసం పనికి ముందు, అయిపోయిన తర్వాత అదనపు సమయం వుండాల్సి వస్తోందని, దీనివల్ల మహిళలు ఇళ్లలో ఇబ్బందులు పడుతున్నారని ఆమె చెప్పారు. హాజరు నమోదు కాకపోతే వేతనాలు తిరస్కరిస్తున్న సందర్భాలు వున్నాయన్నారు.

షెడ్యూల్ రేట్లు, పీస్ రేట్లు చాలా ఇబ్బందికరంగా మారాయని మహిళా కార్మికులతో మాట్లాడినప్పుడు చెప్పారని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో, పని ప్రదేశాల్లో మహిళల పని నిబంధనలకు సంబంధించినంత వరకు చాలా తక్కువ రేట్లకే మహిళల శ్రమ దోపిడీ జరుగుతోందని స్పష్టమవుతోంది. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం అమలు జరిగే పని ప్రదేశాల్లో ఇటీవలి కాలంలో జరిగిన సర్వేలను ఏ మంత్రిత్వ శాఖ ఉపయోగించుకోవడం లేదు. గతంలో అనేక రాష్ట్రాల్లో ఇటువంటి సర్వేల తర్వాత మహిళల పని నిబంధనలను నిర్ణయించేవారు. దీనిపై అత్యవసరంగా దృష్టి పెట్టాల్సిన అవసరముందని ఆ లేఖలో ఆమె తెలిపారు. ఈ లేఖలో తాను లేవదీసిన అంశాలన్నింటిపై తగు చర్యలు తీసుకోగలరని ఆశిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సిపిఐ నాయకులు రాజా, నారాయణ తదితరులు

## రాజకీయ చొరవ, చర్చలతోనే
# మణిపూర్ పునర్నిర్మాణం

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సిపిఐ బృందం వినతి

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

'మణిపూర్ పరిస్థితిని సానుభూతితో చూస్తారని, మణిపూర్ రాష్ట్రంలో శాంతి, సామరస్యాన్ని నెలకొల్పేందుకు మీ ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటుందని సిపిఐ ఆశిస్తోంది. మణిపూర్ ప్రజలు సమాజంలోని విభజనల బాధితులు, ఒక రాజకీయ చొరవ, చర్చలు మణిపూర్‌ను పునర్నిర్మించడానికి, ప్రజలకు అవసరమైన విశ్వాసాన్ని ఇస్తుంది' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సిపిఐ బృందం విజ్ఞప్తి చేసింది. ఆగస్టు 21 నుంచి 24 వరకు నాలుగు రోజులపాటు మణిపూర్‌లో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా నేతృత్వంలో బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర గవర్నరుతో భేటీ అయ్యారు. కుకీ, మైతీ బాధితుల సహాయ శిబిరాలను సందర్శించారు. అలాగే వివిధ రాజకీయ పార్టీల నేతలు, వివిధ వర్గాల నేతలతో భేటీ అయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజాతోపాటు జాతీయ కౌన్సిల్ కార్యదర్శులు బినోయ్ విశ్వం (ఎంపి), కె నారాయణ, రామకృష్ణ పాండాతో కూడిన సిపిఐ ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు. కుకీలు, నాగాలు, మైతీలు ఏ వర్గం వారు వారి ప్రాంతాల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఇంఫాల్‌లో గుర్తుపట్టలేని మృతదేహాలు 250 నుంచి 300 వరకు ఉన్నాయని అన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ మాట్లాడుతూ.. మణిపూర్‌లో పరిస్థితులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని, మణిపూర్ ముఖ్యమంత్రిని తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మణిపూర్‌లో పర్యటించాలన్నారు. అటవీ సంరక్షణ బిల్లుపై సంతకం పెట్టవద్దని ద్రౌపది ముర్ముని కోరామన్నారు. చంద్రయాన్ దిగిన ప్రాంతానికి శివశక్తి అని ఒక మతానికి సంబంధించిన పేరు ఎలా పెడతారని ప్రశ్నించారు. 2014కు ముందు గ్యాస్ ధర ఎంత ఉందో అంతకు తగ్గించాలని డిమాండ్ చేశారు. బిజెపికి వైసిపి అనుకూలంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఎపిలో సిపిఎం, సిపిఐ, టిడిపి, జనసేన కలిసి పోటీ చేస్తే మంచిదని, బిజెపి, వైసిపి డబుల్ ఇంజన్ సర్కార్ విఫలం చెందుతుందన్నారు. అవినాష్ రెడ్డి, కవిత జైలుకు వెళ్లకుండా ఉండటానికి బిజెపి, వైసిపి, బిఆర్‌ఎస్ మధ్య ఒప్పందాలు జరిగాయన్నారు. కొండపైన లిక్కర్ నిషేధముందని, కానీ లిక్కర్ అమ్మేవాడిని టిటిడి బోర్డు సభ్యుడిగా పెట్టారని ఎద్దేవా చేశారు. రెండు రాష్ట్రాల్లో బిజెపికి స్థానాలు లేకపోయినా రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రంలో బిజెపికి మద్దతు ఇస్తున్నారని విమర్శించారు. బిజెపి వల్ల రెండు రాష్ట్రాల ప్రజలకు నష్టం జరుగుతుందని అన్నారు. బిజెపితో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించే వారికి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరుతున్నామన్నారు.

## అధీర్‌రంజన్ చౌదరి సస్పెన్షన్ రద్దు

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ చౌదరి సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ లోక్‌సభ సచివాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కాంగ్రెస్ ఎంపీ పార్లమెంటరీ కమిటీ ముందు బుధవారం హాజరైన తర్వాత సస్పెన్షన్‌ను రద్దు చేయాలని సిఫార్సు చేస్తూ లోక్‌సభ ప్రివిలేజ్ కమిటీ తీర్మానాన్ని ఆమోదించింది. మణిపూర్ హింసాకాండపై అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా అధిర్ రంజన్ చౌదరి ప్రధాని నరేంద్ర మోడీని ధృతరాష్ట్రునితో పోల్చారు. దీంతో, ఆయనను ఈ నెల 11న స్పీకర్ సస్పెండ్ చేశారు. లోక్‌సభ ప్రివిలేజెస్ కమిటీ ముందు హాజరైన అధిర్ రంజన్ చౌదరి..


ఎవరి మనోభావాలను దెబ్బతీసే ఉద్దేశం లేదని అన్నారు. వర్షాకాల సమావేశాల సందర్భంగా పార్లమెంటులో తాను చేసిన వ్యాఖ్యలపై ఆయన విచారం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో ప్రజల తరుపున మాట్లాడేటప్పుడు ఆవేదన ఉంటుందని, దాన్ని యథావిధిగా బయటపెడతామని చెప్పారు. ఆ క్రమంలో మనసుకు ఏం అనిపిస్తే అది మాట్లాడతామని తెలిపారు. దీంతో బిజెపి సభ్యుడు సునీల్ కుమార్ సింగ్ అధ్యక్షతన పార్లమెంట్ కమిటీ అధిర్ సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు నివేదిక సమర్పించింది. అనంతరం లోక్‌సభ సచివాలయం అధిర్‌పై సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది.

## మిజోరం ఎన్నికలో జెడ్‌పిఎంతో హెచ్‌పిసి పొత్తు

**ఐజ్వాల్ :** త్వరలో జరిగే మిజోరం అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రతిపక్ష పార్టీ జోరం పీపుల్స్ మూవెంట్ (జెడ్‌పిఎం)తో హమర్ పీపుల్స్ కన్వెన్షన్ (హెచ్‌పిసి) పొత్తు కుదుర్చుకుంది. మంగళవారం రాష్ట్రంలోని సక్రాదైలో జరిగిన సమావేశంలో ఈ మేరకు ఒక ఒప్పందంపై సంతకం చేశాయి. 'ఈ ఏడాది చివరిలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో జెడ్‌పిఎం అభ్యర్థులు విజయం సాధించేలా చూసేందుకు సొంత అభ్యర్థులను నిలబెట్టకుండా హెచ్‌పిసి పూర్తి మద్దతు ఇస్తుంది' అని ఒప్పందం తెలిపింది.

# మహిళలకు కర్ణాటక సర్కారు రక్షాబంధన్ కానుక

**బెంగళూరు :** రక్షా బంధన్ సందర్భంగా కర్ణాటకలోని సిద్ధరామయ్య ప్రభుత్వం మహిళలకు భారీ కానుక అందించింది. మైసూర్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎంపీ రాహుల్‌గాంధీ, సిఎం సిద్ధరామయ్య గృహ లక్ష్మి యోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా కోటి మందికి పైగా మహిళలకు నెలవారీ రూ.2000 చొప్పున భృతిని అందజేస్తామని నేతలు తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ "ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కర్ణాటకకు ఐదు వాగ్దానాలు చేసింది. కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ నేతలు ఏదైనా చెబితే అది చేస్తారని మేం చెప్పాం. ఈరోజు మనం ట్యాబ్‌లో క్లిక్ చేయగానే కోట్లాది మంది మహిళల బ్యాంకు ఖాతాల్లో నేరుగా రూ.2000 జమ అయింది." అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఐదు పథకాల్లో నాలుగు పథకాలు మహిళల కోసం రూపొందించబడ్డాయన్నారు. భారత్ జోడో యాత్రలో వేలాదిమంది మహిళలను కలిశానని, ద్రవ్యోల్బణాన్ని భరించలేకపోతున్నామని వారు తనతో చెప్పారని.. కర్ణాటక మహిళలే ఈ రాష్ట్రానికి పునాది అని తనకు అర్థమైందన్నారు. 1.1 కోట్ల మంది మహిళలకు నెలవారీ రూ.2,000 సహాయం అందించేందుకు కర్ణాటక ప్రభుత్వం 'గృహలక్ష్మి' పథకాన్ని ప్రారంభించింది. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ గృహ లక్ష్మి యోజన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు డిబిటి ద్వారా మొత్తాన్ని బదిలీ చేశారు. అదే సమయంలో, ఈ పథకాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ తదతరులు పాల్గొన్నారు.




గృహలక్ష్మి యోజన పథకాన్ని ప్రారంభిస్తున్న ఖర్గే, రాహుల్‌గాంధీ, సిద్ధరామయ్య తదితరులు

## గ్వాటెమాలా అధ్యక్షుడిగా సెంటర్ లెఫ్ట్ అభ్యర్థి బెర్నార్డో అరెవాలో ఎన్నిక




**గ్వాటెమాలా సిటీ :** గ్వాటెమాలా అధ్యక్ష ఎన్నికల్లో మధ్యేమార్గ వామపక్ష అభ్యర్థి బెర్నార్డో అరెవాలో విజేతగా నిలిచారని దేశ ఉన్నత ఎన్నికల ట్రిబ్యునల్ సోమవారం ప్రకటించింది. అదే రోజు ఆయన రాజకీయ పార్టీ రద్దయింది. జనవరి 14న ఆయన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడతారు. ఆయన పార్టీ సీడ్ మూవ్‌మెంట్‌కి చెందిన ఎంపీలు ప్రమాణ స్వీకారం చేయగలుగుతారో లేదో స్పష్టం కాలేదు. మితవాద పార్టీ మద్దతున్న అభ్యర్థిపై గెలుపొందినప్పటి నుండి అరెవాలో అనేక చట్టపరమైన సవాళ్లను, అవకతవకల ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఎలక్టోరల్ రిజిస్ట్రీ తన పార్టీని సస్పెండ్ చేయడం చట్టబద్ధంగా చెల్లదని అరెవాలో పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ అప్పీల్ చేయనున్నట్లు తెలిపారు. ఈ దశలో తాను అధికారం చేపట్టకుండా ఎవరూ ఆపలేరని ఆయన ఒక పత్రికా సమావేశంలో ప్రకటించారు. గ్వాటెమాలా అటార్నీ జనరల్ కార్యాలయం సీడ్ మూవ్‌మెంట్ పార్టీపై జరిపిన దర్యాప్తు నేపథ్యంలో ఎలక్టోరల్ రిజిస్ట్రీ పై రూలింగ్ ఇచ్చింది. ఉద్యమాన్ని పార్టీగా ఏర్పాటు చేసేందుకు సంతకాల సేకరణలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు జరిగింది. ఈ నేపథ్యంలో సీడ్ పార్టీ సుప్రీంను ఆశ్రయించనుంది.

# గాబన్‌లో సైనిక తిరుగుబాటు!

- గృహ నిర్బంధంలో అధ్యక్షుడు

**లిబ్రెవిల్లె :** సెంట్రల్ ఆఫ్రికా దేశమైన గాబన్ అధ్యక్ష ఎన్నికల ఫలితాలను మిలటరీ రద్దు చేసింది. ప్రభుత్వ సంస్థలు కూడా రద్దయ్యాయని సైనిక అధికారులు బుధవారం తెలిపారు. తాము అధికారాన్ని చేతుల్లోకి తీసుకున్నామని, అధ్యక్షుడు అలీ బాంగోను గృహ నిర్బంధంలో వుంచినట్లు ప్రకటించారు. సీనియర్ సైనిక అధికారుల బృందం ఈ మేరకు టివిలో ఒక ప్రకటన చేసింది. వివాదాస్పదమైన ఎన్నికల్లో బాంగో తిరిగి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారని ప్రకటన వెలువడిన వెంటనే తాము అధికారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం, సెనెట్, నేషనల్ అసెంబ్లీ, రాజ్యాంగ కోర్టు, ఆర్థిక, సామాజిక, పర్యావరణ మండలి, గబనీస్ సెంటర్ ఫర్ ఎలక్షన్లలతో సహా అన్ని ప్రభుత్వ సంస్థలు రద్దయ్యాయి. తదుపరి నోటీసులు జారీ చేసేవరకు అన్ని సరిహద్దులను మూసివేస్తున్నట్లు తెలిపారు. శనివారం జరిగిన ఎన్నికల్లో పాలక గాబనీస్



డెమొక్రటిక్ పార్టీకి చెందిన బాంబో తిరిగి ఎన్నికయ్యారని గాబన్ జాతీయ ఎన్నికల సంస్థ ప్రకటించింది. అయితే ఆ ఎన్నిక విశ్వసనీయం కాదని సైనికాధికారులు పేర్కొన్నారు. ఇదిలావుండగా, రాజధాని లిబ్రెవిల్లెలో తుపాకీ కాల్పులు వినిపించినట్లు స్థానిక మీడియా తెలిపింది. కాగా మిలటరీ చేసిన ప్రకటనపై గాబన్ అధ్యక్షుడు, ప్రభుత్వం ఇంతవరకు స్పందించలేదు.

## "స్మైల్ ప్లీజ్ !" ....

- విక్రమ్ ల్యాండర్‌ని ఫొటో తీసిన ప్రజ్ఞాన్ రోవర్
- విడుదల చేసిన ఇస్రో

**బెంగళూరు :** విక్రమ్ ల్యాండర్ ఫొటోను ప్రజ్ఞాన్ రోవర్ క్లిక్ మనిపించింది. రోవర్‌లోని నావిగేషన్ కెమెరాలు బుధవారం ఉదయం ఈ చిత్రాన్ని తీశాయని ఇస్రో తెలిపింది. చంద్రయాన్-3లోని నావిగేషన్ కెమెరాలను లేబరేటర్ ఫర్ ఎలక్ట్రో ఆప్టిక్స్ సిస్టమ్స్ (ఎల్‌ఇఒఎస్) అభివృద్ధిపరిచిందని ఇస్రో వెల్లడించింది. చంద్రుని ఉపరితలంపై దిగిన కాసేపటికి బయటకు వచ్చిన ప్రజ్ఞాన్ రోవర్ చంద్రుడిపై తిరుగుతోంది. ఫొటోలు తీస్తూ, తనకు అప్పగించిన ప్రయోగాలను నిర్వహిస్తోంది. చాస్ట్ (చంద్రుని ఉపరితలంపై థెర్మోఫిజికల్ ప్రయోగం), ఐఎల్‌ఎస్ఎ (ఇన్‌స్ట్రుమెంట్ ఫర్ లూనార్ సెస్మిక్ యాక్టివిటీ)లను మోహరించడం ల్యాండర్ చిత్రంలో కనిపిస్తోంది. ల్యాండర్‌లోని నాలుగు పేలోడ్‌లలో ఈ రెండు ఉన్నాయి. చాస్ట్ పేలోడ్‌తో దక్షిణ ధృవం వద్ద చంద్రుని ఉపరితలంపై గల మట్టి ఉష్ణోగ్రతలను లెక్కిస్తారు. ల్యాండ్ అయిన ప్రదేశంలో నేల కంపించిన తీవ్రతను గణించడం ఐఎల్‌ఎస్ఎ లక్ష్యంగా వుంది. ఈ ప్రాంతంలో సల్ఫర్ వుందని రోవర్‌లోని ఎల్‌ఐబిఎస్ పరికరం మంగళవారం ధ్రువీకరించింది. ఆర్బిటర్లలోని పరికరాల వల్ల గతంలో ఇది సాధ్యం కాలేదని ఇస్రో పేర్కొంది.

## ముఖం చాటేసిన మేఘం

(మొదటి పేజీ తరువాయి)

మాధవన్ రాజీవన్ తెలిపారు.

ఈ ఏడాది రుతుపవనాలు దాదాపు 8 శాతం లోటుతో ముగిసే అవకాశం ఉంది. ఇది గడచిన ఎనిమిదేళ్లలో అత్యంత దారుణంగా ఉండబోతున్నదని పేరు తెలపడానికి ఇష్టపడని వాతావరణ అధికారిని ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తా సంస్థ ఇటీవల తెలియజేసింది. అయితే సెప్టెంబరు మొదటి వారం తరువాత అసలు సీజనల్ లోటు ఎంత అనేదానిపై స్పష్టత వస్తుందని రాజీవన్ చెప్పారు. సుదీర్ఘ పొడి వాతావరణం చాలా రాష్ట్రాల్లో ఖరీఫ్ పంటపై ఇప్పటికే ప్రభావం చూపనారంభించింది. ఖరీఫ్ పంటల విత్తనం ముగింపు దశకు చేరుకుంది. ఇప్పుడు అందరి దృష్టి రుతుపవనాలు ఎప్పుడు పుంజుకుంటాయన్నదానిపైనే ఉంది. రాబోయే 10-15 రోజుల్లో వర్షాలు సరిగా పడకపోతే నీటి పారుదల సౌకర్యాలు అంతగా లేని ప్రాంతాల్లో దిగుబడి తగ్గుతుంది. నీటి పారుదల అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో సాగు వ్యయం పెరుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇండోర్‌కు చెందిన భారతీయ సోయాబీన్ ప్రాసెసర్స్ అసోసియేషన్ నిర్వహించిన పంట ఆరోగ్య సర్వేలో ఆగస్టు వర్షపాతంలో అసాధారణమైన లోటు ఉన్నట్లు పేర్కొంది. ఇప్పటివరకు సోయా పంట ఉన్న తేమను ఉపయోగించుకుని ఎదుగుతూ వచ్చింది. ఇప్పుడు గనుక వెంటనే వర్షాలు పడకపోతే పంట దెబ్బతింటుంది. రాబోయే 45 రోజుల్లో రుతుపవనాలు ఏ మేరకు పుంజుకుంటాయనే దానిపై అంతా ఆధారపడి ఉంటుంది అని అసోసియేషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. సోపా విశ్లేషణ ప్రకారం సోయాబీన్‌ను ఎక్కువగా పండించే మూడు ప్రధాన రాష్ట్రాలైన మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ పంట నష్టం ముప్పును ఎదుర్కొనబోతున్నాయి. రాజస్థాన్‌లో ప్రధాన ఖరీఫ్ పంటలైన వరి, సోయాబీన్, పత్తి , బజ్రా వంటి పంటలకు ఇప్పుడు వర్షాలు చాలా అవసరమని సరుకుల విశ్లేషణ సంస్థ ఇగ్రెయిన్ ఇండియా పేర్కొంది. గుజరాత్‌లో సోయాబీన్, బజ్రా, వరి, వేరుశనగ వంటి ప్రధాన పంటలకు తక్షణమే నీరందించాల్సిన అవసరముంది. వచ్చే 10-15 రోజుల్లో సరిగ్గా వర్షాలు పడని పక్షంలో దిగుబడి పడిపోతుందని ఆ సంస్థ పేర్కొంది. అలాగే వర్షాలు సెప్టెంబరులో బలహీనంగాఉంటే, రాబోయే రోజుల్లో రబీ పంటకు కూడా ముప్పు తప్పకపోవచ్చని హెచ్చరించింది. భారత దేశ ఆహార ధాన్యాల ఉత్పత్తిలో 40 శాతం రుతుపవనాల వర్షాల మీదే ఆధారపడి ఉంది. క్రిసిల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ అండ్ అనలిటిక్స్ సంస్థ డైరక్టర్ (పరిశోధన) పుషాన్ శర్మ మాట్లాడుతూ, రుతుపవనాల లోటుతోపాటు రిజర్వాయర్ల లెవెల్స్ బాగా తక్కువగా ఉండడం, వంట దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. వర్షపాతం లోటు వల్ల చీడ పీడల బెడద పెరిగి, పువ్వు, కాయల దశలో తొలిచేసి పంట నాశనమయ్యే ప్రమాదం ఉందని తెలిపింది. కేర్ ఎడ్జ్ ఇండియా అనే మరో పరిశోధనా సంస్థ చేసిన విశ్లేషణ ప్రకారం మహారాష్ట్ర, జార్ఖండ్, కర్ణాటక, ఒడిశా, పశ్చిమ బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాలు అస్థిరమైన రుతుపవనాల వల్ల పంట నష్టం భారత దేశ జివిఎ( స్థూల విలువ జోడింపు) లో దాదాపు మూడింట ఒక వంతు దాకా ఉంటుందని తెలిపింది. 'క్రిసిల్' పంటలవారీగా చేసిన విశ్లేషణలో తెల్ల దోమ వంటి చీడపీడలు రాజస్థాన్‌లో పత్తి పంటకు ఎక్కువగా సోకినట్లు తెలిపింది. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఆలస్యంగా నాటడం వల్ల పంట దిగుబడి తగ్గుతుందని పేర్కొంది. దక్షిణాది రాష్ట్రాల్లో రాబోయే 15-20 రోజుల్లో పొడి పరిస్థితులు ఇలాగే కొనసాగితే రైతులు పత్తి పంటను తొలగించి మొక్కజొన్న వైపు మళ్లాల్సి వుంటుందని, ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఈ పరిస్థితి వస్తుందని శర్మ బిజినెస్ స్టాండర్డ్‌కు తెలిపారు.

## విద్యార్థి కుటుంబానికి పరామర్శ

(మొదటి పేజీ తరువాయి)

సాగుతో జీవనోపాధి పొందుతున్నారు. కుతుబ్‌పూర్ చిన్న చిన్న మట్టి రోడ్ల సరిహద్దుల్లో ప్లాస్టింగ్, పెయింట్ చేయని చిన్న ఇటుకలతో ఇళ్లు నిండి ఉన్నాయి. ఇర్షాద్‌ది పెద్ద కుటుంబం. నలుగురు సోదరులు, వారి భార్యలు, పిల్లలతో దాదాపు ఇరవై మంది ఉన్నారు. అందరూ రెండు చిన్న ఇళ్లలో నివసిస్తున్నారు. ఒకప్పుడు మత సామరస్యానికి నమూనాగా ఉన్న కుతుబ్‌పూర్ ఇటీవల యుపిలో మతపరమైన వివక్ష తీవ్రతను బయటపెట్టిన వీడియో క్లిప్‌తో వార్తల్లో నిలిచింది. నేహ పబ్లిక్ స్కూల్ అనే ప్రైవేట్ స్కూల్లో రెండో తరగతి చదువుతున్న ఏడేళ్ల బాలుడిని ఉపాధ్యాయుడి సూచన మేరకు సహ విద్యార్థులు కొట్టిన దృశ్యం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇర్షాద్ ముగ్గురు కొడుకుల్లో చిన్నవాడికి ఈ చేదు అనుభవం ఎదురైంది.

### పోలీసులపై నమ్మకం లేదు

సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ, రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్‌తో కూడిన సిపిఎం ప్రతినిధి బృందం కుతుబ్‌పూర్‌లోని ఇర్షాద్‌కు చెందిన చిన్న ఇంటికి వెళ్లి, ఆ బాలుడి కష్టాలను తెలుసుకున్నారు. తమ బాబు నిద్రలేని రాత్రులు భయంతో గడిపిన విషయాన్ని తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు. "మీరట్‌లో డాక్టర్‌ని కలవాల్సి వచ్చింది. పిల్లాడిలో పాత ఉత్సాహం లేదు. హోం వర్క్ చేయనందుకు శిక్ష విధించానని టీచర్ త్రిప్తా త్యాగి చెప్పారు. టీచర్లు ఇతర పిల్లల చేత కొట్టించడం వక్రబుద్ధి. మతాలకు అతీతంగా అందరూ సామరస్యంగా జీవించే గ్రామం కుతుబ్‌పూర్. గత లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి ఓటు వేశాం. బిజెపి మత రాజకీయాలు ఎంత ప్రమాదకరమో ఇప్పుడు అనుభవిస్తున్నాం. ఘటన తరువాత పలుమార్లు ఉపాధ్యాయుడిని కలిసేందుకు ప్రయత్నించినా కలవలేదు. ఏదో పని నిమిత్తం పాఠశాలకు వెళ్లిన బంధువు బాలుడిని వేధించడం చూశాడు. ఆయన వీడియో తీశాడు. దెబ్బలు తిన్న పిల్లలు, వారి తల్లిదండ్రులు సర్దిచెప్పి ప్రేమగా ఉన్నారు. అందరూ ఒకరికొకరు తెలుసు. అయినా మతం విషం తలకెక్కిన టీచర్ మనసు మార్చుకోలేదు. పోలీసుల చర్యపై నమ్మకం లేదు. మా అబ్బాయి భవిష్యత్తు గురించే ఆందోళన చెందుతున్నాం. సిపిఎం సహకారం ఎంతో ఊరటనిచ్చింది" అని తల్లిదండ్రులు ప్రతినిధి బృందానికి తెలిపారు.

### అన్ని వేళలా అండగా సిపిఎం : సుభాషిణి అలీ

సుభాషిణి అలీ మాట్లాడుతూ బాధిత బాలుడి కుటుంబానికి సిపిఎం ఎల్లవేళలా అండగా నిలుస్తుందని తెలిపారు. ఆ బాలుడి చదువు ఖర్చులను కూడా సిపిఎం భరిస్తుందన్నారు. అవసరమైన సహాయం అందించాలని స్థానిక సిపిఎం నాయకత్వానికి సూచించినట్లు తెలిపారు. తప్పు చేసిన టీచర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం పెట్టిన కేసులు బలంగా లేవని అన్నారు. టీచర్‌ను కాపాడేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తే ప్రతిఘటిస్తామని సుభాషిణి అలీ అన్నారు.

### బిజెపికి ఓటేసిన కుటుంబం పట్లే మతతత్వ వివక్ష : జాన్ బ్రిట్టాస్

ఎంపి జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో బిజెపికి ఓటు వేసిన ఓ కుటుంబం మతతత్వ వివక్షను అనుభవించిందని జాన్ బ్రిట్టాస్ అన్నారు. మతోన్మాదం అన్ని హద్దులు దాటుతోందని, కేంద్రంలోనూ, యుపిలోనూ ప్రభుత్వాలు మతోన్మాదాన్ని పెంచుతున్నాయన్నారు. బాలుడి కుటుంబం అత్యంత పేదరికంలో జీవిస్తోందని తెలిపారు. లౌకికవాద సందేశాన్ని బలంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ కుటుంబానికి కేరళ మద్దతు తెలిపిందని, చదువుకు సాయం సహా ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి చెప్పిన మాటలు ఆ కుటుంబంలో ఆనందాన్ని నింపాయని అన్నారు. ఈ కుటుంబానికి సిపిఎం అండగా నిలుస్తుందని, కేరళ ఓనం కానుకను చిన్నారికి అందజేశామని బ్రిట్టాస్ తెలిపారు.

### యుపి ప్రభుత్వానికి ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసులు

ముస్లిం బాలుడిపై చెంపదెబ్బల వివాదంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి, ఆ రాష్ట్ర పోలీసులకు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) నోటీసులు జారీ చేసింది. 'నాలుగు వారాల్లో వివరణాత్మక నివేదిక ఇవ్వాలని ఉత్తరప్రదేశ్ ప్రధాన కార్యదర్శి, డిజిపికి నోటీసు జారీ చేశాం. టీచర్‌పై తీసుకున్న చర్య, నమోదైన ఎఫ్‌ఐఆర్ ప్రస్తుత స్థితి, బాధిత కుటుంబానికి చెల్లించిన నష్ట పరిహారం వివరాలు, ఇలాంటి అవమానకరమైన ఘటనలు పునరావృతం కాకుండా తీసుకున్న చర్యలు, ప్రతిపాదనలు వంటి వివరాలతో నివేదిక ఇవ్వాలని తెలిపాం' అని ఎన్‌హెచ్‌ఆర్‌సి ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించినట్లు పేర్కొంది. ఈ ఘటనపై ముజఫర్‌నగర్ జిల్లా మేజిస్ట్రేట్‌కు ఉత్తరప్రదేశ్ మైనారిటీ కమిషన్ కూడా లేఖ రాసింది. సెప్టెంబర్ 6 లోపు తమ కార్యాలయంలో హాజరై సమాధానం ఇవ్వాలని, విచారణ సమయంలో జిల్లా ప్రాథమిక శిక్షా అధికారి, నిందిత టీచర్ త్యాగి హాజరు కావాలని ఆదేశించింది. ముస్లిం బాలుడిని ఇతర విద్యార్థులతో కొట్టించిన నేహ పబ్లిక్ స్కూల్‌ను ఆదివారం అధికారులు సీల్ చేశారు.






## మీకోసం

గాజులు ఎక్కకుండా ఇబ్బందిపెడుతుంటే ఒక పాలిథిన్ కవర్ చేతికి తొడుక్కుని ఎక్కించుకోవాలి.

## జీవన సౌరభం

మనిషి స్థాయిని నిర్ణయించేది అతని ప్రవర్తనే.. పొగడ్త కాదు..





# ప్లాస్టిక్ భూతం

వినాయకచవితి సందర్భంగా ఓ నాటకం వేస్తున్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా సాగుతున్న నాటకాన్ని వీక్షకులు చాలా ఆసక్తిగా చూస్తున్నారు. వారిలో 10 ఏళ్ల రాము కూడా ఉన్నాడు. ఆ రోజు రాత్రి నాటిక చూసి ఇంటికి వచ్చి పడుకున్నాడు.

నిద్రలో అతనికి ఓ కల వచ్చింది. 'రామూ.. నేను ప్లాస్టిక్ భూతాన్ని. నాటికలో నన్ను చంపేశారని సంబరపడుతున్నావా? అది నాటిక. నిజంగా నేను చావలేదు. ఇప్పుడొచ్చేది పండుగ కాలం. చాలా అట్టహాసంగా వేడుకలు చేసుకుంటారు. టపాసులు కాలుస్తారు. ఈ కార్యక్రమాలన్నీ నేను లేకుండా ఏం జరగవు. నన్ను మీరు ఏవిధంగానూ హతమార్చలేరు. భూమిలో పాతి పెడితే, వర్షం నీరు ఇంకనీయకుండా చేసి, నన్ను పాతిన చోట కనీసం ఒక మొక్కను కూడా మొలవనివ్వకుండా కరువు సృష్టిస్తాను. కాల్చి బూడిద చేస్తామంటారా? విషవాయువులు వ్యాపింపజేసి మిమ్మల్ని అంతమొందిస్తాను. నన్ను పెంచేది మీరే, మీ అండతోనే మిమ్మల్ని సర్వనాశనం చేయడానికి వచ్చాను.' అంటూ ఓ తెల్లని ఆకారం రాముతో మాట్లాడుతుంది.

తెల్లవారగానే రాము తనకు వచ్చిన కల గురించి ఇంట్లో చెప్పాడు. ఇకపై ఇంట్లో ఎవరూ ప్లాస్టిక్ వాడవద్దని, గుడ్డలతో చేసినవి, నార సంచులనే వాడమని చెప్పాడు. ప్రకృతి సహజసిద్ధ వస్తువులతోనే పండుగలన్నీ చేసుకుందాం అన్నాడు. ఆ రోజు స్కూలుకు వెళ్లి స్నేహితులతో కూడా అదే మాట చెప్పాడు. ఆ రోజు నుంచి రాము, స్నేహితులు వారి ఇళ్లల్లో, స్కూల్లో ప్లాస్టిక్ వాడడం తగ్గించేశారు.


అప్పుడు ప్లాస్టిక్ భూతం నిజంగానే నిరుత్సాహపడి, నీరసించి పోయి ఉంటుంది. కదూ?

**- ద్వారపురెడ్డి జయరాం నాయుడు**

## సరి చేసి రాయండి

**పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన పదాలలో గీత గీసిన అక్షరం తప్పుగా వచ్చింది. సరైన అక్షరం మీరు రాయండి..**


జమకాయ –
గడిద –
టపకాయ –
పసపు –
తతతల –



green apples + red apples = ______
blue apples + green apples = ______
red apples + blue apples = ______

## కనిపెట్టండి

**పిల్లలూ, ఇక్కడ రంగురంగుల యాపిల్స్ ఉన్నాయి. కింద ఇచ్చిన సూచనల ఆధారంగా ఏ రంగు యాపిల్స్ ఎన్నో లెక్కపెట్టి, సమాధానాలు రాబట్టండి చూద్దాం.**




## నేను గీసిన బొమ్మ



**అక్షర,**
**4వ తరగతి,**
**మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,**
**ఓబుళ దేవర పల్లి,**
**నంద్యాల జిల్లా.**

**పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ:** chinnaarips@gmail.com

# గుర్తించండి.. విస్మరించొద్దు ...

**అమ్మానాన్న ఇద్దరూ వైకల్యంతో బాధపడుతుంటే.. అదీ చెవి, మూగ బాధితులైతే.. వారి పిల్లల పరిస్థితి ఏంటి? అమ్మతో చెప్పకుందామనుకున్న ఊసులు, నాన్నతో పంచుకోవాల్సిన ఆశ్చర్యాలు ఎలా చెప్పకోవాలి? ఈ బాధతో చాలామంది వైకల్య బాధిత తల్లిదండ్రులున్న పిల్లలు మానసిక వేదన పడుతుంటారు. కానీ, నీతా గోపాలకృష్ణ అలా కాదు.. వైకల్య బాధిత తల్లిదండ్రులతో మాట్లాడుతూ సైన్ లాంగ్వేజ్ వంట బట్టించుకుంది. ఇప్పుడు అదే భాషను నేర్పుతూ వేలాదిమంది వైకల్య బాధితుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.**



'నా తల్లిదండ్రులను నేను ఎప్పుడూ ప్రత్యేక వ్యక్తులుగా చూడలేదు. నా దృష్టిలో వారికి ఉన్న లోపం పెద్ద విషయమే కాదు' అంటున్న నీతా ఆలోచనలతో ఏకీభవిస్తూ తన భర్త చైతన్య కొత్తపల్లి 'యునికీ' సంస్థలో భాగమయ్యారు. సహోద్యోగి రాహుల్ జైన్ కూడా వారితో కలిసి ప్రయాణిస్తున్నారు. భిన్న రంగాల నుండి వచ్చినా ఏకైక లక్ష్యంగా నడుస్తోంది ఆ మిత్రబృందం.

చిన్నప్పటి నుండి అమ్మానాన్నతో సైగలతో మాట్లాడిన నీతా తన మాతృభాష సైగల భాషే అంటారు. అమ్మానాన్నల దృష్టి కోణం నుండి ప్రపంచాన్ని చూసిన నీతాకి వైకల్యంతో బాధపడేవారికి అండగా నిలబడాలని బాల్యంలోనే బలంగా నాటుకుపోయింది. ఉన్నత చదువులు చదువుకుని, సైన్ లాంగ్వేజర్‌గా ప్రయాణం మొదలుపెట్టారు. మొదటగా చెవిటి, మూగ బాధిత స్కూలు పిల్లలకు సైన్ లాంగ్వేజ్ నేర్పించేవారు. 'వైకల్య బాధితులకు సమాజం నుండి వివక్ష ఎదురుకాకుండా ఉండాలంటే వారికి తమ శక్తిసామర్థ్యాలపై నమ్మకం కలగాలి. ఆ దిశగానే నేను ప్రయత్నించాను. కోవిడ్ సమయంలో మాకు చాలా విరామం దొరికింది. ఆ సందర్భంలో వైకల్య బాధిత పిల్లల ప్రాథమిక విద్య పట్ల ఆందోళన చెందాం. ఆ తరువాత కొనసాగిన ఆలోచనల్లోంచే 'యునికీ' ఆవిర్భవించింది.' అని వివరించారు నీతా.

'సమాజంలో అందరిలాగానే వినికిడి సమస్య ఉన్న వాళ్లు కూడా సమాన అవకాశాలు పొందాలి. వారి నైపుణ్యానికి తగిన ఉద్యోగాలు కల్పించాలి. దాని కోసం శిక్షణ కావాలి. ఇదే 'యునికీ' రూపకల్పన ప్రధాన లక్ష్యం. '2020లో 'యునికీ'ని ప్రారంభించాం. చెవిటి వ్యక్తులతో మాట్లాడితేనే వారి గురించి మనకు తెలుస్తుంది. కానీ మనం మాట్లాడే భాష వారికి తెలియదు. అందుకే చాలామంది వైకల్య బాధితులు ఆత్మనూన్యతతో బాధపడుతుంటారు. వాళ్లను గుర్తించేలా చేద్దామని సంస్థకు 'యునికీ' అని పేరు పెట్టాం. తెలుగులో దీనర్థం.. 'నన్ను గుర్తించు.. విస్మరించవద్దు' అని సంస్థ లక్ష్యం గురించి చైతన్య వివరించారు.

ఈ సంస్థ ద్వారా ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 50 వేల మంది నైపుణ్య శిక్షణ పొందారు. 10 వేల మంది పెద్ద వయసు వారికి సైగల భాష నేర్పించారు. వర్క్‌షాపులు, క్యాంపెయిన్‌లతో పాటు సోషల్‌మీడియా ద్వారా 'సైన్ మీడియం' గురించి విస్తృత ప్రచారం చేస్తున్నారు. స్టాక్ ట్రేడింగ్, వెబ్ డెవలప్‌మెంట్, ఐఇఎల్‌టిఎస్ వంటి 120 విభిన్న శిక్షణ తరగతులను 'యునికీ' ద్వారా నిర్వహిస్తున్నారు.

'సైన్ లాంగ్వేజ్ నేర్చుకోకముందు నేను ఎవరితోనూ మాట్లాడేవాడిని కాను. కానీ ఇక్కడ శిక్షణ పొందాక నా కుటుంబంతో చాలా స్వేచ్ఛగా మాట్లాడుతున్నాను. ఇక్కడ నేర్చుకున్న కోర్సు ద్వారా వెబ్ డెవలప్‌మెంట్ సెక్టార్‌లో ఉద్యోగం సంపాదించాను.' అని చెప్పాడు ఈ వర్క్‌షాప్‌లో భాగమైన దిబేందు.



## అమ్మ నోట బంగారు మాట..

**'చూడండి.. ఆ మైదానంలోకి ఆటగాళ్లు ఆడటానికి వచ్చారు. వారిలో ఒకరు ఓడతారని, మరొకరు గెలుస్తారని అందరికీ తెలుసు. వారు ఏ దేశం వారో.. ఏ రాష్ట్రం వారో అన్న దానిపై గెలుపు, ఓటమి ఆధారపడి ఉండవు. కాబట్టి ఆటను ఆటగా చూడండి. ఈ ఆటలో నా కొడుకు గెలవడం నాకు చాలా సంతోషంగా ఉంది. అలాగే ప్రత్యర్థి ఆటగాడు (పాకిస్తాన్) ప్రదర్శించిన ఆటతీరుపై కూడా నేను ఆనందంగా ఉన్నాను' అన్నారు సరోజాదేవి. ఆమె ప్రపంచ ఛాంపియన్ జావెలిన్ త్రో ఆటగాడు నీరజ్ చోప్రా తల్లి.**

ఆమె ఇంతలా ఎందుకు స్పందించారంటే.. నీరజ్ ఇటీవల బోడాపెస్ట్‌లో జరిగిన జావెలిన్ ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని స్వర్ణం సాధించి రికార్డు సృష్టించాడు. 'ఇంతవరకు ఏ భారతీయ ఆటగాడు సాధించని ఘనత ఇద'ని దేశం యావత్తు అతన్ని వేనోళ్ల కీర్తించింది. ఇంతవరకు బానే ఉంది. అయితే ఈ పోటీలో నీరజ్ తలపడింది పాకిస్తానీ ఆటగాడు అర్షద్ నదీమ్‌తో.. అదే పెద్ద సంచలనంగా చూశారు కొంతమంది అతి దేశభక్తులు.. దాయాది దేశ ఆటగాడితో పోరాడి గెలిచిన నీరజ్‌ని ప్రశంసలతో ముంచెత్తుతూ 'ఓ పాకిస్తానీ



ఆటగాడిపై మీ కొడుకు విజయం సాధించడాన్ని మీరెలా భావిస్తున్నార'ని ఓ దేశభక్త మీడియా రిపోర్టరు సరోజాదేవిని అడిగాడు. ఆ సందర్భంలోనే ఆమె పైవిధంగా స్పందించారు. ఆమె మాట్లాడుతున్న వీడియో సోషల్ మీడియాలో ఇప్పుడు వైరల్ అవుతోంది. 'కొడుకు స్వర్ణం గెలిస్తే.. అమ్మ బంగారం లాంటి మాటలు మాట్లాడార'ని ఎంతోమంది ఆమెని అభినందిస్తున్నారు.

రెండు కులాలు, రెండు మతాలు, రెండు దేశాల మధ్య సఖ్యత సహించలేని ఎంతోమంది ఇప్పటికీ ఇండియన్ క్రికెట్ టీమ్ పాకిస్తాన్ టీమ్‌తో తలపడే సందర్భాన్ని ఓ సంచలనంగా చూస్తారు. ఆటలో పాకిస్తాన్ ఓటమిని, భారత్ గెలుపుని చాలా ఉత్సాహంగా జరుపుకుంటారు. కానీ అది ఆట.. ఆటని ఆటలా చూడాలి.. పోటీలో పాల్గొనే వరకే ఇరు జట్లు ఒకరిపై ఒకరు పోరాట పటిమ చూపిస్తారు. ఎప్పుడైతే ఆట ముగుస్తుందో.. అప్పుడు ఆటగాళ్లంతా కరచాలనం చేసుకుంటూ, స్నేహపూర్వక ఆలింగం చేసుకుంటూనో కనపడడం మనం చాలాసార్లు చూశాం. నీరజ్ కూడా ఆట ముగిసిన వెంటనే నదీమ్‌ను ప్రేమగా దగ్గరకు తీసుకున్నాడు. ఆ తరువాత జరిగిన మీడియా సమావేశంలో కూడా 'మన రెండు దేశాలు ఆటలో పురోగతిని సాధిస్తున్నందుకు నేను చాలా గర్వపడుతున్నాను. ఎప్పటికీ ఇది ఇలానే కొనసాగాలి' అన్నాడు. కానీ, కొంతమందికి ఈ దృశ్యాలు మింగుడుపడవు. కులం పేరుతో మతం పేరుతో మనుషుల మధ్య.. అవకాశం వస్తే దేశాల నడుమ కూడా విద్వేషం చిమ్మేందుకు సిద్ధంగా ఉండే మనుషులకు ఇప్పుడు సరోజా దేవి వ్యాఖ్యలు చెంపపెట్టులా ఉన్నాయి.



## ఇన్‌స్టాలో అల్లు అర్జున్ ఒక రోజు..

అల్లు అర్జున్ తన ఇన్ స్టా స్టోరీలో ఫ్యాన్స్ కోసం సంథింగ్ స్పెషల్ ఉండనుందని మంగళవారం వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా తన ఇన్ స్టాలో ఆయన ఓ స్పెషల్ వీడియోను షేర్ చేశారు. అందులో తన వన్ డే లైఫ్ ఎలా ఉంటుందో చూపించారు. ఉదయం తన రోజు మొదలు చేయడం దగ్గర్నుంచి సాయంత్రం వరకు తాను ఏమేం చేస్తారనేది చూపించారు. ముందుగా ఇంట్లోని గార్డెన్‌లో యోగా చేయడం, ఆ తర్వాత తన పిల్లలతో వీడియో కాల్ మాట్లాడటం.. అక్కడి నుంచి పుష్ప సెట్‌కు వెళ్లడం, షూటింగ్‌లో పాల్గొనడం వంటి విషయాలను చూపించారు. ఆ వీడియోలో పుష్ప షూటింగ్ సెట్ లొకేషన్స్, హీరో క్యాస్ట్యూమ్స్, కేరవాన్, ప్రాపర్టీస్ అన్నింటిని చూపించారు.


## ఆనంద్ దేవరకొండ మరో సినిమా

బేబీ సినిమా హీరో ఆనంద్ దేవరకొండకు మరో సినిమాకు అవకాశం వచ్చింది. తమిళ నిర్మాత జ్ఞానవేల్ రాజాతో ఒక చిత్రానికి ఆనంద్ సంతకం చేశాడు. ఈ సినిమాను ఏఆర్ మురుగదాస్ బృందం నుంచి ఒక కొత్త డైరెక్టర్ ఈ ప్రాజెక్టను పట్టాలెక్కించనున్నాడట. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. హీరోయిన్‌గా ప్రగతి శ్రీవాస్తవను ఎంపిక చేసినట్లుగా సమాచారం. శ్రీకాంత్ అడ్డాల 'పెద్ద కాపు' సినిమాలో ఆమె నటిస్తున్న విషయం తెలిసిందే.

## 'స్కంద' 'డుమ్మారే డుమ్మా..' సాంగ్




రామ్ పోతినేని, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కిన సినిమా 'స్కంద'. సెప్టెంబర్ 15న రిలీజ్ కానున్న ఈ మూవీ నుండి తాజాగా 'డుమ్మారే డుమ్మా' అనే లిరికల్ సాంగ్ విడుదలైంది. ఈ పాటకు కళ్యాణ చక్రవర్తి సాహిత్యం అందించారు. రామ్ పోతినేని, ఫ్యామిలీ, సాయీ మంజ్రేకర్ పైన కంపోజ్ చేసిన ఈ సాంగ్‌ని అర్మాన్ మాలిక్ పాడారు. తమన్ సంగీతం అందించారు. శ్రీనివాస్ చిట్టూరి, పవన్ కుమార్ నిర్మాణంలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్, జీ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.



## 19న 'అతిథి' రాక!

వేణు తొట్టెంపూడి డిజిటల్ ఎంట్రీ ఇస్తున్న వెబ్ సిరీస్ 'అతిథి' స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్ అయింది. డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ఈ వెబ్ సిరీస్‌ను రూపొందించారు. ఈ వెబ్ సిరీస్‌ను రాండమ్ ఫ్రేమ్స్ ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్‌పై దర్శకుడు భరత్ వైజీ డైరెక్ట్ చేశారు. దర్శకుడు ప్రవీణ్ సత్తారు షో రన్నర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ డేట్‌ను డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ప్రకటించింది. సెప్టెంబర్ 19 నుంచి 'అతిథి' వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కానున్నట్టు వెల్లడించారు.

## త్వరలో పెళ్లి చేసుకుంటా : నగ్మా



త్వరలోనే తాను పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నానని హీరోయిన్ నగ్మా తెలిపింది. 48 ఏళ్ల వయసున్న నగ్మా తాజాగా తన పెళ్లి గురించి స్పందించింది. 'నాకంటూ ఓ తోడు ఉండాలి, పిల్లలుండాలని నా ఆశ. పెళ్లి ద్వారా ఓ కుటుంబాన్ని ఏర్పరుచుకోవాలని ఉండేది. కాలం కలిసొస్తే త్వరలోనే నా పెళ్లి జరుగుతుందేమో చూద్దాం. నిజంగా పెళ్లయితే మాత్రం చాలా హ్యాపీగా ఫీలవుతాను.' అని పేర్కొన్నారు. 'పెద్దింటి అల్లుడు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నగ్మా ... తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, భోజ్‌పురి, పంజాబీ, బెంగాలీ, మరాఠి భాషల్లోనూ హీరోయిన్‌గా రాణించింది. తెలుగు వెండితెరకు దూరమై దాదాపు 20 ఏళ్లవుతోంది. 2008లో నటనకు గుడ్‌బై చెప్పి, రాజకీయాల్లో ప్రవేశించింది.

# పెగూల, వోండ్రుసోవా శుభారంభం


వోండ్రుసోవా


పెగూల

- అన్‌సీడెడ్ చేతిలో ఓడిన గార్సియా
- యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

**న్యూయార్క్:** యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో 2వ సీడ్ సబలెంకా(రష్యా), 3వ సీడ్ పెగూలా(అమెరికా), 9వ సీడ్ వోండ్రుసోవా(చెక్) శుభారంభం చేయగా.. 7వ సీడ్ గార్సియా(ఫ్రాన్స్) తొలిరౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. మంగళవారం రాత్రి జరిగిన తొలిరౌండ్ పోటీల్లో పెగులా 6-2, 6-2తో జియోర్గి(ఇటలీ), వోండ్రుసోవా 6-3, 6-0తో హాన్స్(కొరియా)పై సునాయాసంగా విజయం సాధించారు. ఇక గార్సియా(ఫ్రాన్స్) 4-6, 1-6తో వాంగ్(చైనా) చేతిలో ఓటమిపాలైంది. మరో పోటీలో 17వ సీడ్ కీస్(అమెరికా) 6-2, 6-4తో ఆర్కంకా రస్(నెదర్లాండ్స్)పై, 25వ సీడ్ ప్లిస్కోవా(చెక్) 6-1, 6-4తో రూసే(జర్మనీ)పై, కెనిన్ (అమెరికా) 7-6(7-2), 6-4తో బోర్డన్(జర్మనీ)పై గెలిచారు. ఒక 12వ సీడ్ క్రేజీకోవా(చెక్) 4-6, 6-7(3-7)తో అన్‌సీడేడ్ బ్రోంజెట్టి(ఇటలీ) చేతిలో ఓటమిపాలైంది.

**అల్కరాజ్ సునాయాసంగా..**

టాప్‌సీడ్ కార్లోస్ అల్కరాజ్(స్పెయిన్) శుభారంభం చేశాడు. తొలిరౌండ్‌లో అల్కరాజ్ 6-2, 3-2తో ఆధిక్యతలో ఉన్న దశలో కూఫర్(జర్మనీ) గాయం కారణంగా మ్యాచ్‌నుంచి వైదొలిగాడు. ఇతర పోటీల్లో 5వ సీడ్ సిన్నర్(ఇటలీ) 6-3, 6-1, 6-1తో హంట్మన్(జర్మనీ)పై, 26వ సీడ్ ఎవాన్స్(బ్రిటన్) 6-4, 6-2, 7-5తో గలన్(కొలంబియా)పై సునాయాసంగా నెగ్గి రెండోరౌండ్‌లోకి ప్రవేశించారు. ఇక స్విట్జర్లాండ్‌కు చెందిన వావ్రింకా 7-6(7-5), 6-2, 6-4తో నిషియెకా(జపాన్)పై గెలుపొందగా.. ఐదుసెట్ల హోరాహోరీ పోరులో హుర్కోరాజ్, చైనాకు చెందిన యు గెలిచారు. హుర్కోరాజ్(పోలండ్) 4-6, 5-7, 7-6(7-5), 6-3, 6-1తో హుస్టర్(స్విట్జర్లాండ్)పై, చైనాకు చెందిన యు 3-6, 6-4, 2-6, 6-4, 6-2తో లాజోవిక్(క్రొయేషియా)పై నెగ్గి ముందుకు దూసుకెళ్లారు.

# జయహో.. ప్రజ్ఞానంద...

**చెన్నై విమానాశ్రయంలో ఘన స్వాగతం • రూ.30లక్షల చెక్ అందజేత**



విమానాశ్రయంలో ప్రజ్ఞానందకు స్వాగతం పలుకుతున్న అధికారులు


ప్రజ్ఞానందకు మెమొంటోనూ బహుకరిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్

**చెన్నై:** అజర్ బైజాన్‌లో జరిగిన ఫిడే ప్రపంచకప్ రన్నరప్‌గా నిలిచిన 18ఏళ్ల ప్రజ్ఞానందకు చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం లభించింది. తమిళనాడు ప్రభుత్వ అధికారులు, కళాకారులు, విద్యార్థులు, అభిమానులు పూలు చల్లుతూ, అభినందనలు తెలుపుతూ స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి బయటకు వచ్చిన ప్రజ్ఞానందను చూసేందుకు అభిమానులు, మీడియా సభ్యులు అత్యధిక సంఖ్యలో విచ్చేశారు. అలాగే ప్రజ్ఞానందకు స్వీట్లు, బొకేలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజ్ఞానంద మాట్లాడుతూ.. తనను ఆహ్వానించడానికి ఇంతమంది రావడం చాలా సంతోషంగా ఉందని, ఇది నిజంగా నమ్మశక్యం కావడం లేదన్నాడు. క్రికెట్ స్టార్లకు మాత్రమే ఇంతటి గౌరవం దక్కుతుందని, తనకు ఆ విధమైన ప్రశంసలు, అభిమానులు రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నాడు. తాను పాల్గొనే ప్రతి టోర్నమెంట్‌కు తన తల్లి నాగలక్ష్మి హాజరయ్యేదని, ఎక్కడ బసచేసినా భోజనాన్ని తయారుచేసే బాధ్యతను ఆమె తీసుకొనేదని అన్నాడు. జర్మనీలోని డ్యూసెల్‌డార్ఫ్‌లో జరిగిన ఫిడే ప్రపంచ ర్యాపిడ్ టీమ్ ఛాంపియన్‌కు, అజర్‌బైజాన్‌లోని బాకు వేదికగా జరిగిన ప్రపంచకప్ చెస్ ఛాంపియన్‌షిప్‌లకు ఆమె చేతి వంట సాంబారు అన్నం మాత్రమే తిన్నానని అన్నాడు.

**ర్యాంకింగ్స్‌లోనూ పైపైకి..**

ప్రపంచకప్ చెస్ రన్నరప్‌గా నిలిచిన ప్రజ్ఞానంద కెరీర్‌లోనే అత్యధిక రేటింగ్స్ సాధించాడు. రన్నరప్‌గా నిలవడంతో 2727.2 పాయింట్లు సొంతం చేసుకున్నాడు. అంతేకాదు లైవ్ రేటింగ్స్‌లో టాప్ 20 ర్యాంక్‌లో నిలిచాడు. టైటిల్ నెగ్గిన కార్ల్‌సన్ టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ప్రజ్ఞానంద భారత సీనియర్ గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్, చదరంగం లెజెండ్ గ్యారీ కాస్పరోవ్‌ల నుండి ప్రశంసలు పొందాడు. ట్విటర్ వేదికగా కాస్పరోవ్ 'కష్టమైన ఎత్తులతో ప్రత్యర్థి ముందు దృఢంగా ఉంటాడు' అని పేర్కొన్నాడు.

**తమిళనాడు సిఎం స్టాలిన్ రూ.30 లక్షల చెక్కు అందజేత**

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ప్రజ్ఞానంద తన కుటుంబసభ్యులతో కలిసి కలిశాడు. ఈ సందర్భంగా స్టాలిన్ ప్రజ్ఞానందను ప్రశంసలతో ముంచెత్తారు. తమిళనాడుతోపాటు యావత్ దేశం గర్వించేలా గొప్ప ప్రదర్శన కనబర్చావంటూ కొనియాడారు. అలాగే ప్రోత్సాహకంగా రూ.30 లక్షల చెక్కును అందించి మెమొంటోను బహుకరించారు. క్రీడాశాఖమంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా ప్రజ్ఞానందను శాలువాతో సత్కరించారు.



## శ్రీలంక చేరుకున్న టీమిండియా ఆటగాళ్లు

**కొలంబో:** ఆసియాకప్ క్రికెట్ టోర్నీలో ఆడేందుకు భారత ఆటగాళ్లు శ్రీలంక చేరుకున్నారు. బుధవారం ఉదయం కొలంబో ఎయిర్‌పోర్ట్‌లో దిగిన వీడియోలను బిసిసిఐ ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. కేఎల్ రాహుల్ 100% ఫిట్‌నెస్ సాధించకపోవడంతో అతడు జట్టుతో శ్రీలంకకు వెళ్లలేదు. ఈ టోర్నీ అనంతరం వన్డే ప్రపంచకప్ ఉన్న దృష్ట్యా టీమిండియా ఆటగాళ్ల ప్రదర్శనపై బిసిసిఐ దృష్టి సారించింది. ఈ ఏడాది ఆసియాకప్ శ్రీలంక, పాకిస్తాన్ వేదికగా హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తుండగా.. భారత్ ఆడే మ్యాచ్‌లకు శ్రీలంక వేదిక కానుంది. భారతజట్టు తన తొలి లీగ్ మ్యాచ్‌ను సెప్టెంబర్ 2న పల్లెకెలె వేదికగా పాకిస్తాన్‌తో తలపడనుంది. ఇప్పటివరకు అత్యధికంగా ఏడుసార్లు ఆసియాకప్ కైవసం చేసుకున్న భారత్.. ఈసారి కూడా కప్పు కొట్టాలనే పట్టుదలతో శ్రీలంకకు బయల్దేరింది.

## బాబర్, ఇఫ్తికార్ సెంచరీలు

**నేపాల్‌పై 238పరుగుల తేడాతో పాకిస్తాన్ గెలుపు**

**ముల్తాన్:** ఆసియా కప్ 2023లో పాకిస్తాన్ జట్టు 238పరుగుల తేడాతో నేపాల్‌పై గెలిచింది. గ్రూప్-ఏలో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ నిర్ణీత 50 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 342 పరుగులు చేసింది. కెప్టెన్ బాబర్ అజామ్(151), ఇఫ్తికార్(109నాటౌట్) సెంచరీలతో కదం తొక్కారు. 124పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ పాక్‌ను బాబర్-ఇఫ్తికార్ కలిసి 5వ వికెట్‌కు 218పరుగులు జతచేశారు. ఛేదనలో నేపాల్ జట్టు 23.4ఓవర్లలో 104పరుగులకు ఆలౌటైంది. షాదాబ్‌కు నాలుగు, షాహిన్, రవూఫ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బాబర్‌కు లభించగా.. నేడు శ్రీలంక-బంగ్లాదేశ్‌ల మధ్య మ్యాచ్ జరగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68